సోమవారం
21-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 300
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

రికార్డు స్థాయిలో యూపీఐ చెల్లింపులు

న్యూఢిల్లీ: మన దేశంలో యూపీఐ లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఇలా చెల్లింపులు చేయడంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా నిలిచిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. మన దేశంలో ప్రతి నెలా 1800 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని ఐఎంఎఫ్ తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో రూ.24.03 లక్షల కోట్లు యూపీఐ ద్వారా బదిలీ అయ్యాయి. మొత్తం 18.39 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో 13.88 బిలియన్

- మిగతా 2 లో

బీజేపీ విభజన రాజకీయాలు

ప్రతిఘటిద్దాం

అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుదాం

సీపీఐ బీహార్ సమితి సమావేశంలో డి.రాజా

పట్నా: బీజేపీ విభజన రాజకీయాలను ప్రతిఘటిద్దామని, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుదామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకించారు. సామాన్యుల ఓటు హక్కును హరించే విధానాన్ని సీపీఐ వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఆదివారం పట్నాలో జరిగిన సీపీఐ బీహార్ రాష్ట్రసమితి సమావేశాలకు డి.రాజా హాజరయ్యారు. తొలుత పట్నా విమానాశ్రయంలో ఆయనకు సీపీఐ నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. డి.రాజా మాట్లాడుతూ ఎస్ఐఆర్‌ను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఓటు హక్కు పరిరక్షణకు పోరాడతామన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతోందని, సీపీఐ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరింతగా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. సెప్టెంబరు 21-25 తేదీల్లో చండీగఢ్‌లో జరగబోయే సీపీఐ జాతీయ మహాసభల జయప్రదానికి కృషి చేయాలని కోరారు. ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్యపార్టీలు ఐక్యంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, ఎవరికివారు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం వల్ల నష్టం వాటిల్లుతుందని డి.రాజా హెచ్చరించారు. రాజ్యాంగ విలువలు కాపాడుకోవాలని, బీజేపీ విభజన రాజకీయాలను ప్రతిఘటించాలని నొక్కిచెప్పారు. ఇండియా ఐక్య సంఘటనలో సైద్ధాంతిక-రాజకీయ అంతరాలు తగ్గించడంలో సీపీఐ

- మిగతా 2 లో

ఆలయాల అభివృద్ధికి

రూ.1,290 కోట్లు

లాల్ దర్వాజా బోనాల ఉత్సవంలో భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్: బోనాలు అంటే తెలంగాణ సంస్కృతి. దీన్ని అనాదిగా ఆచరిస్తూ వస్తున్నారు భక్తులు. గోల్కొండలో మొదలయ్యే బోనాల ఉత్సవాలు సికింద్రాబాద్ నుంచి లాల్ దర్వాజాలో వెలసిన సింహవాహిని మహంకాళి వరకు జరుగుతాయి. అత్యంత ప్రశాంతంగా భక్తి ప్రపత్తులు, ఆనందదాయకంగా నగరంలో బోనాల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి కి ప్రభుత్వం రూ.1,290 కోట్లు కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేసింది. హైదరాబాద్ మహానగరంలో జరిగే బోనాల ఉత్సవాలకు రూ.20 కోట్లు ప్రత్యేకంగా విడుదల చేశారు. ఉత్సవాలను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదివారం అమ్మవారికి పట్టు వస్త్రములు సమర్పించారు. లాల్ దర్వాజా మహంకాళి అమ్మవారి చల్లని చూపులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ప్రజలందరి తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వేడుకున్నారు. ఆలయాల అభివృద్ధి కి కట్టుబడి ఉన్నామని గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన విషయాన్ని ఉపముఖ్యమంత్రి గుర్తు చేశారు. భవిష్యత్తులో మహంకాళి ఆలయం చుట్టూ ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

మన సంస్కృతికి ప్రతీక: మంత్రి శ్రీధర్

ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హరిబౌలీలోని అక్కన్న మాదన్న ఆలయంలో అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...బోనాలు కేవలం ఒక ఉత్సవం కాదు... మన తెలంగాణ జీవన విధానం, తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. మన సమష్టి సంకల్పానికి, పౌరుషానికి, ఐక్యతకు, ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి, మన ఘనమైన చరిత్రకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. బోనాలు... ఈ పదం కేవలం ఒక పండగను కాదు, మన తెలంగాణ మట్టి వాసనను, అమ్మ ప్రేమను, మన ఆత్మశక్తిని గుర్తు చేస్తుందన్నారు. గడపగడపనా వెల్లివిరిసే ఈ సంబురం, డప్పుల మోతలో ప్రతిధ్వనించే మన చరిత్ర, బోనాల్లో కనిపించే భక్తి, ఇవన్నీ

మన తెలంగాణ జీవన విధానానికి ప్రాణం అని పేర్కొన్నారు. సకల సృష్టికి మూలం, సమస్త లోకాలను కాపాడే శక్తి అమ్మవారని, ఆమె చల్లని దీవెనలు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని వేడుకున్నానన్నారు. ప్రతి ఒక్కరూ నిండు నూరేళ్లు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆ తల్లిని ప్రార్థించానన్నారు. ఆమె చల్లని దయతో

- మిగతా 2 లో

మిథున్‌రెడ్డికి

రిమాండ్

- రాజమండ్రి జైలుకు తరలింపు
- మద్యం కేసులో 48 మందికి చేరిన నిందితులు
- సిట్ నివేదికలో సంచలన విషయాలు
- మాజీ సీఎం జగన్ పేరు ప్రస్తావన
- 20 రోజుల్లో రెండో ఛార్జిషీట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కుంభకోణం కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో శనివారం అరెస్టయిన వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు ఆగస్టు 1వరకు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు మిథున్‌రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఇప్పటివరకు అరెస్టయిన నిందితులను సిట్ ఆగస్టు 1న కోర్టులో ప్రవేశపెట్టనుంది. మద్యం కేసులో ఆదివాకం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఈ మేరకు న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. తొలుత వైద్యపరీక్షల అనంతరం విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జి ముందుకు మిథున్‌రెడ్డిని ప్రవేశపెట్టారు. కోర్టులో మిథున్ రెడ్డి తరఫున న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించగా... సిట్ తరఫున న్యాయవాది కోటేశ్వరరావు వాదనలు

- మిగతా 2 లో

నడి సముద్రంలో తగలబడ్డ నౌక

జకార్తా: ఇండోనేషియా తీరంలో ఓ నౌక ప్రమాదానికి గురైంది. పూర్తిగాస్థాయిలో మంటల్లో చిక్కుకుంది. అక్కడ నల్లటి పొగ కమ్మేసింది. భయాందోళనకు గురైన ప్రయాణికులు మంటల నుంచి తప్పించుకోవడానికి సముద్రంలోకి దూకారు. ఐదుగురు మరణించగా, 18 మంది గాయపడినట్లు తెలిసింది. సహాయక చర్యలలో స్థానిక మత్స్యకారులు సైతం పాల్గొన్నారు. ప్రమాదం జరిగినప్పుడు నౌకలో ఎంత మంది ఉన్నారో లెక్క తేలలేదు. 284 మందిని రక్షించినట్లు అధికారులు వెల్లడించారు.

మలేరియాపై పోరుకు ఐసీఎంఆర్ కొత్త వ్యాక్సిన్

న్యూఢిల్లీ: మలేరియాను నివారించడంలో భారత్ మరో ముందడుగు వేసింది. దేశంలో మలేరియాను రూపుమాపడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అడ్‌ఫాల్సీవాక్స్ అనే బహుళ-దశల స్వదేశీ రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తోంది. ఐసీఎంఆర్ దాని ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం- భువనేశ్వర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ ద్వారా బయో టెక్నాలజీ విభాగం-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ

- మిగతా 2 లో

ప్రధాని మాట్లాడతారా... లేదా?

- ఆపరేషన్ సిందూర్, ఎస్ఐఆర్, ట్రంప్ వ్యాఖ్యలపై సమాధానం ఇవ్వాలి
- అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్
- అన్ని అంశాలపై చర్చకు సిద్ధమన్న కేంద్రం

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ యుద్ధం ఆపేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, బీహార్‌లో ఎస్ఐఆర్ వంటి అనేక అంశాలపై పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. తాము లేవనెత్తిన అంశాలపై పార్లమెంటులో ప్రధాని స్పందించాలని విజ్ఞప్తి చేశాయి. సంప్రదాయం ప్రకారం పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు రోజు ఆదివారం అఖిలపక్ష సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వ ఏర్పాటు చేసింది. ప్రతిపక్షాలు లేవనెత్తే అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధమని ప్రభుత్వం తెలిపింది. చట్టసభలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరింది. అయితే బీహార్‌లో ఓటర్ల జాబితా పున:పరిశీలన, పహల్గాం ఉగ్రదాడి, కాల్పుల విరమణపై ట్రంప్ వ్యాఖ్యలు తదితర అంశాలను ప్రతిపక్ష నాయకులు లేవనెత్తారు. వీటన్నింటిపై స్పష్టత కోరారు. పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రకటన కోసం డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును హరించేదిగా ఎస్ఐఆర్ ప్రక్రియ ఉందని 'ఇండియా' నాయకులు ఆరోపించారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ కోసం ట్రంప్ దౌత్యం, పహల్గాం ఉగ్రదాడి, ఉగ్రవాదులను చట్టం ముందు నిలబెట్టడంలో వైఫల్యం తదితర అనేక అంశాలపై మోదీ ప్రకటన చేయాలన్నారు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వానికి ప్రతిపక్షానికి మధ్య సమన్వయం ఉంటేనే పార్లమెంటు సజావుగా సాగగలదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. అఖిలపక్ష సమావేశానికి రిజిజుతో పాటు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘువాల్, కాంగ్రెస్ తరఫున జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ఎన్‌సీపీ-శరద్ పవార్ పార్టీ నుంచి సుప్రియా సూలే, డీఎంకే నేత టీఆర్ బాలు, ఆర్‌పీఐ(ఎ) నాయకుడు రామ్‌దాస్ అథవాలే తదితర పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం అనంతరం గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ పహల్గాం దాడికి దారితీసిన

- మిగతా 2 లో

నేటి నుంచి పార్లమెంట్

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో సర్కారును ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన అన్ని అస్త్రాలతో సిద్ధమైంది. అధికార-ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చలతో ఉభయసభలు దద్దరిల్లనున్నాయి. పార్లమెంటు సమావేశాలు ఆగస్టు 21వ తేదీ వరకు మొత్తం 21 సిట్టింగుల్లో జరగనున్నాయి. మధ్యలో ఆగస్టు 12 నుంచి 18వ తేదీ వరకు పండుగల సెలవులు ఉన్నాయి. ఈసారి సమావేశాల్లో పాత ఏడు బిల్లులతో పాటు కొత్తగా ఎనిమిది బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనున్నది.

నియోజకవర్గాల పునర్విభజనతో

దక్షిణాదికి తీవ్ర నష్టం

- హిందీని బలంతంగా రుద్దుతామంటే ఊరుకోం
- కోట్లాదిమందిని ఐక్యంగా ఉంచేది భారతీయత మాత్రమే
- మోదీ ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం
- 'టాక్ జర్నలిజం' చర్చా వేదికలో కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: ఉత్తర భారతదేశ ఎంపీల సంఖ్య ఆధారంగా నిర్ణయించబడే కేంద్ర ప్రభుత్వం... దక్షిణ భారతదేశ ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అవకాశం ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం... కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారడం సమాఖ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. జైపూర్‌లో జరుగుతున్న 'టాక్ జర్నలిజం' తొమ్మిదో ఎడిషన్ చర్చా కార్యక్రమానికి హాజరైన ఆయన ... జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గ పునర్విభజనలో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మంద బలం, అధికారం ఉందన్న అహంకారంతో జాతీయ భాషగా హిందీని బలవంతంగా రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయని స్పష్టం చేశారు. బీహార్‌లో జరుగుతున్న ఎన్నికల సర్వే పై స్పందిస్తూ... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో అర్హత కలిగిన ఏ ఒక్కరూ తన ఓటు హక్కును కోల్పోకూడదు అన్నారు. బీహార్‌లో ఓటర్ల సవరణపై తీవ్ర విమర్శలు వస్తున్నాయని, భారత ఎన్నికల కమిషన్ ఏం చేస్తుందని నిలదీశారు. దేశంలోని ఓటర్లు రాజకీయ పార్టీలు, వ్యవస్థ మీద చాలా అసంతృప్తిగా ఉన్నారని, నగరాల్లో ఓటింగ్ శాతం చాలా తక్కువగా ఉండడం ఇందుకు ఒక కారణమని అభిప్రాయపడ్డారు. బీహార్లో ఐదు లక్షల ఓట్లు గల్లంతయ్యాయని అంటున్నారు, ఇది చాలా ఆందోళన

- మిగతా 2 లో

రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నజరానా

విశాలాంధ్ర - హైదరాబాద్: సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌కు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారు. బోనాల పండగ సందర్భంగా రూ.కోటి నగదు పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. పాతబస్తీ కుర్రోడిగా మొదలైన రాహుల్ ప్రస్థానం... ఆర్.ఆర్.ఆర్ సినిమాలో 'నాటు నాటు' పాట ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ దాకా వెళ్లింది. సొంత కృషితో ఎదిగిన అతడు తెలంగాణ యువతకు మార్గదర్శకుడు అని ముఖ్యమంత్రి ప్రకటించారు. గత ఎన్నికలకు ముందు జరిగిన ఓ కార్యక్రమంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.పది లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.కోటి ఇస్తామని చెప్పారు. ఇటీవల గద్దర్ అవార్డుల సందర్భంగా కూడా ప్రత్యేకంగా రాహుల్ సిప్లిగంజ్ ను ప్రస్తావించారు. ఆమేరకు ఆదివారం పాతబస్తీ బోనాల పండగను పురస్కరించుకుని నజరానా ప్రకటించారు.

ఇదీ లోకం!

ఈ రాజ్యాంగం మనకు అనుకూలంగా మార్చుకుంటే పోలా!

కమ్యూనిజం అజరామరం

- అవసరమైతే స్థానిక సమరంలో ఒంటరి పోరు
- 5 లక్షల మందితో శత జయంతి వేడుక
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: కమ్యూనిజం అజరామరమని, భూమిపై మనిషి మనుగడ ఉన్నంత వరకు కమ్యూనిస్టు సిద్ధాంతం, కమ్యూనిస్టులు ఉంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వందేళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ అనేక పోరాటాలు, త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. రాబోయే వందేళ్ల వరకు నిత్య యవ్వనంతో, సిద్ధాంతంతో ప్రజాక్షేత్రంలోనే ఉంటుందని కూనంనేని స్పష్టం చేశారు. సీపీఐ చుంచుపల్లి మండల 8వ మహాసభ ఎన్‌కేనగర్‌లోని కమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. సభా ప్రాంగణం సీపీఐ జెండాలతో

- మిగతా 2 లో

ఏపీలో పరిశ్రమలకు పునరుత్తేజం

- ఇంటికొక వ్యాపార వేత్త లక్ష్యంగా ముందుకు
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ సహకారం అందించేందుకు నడుంబిగింపు
- ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ బిజినెస్ దిశగా అడుగులు

ప్రభుత్వం ఇంటికొక వ్యాపారవేత్తను తయారు చేసేందుకు 'వన్ ఫ్యామిలీ... వన్ ఎంట్రప్రెన్యూర్ అనే లక్ష్యాన్ని 2030 నాటికి చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తోంది. రాబోయే ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 22 లక్షల ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసేలా సహకారం అందిస్తోంది.

8లో

ప్రకృతి విలయాలు

- చైనాలో టైఫూన్ వైఫా బీభత్సం: 400 భవనాలు ధ్వంసం
- పాకిస్థాన్‌ను ముంచెత్తిన వర్షాలు: 203 మంది మృతి
- ఇరాన్, తజికిస్థాన్‌లో స్వల్ప భూకంపాలు -భారత్‌లోనూ ప్రకంపనలు

బీజింగ్/కరాచీ/టెహ్రాన్/మాస్కో: ప్రకృతి విలయాలతో చైనా, పాకిస్థాన్, ఇరాన్, తజికిస్థాన్, రష్యా తదితర దేశాలు అతలాకుతలమయ్యాయి. చైనాలో టైఫూన్ వైఫా బీభత్సం సృష్టించింది. పాకిస్థాన్‌ను వర్షాలు, వరదలు మెంచెత్తాయి. ఇరాన్, తజికిస్థాన్, రష్యా దేశాలను భూకంపాలు వణికించాయి. టైఫూన్ వైఫా ప్రభావంతో హాంగ్‌కాంగ్‌లో అతిభారీ వర్షాలు కురిశాయి. గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ముంపు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనవసర ప్రయాణాలు వద్దని సూచించారు. వర్షాలు, ఈదురు గాలులతో భారీ వృక్షాలు నేలకొరిగాయి. సుమారు 400 భవనాలు ధ్వంసమయ్యాయి. అలాగే, పాకిస్థాన్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరదలొచ్చాయి. ఈ కారణంగా సంభవించిన వేర్వేరు ఘటనల్లో చనిపోయిన వారి సంఖ్య 203కు పెరిగింది. మరో 562 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. వరదలతో ఇళ్లు నేలకూలాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో చెరువులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. స్నానాలు, ఈతకు వెళ్లవద్దని పాక్ ప్రభుత్వం హెచ్చరించింది. దక్షిణ బలూచిస్థాన్, సింధ్, ఇస్లామాబాద్ సహా అనేక చోట్ల వర్షాలు అతిభారీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పాకిస్థాన్ వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు ఇరాన్‌లో ఆదివారం తెల్లవారుజామున భూకంపం వచ్చింది. దీని తీవ్రత 5.2గా నమోదైంది. భూగర్భంలో నాలుగు కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు సంభవించాయని యూరోపియన్ మెడిటేరనియన్ సీస్మోలాజికల్ తెలిపింది. అటు తజికిస్తాన్‌లోనూ తెల్లవారుజామున భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 160 కిలోమీటర్ల లోతులో ఉందని గుర్తించారు. ఇదిలావుంటే, భారత్‌లోని అసోంలో నాగావ్ జిల్లాలో 2.9 తీవ్రతతో అర్ధరాత్రి 12.56 గంటలకు భూకంపం వచ్చింది. భూకంప కేంద్రాన్ని 40 కిలోమీటర్ల లోతులో గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. గత నెల 21న ఇరాన్‌లో భూ ప్రకంపనలు సంభవించాయి. సెమ్నాన్‌లో 5.2 తీవ్రతతో భూమి కంపించింది. 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు.

రష్యాలో భారీ భూకంపం: సునామీ హెచ్చరికలు జారీ

రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైంది. దీంతో కమ్చట్కా ద్వీప కల్పానికి, హవాయిలోని కొన్ని ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ హెచ్చరికలను పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం జారీ చేసింది. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. భూకంప కేంద్రం పెట్రో పావ్లోవ్స్క్-కామ్చట్కా నగరానికి తూర్పున 144 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహా సముద్రంలో గుర్తించారు. అంతకుముందు దాదాపు గంటలోనే ఐదుసారు భూకంపాలు నమోదైనట్లు యూఎస్ జీఎస్ తెలిపింది. వీటిల్లో 7.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల సునామీ వచ్చే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది.

సౌదీ 'స్లీపింగ్ ప్రిన్స్' కన్నుమూత

దుబాయ్: స్లీపింగ్ ప్రిన్స్'గా గుర్తింపు తెచ్చుకున్న సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ (36) కన్నుమూశారు. గత 20 ఏళ్లుగా ఆయన కోమాలో ఉన్నారు. కారు ప్రమాదం తీవ్రంగా గాయపడిన సౌదీ యువరాజు దాదాపు 20 ఏళ్లుగా కోమాలో ఉన్నారు. స్లీపింగ్ ప్రిన్స్ మరణ వార్తను ఈ మేరకు గ్లోబల్ ఇమామ్స్ కౌన్సిల్ ధ్రువీకరించింది. కుటుంబానికి సానుభూతి తెలిపింది. అల్ వలీద్ తండ్రి ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ కూడా తన కుమారుడు మరణించినట్లు ఎక్స్ మాధ్యమంగా వెల్లడించారు. 1990, ఏప్రిల్‌లో జన్మించిన అల్ వలీద్ బ్రిటన్‌లోని మిలిటరీ కాలేజీలో చదువుకుంటూ 2005లో కారు ప్రమాదంలో గాయపడ్డారు. అప్పటి నుంచి కోమాలో ఉన్నారు. ఆయనకు రియాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ట్యూబ్ ద్వారా ఆహారం అందించేవారు. వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నప్పటికీ కోలుకునే అవకాశం లేదని భావించి 2015లో దాన్ని తొలగించాలని వైద్యులు సిఫార్సు చేశారు. కానీ ఆయన తండ్రి అందుకు ఒప్పుకోలేదు. 2019లో వలీద్ ఓ సందర్భంలో చేతివేళ్లు కదిలించడం, తలను తిప్పడం చేశారు. దీంతో యువరాజు కోలుకుంటారని అంతా ఆశించారు. కానీ ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేదు. ఇటీవల 36 ఏళ్లు రావడంతో యువరాజు కోలుకోవాలని మద్దతుదారులు పోస్టులు పెట్టారు. దీంతో ఆయన 'స్లీపింగ్ ప్రిన్స్'గా వార్తలో నిలిచారు.

తప్పిన ఘోర ప్రమాదం

గాల్లో ఉండగానే బోయింగ్ విమానం ఇంజిన్‌లో మంటలు

లాస్ ఏంజెల్స్: అమెరికాలో బోయింగ్ విమానానికి పెద్ద ప్రమాదం తప్పింది. అట్లాంటాకు వెళుతున్న డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 767-400 టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే విమానం ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. పైలట్ అప్రమత్తమై విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయడంతో ఘోర ప్రమాదం తప్పింది. విమానం లాస్ ఏంజెల్స్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ఎడమ ఇంజిన్‌లో మంటలు అంటుకున్నాయి. పైలట్ ఏటీసీకి సమాచారం ఇచ్చారు. లాస్ ఏంజెల్స్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. విమానంలో 282 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బంది, ఇద్దరు పైలట్లు కలిపి మొత్తం 294 మంది ఉన్నారు. ఏవియేషన్ ఏ2జెడ్ నివేదిక ప్రకారం, విమానం బయలుదేరిన వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. పైలట్లు సమాచారం ఇవ్వగానే స్పందించిన ఏటీసీ... ఎయిర్ పోర్టులో అత్యవసర సేవలకు విషయం తెలిపింది. విమానం దిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఇంజిన్‌లో మంటలు చెలరేగడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.

దక్షిణాదికి తీవ్ర నష్టం

(మొదటి పేజీ తరువాయి)

కలిగించే విషయమని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో కేవలం 12,500 ఓట్ల తేడాతోనే అక్కడ ఆర్జేడీ అధికారాన్ని కోల్పోయిందని, దేశంలో కోట్లాదిమందిని కలిపి ఉంచగలిగేది భారతీయత మాత్రమేనన్నారు. ముందు దేశం... ఆ తర్వాతే ప్రాంతం, మతం, కులమని చెప్పారు. ప్రతి రాష్ట్రానికి ఉన్న జనసంఖ్య ఆధారంగా పార్లమెంటులో ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం ఉండాలన్న లక్ష్యంతో గతంలో పునర్విభజన జరిగేదని, అందుకే గతంలో ప్రతి 10 సంవత్సరాలకు జనగణన, ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగేదని వివరించారు. జనాభా పెరగడం కారణంగా 1971 లో రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంటు స్థానాలను 543 వద్ద నిలిపివేశారన్నారు. 30 సంవత్సరాల తర్వాత మళ్లీ నియోజకవర్గ పునర్విభజన చేస్తామన్నారని, ఈలోపు కుటుంబ నియంత్రణ అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా దక్షిణ భారతదేశంలో కుటుంబ నియంత్రణలో పకడ్బందీగా అమలు చేశారని, 1948లో 26 శాతంగా ఉన్న దక్షిణ భారతదేశ జనాభా 19 శాతానికి తగ్గిందన్నారు. కానీ ఉత్తర భారతంలో అమలు చేయలేక ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 1950 నుంచి ఇప్పటివరకు 239 శాతం జనాభా పెరిగిందని అన్నారు. అదే కేరళలో 69 శాతం మాత్రమే అన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ నియంత్రణను అద్భుతంగా అమలుపరిచిన కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గ పునర్విభజనలో తక్కువ సీట్లు కేటాయిస్తామని అనడం అన్యాయం కాదా అని నిలదీశారు. కుటుంబ నియంత్రణ అమలు చేయని రాష్ట్రాలకు పార్లమెంట్లో ప్రాతినిధ్యాన్ని పెంచి దక్షిణాదికి తగ్గిస్తామనడం సమాఖ్య వ్యవస్థకు మంచిది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ముందుగా అందుబాటులో ఉండేది ఎమ్మెల్యేనే, అందుకే ఎమ్మెల్యే స్థానాలను పెంచాలన్నదే తమ పార్టీ అభిప్రాయం, ఇప్పుడున్న ఎంపీ స్థానాలని అలానే కొనసాగించాలన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరగనివ్వమని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెబుతున్న మాటల్ని నమ్మడం లేదన్నారు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో ఎమ్మెల్యే స్థానాలు పెంచుతామని చెప్పారు... కానీ ఇప్పటివరకు చేయలేదు... ఎవరూ అడగకముందే రాజకీయ ప్రయోజనాల కోసం జమ్మూకశ్మీర్, అస్సోంలో మాత్రం అసెంబ్లీ సీట్లను పెంచారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం తన రాజకీయ ప్రయోజనాలు, లక్ష్యాలకు అనుగుణంగానే పనిచేస్తుందని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం ఉంది ... మూకస్వామ్యం లేదు, తనకు ఇష్టం వచ్చినట్లు బీజేపీ చేస్తామంటే కుదరదని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పునర్విభజనపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. దేశానికి ఒక జాతీయభాష ఉండాల్సిన అవసరం లేదన్నారు. బలవంతంగా హిందీని రుద్దుతామంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. మన మధ్య ఎన్ని వైరుధ్యాలు ఉన్నా మనం కలిసే ఉన్నామని, ప్రజలు మాట్లాడని భాషలు కాలక్రమంలో కనుమరుగు అవుతాయన్నారు.

బీజేపీ విభజన రాజకీయాలు ప్రతిఘటిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యభూమిక పోషించిందని చెప్పారు. ఐక్య సంఘటన మరింత బలాన్ని చేకూర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయనన్నారు. సీపీఐ జాతీయ మహాసభలతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నట్లు రాజా వెల్లడించారు. సీపీఐ బీహార్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌నరేశ్ పాండే, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మాట్లాడతారా...లేదా?

(మొదటి పేజీ తరువాయి)

లోపాలు, ట్రంప్ వ్యాఖ్యలు, బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై మోదీ ప్రకటన కోసం తమ పార్టీ డిమాండ్ చేసిందన్నారు. సంజయ్ సింగ్ (ఆప్) మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఎన్నికల కుంభకోణమన్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ తమ వల్లే జరిగిందన్న ట్రంప్ వ్యాఖ్యలపై స్పష్టతివ్వాలని కోరినట్లు చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే ఇండియా ఐక్య సంఘటనలో ఉంటుందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. బీజేడీ నేత శస్మిత పాత్ర మాట్లాడుతూ రాష్ట్రాల్లో శాంతి భద్రతల వైఫల్యానికి బాధ్యత వహించకుండా కేంద్రం తప్పించుకోలేదని, దీనిపై పార్లమెంటులో చర్చించాలని అన్నారు. ఒడిశాలో కాలేజీ విద్యార్థి ఆత్మహత్య, మరో 15 ఏళ్ల బాలికకు దుండగలు నిప్పంటించిన ఘటనలు ప్రస్తావించారు. ఒడిశాలో శాంతి భద్రతలు క్షీణించాలయని, బీజేపీ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి ట్రంప్ వ్యాఖ్యలపై పార్లమెంటులో ప్రధాని మాట్లాడాల్సిందేనని డిమాండ్ చేశారు.

రికార్డు స్థాయిలో యూపీఐ చెల్లింపులు

(మొదటి పేజీ తరువాయి)

లావాదేవీలు కాగా... 32 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుతం 49.1 కోట్ల మంది సామాన్య ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐ సేవలు వినియోగిస్తున్నారు. 675 బ్యాంకులు యూపీఐ గొడుకు కిందకు వచ్చాయి. దేశంలో మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 85 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 50 శాతం ఒక్క భారతదేశంలోనే జరుగుతున్నాయి. భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ వంటి ఏడు దేశాల్లో యూపీఐ సేవలను అనుమతిస్తున్నాయి. బ్రిక్స్ సభ్య దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వు బ్యాంకు యోచిస్తోంది. సురక్షితమైన, వేగవంతమైన లావాదేవీల వల్ల యూపీఐ చెల్లింపులు ప్రజల్లో ఇంత ఆదరణ పొందాయి. 2016లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రారంభించిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయింది. అప్పటి నుంచి క్రమంగా యూపీఐ వాడకం పెరుగుతూ వస్తోంది. 'భారత్‌లో ఇప్పుడు నగదు, కార్డు ఆధారిత చెల్లింపులతో పోలిస్తే డిజిటల్ పేమెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయి. లక్షలాది ప్రజలు, చిన్న వ్యాపారులు దీనిపైనే ఆధారపడుతున్నారు. సురక్షితమైన, తక్కువ ధరకు అందుబాటులో ఉండడం ద్వారా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడడానికి యూపీఐ శక్తిమంతమైన సాధనంగా మారింది' అని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) తెలిపింది.

కమ్యూనిజం అజరామరం

(మొదటి పేజీ తరువాయి)

ఎరుపెక్కగా... మహాసభ ప్రారంభ సూచికగా అరుణపతాకాన్ని కూనంనేని ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు సీహెచ్ మాధవరావు, పి.రామచందర్, ఐదావత్ సుగుణ, తోట రాజు, పొలమూరి శ్రీనివాస్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. కూనంనేని మాట్లాడుతూ పేదలు, కార్మికులు, కర్షకుల కోసం పుట్టిన పార్టీ సీపీఐ అన్నారు. ప్రజల్లో అసమానతలు ఉన్నంతవరకు పార్టీ మనుగడ ఉంటుందన్నారు. అధికారం ఉన్నా... లేకున్నా సమసమాజ స్థాపనే ఏకైక లక్ష్యంగా త్యాగాలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పూటకో పార్టీ మారి... రోజుకో కండువా కప్పుకోవడం వర్తమాన రాజకీయాల్లో నీచ సంస్కృతికి నిదర్శనంగా మారిందన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ప్రజలకు మేలు చేసేందుకు పనిచేసే వారే నిజమైన నాయకులన్నారు. ఇప్పుడున్న కొన్ని రాజకీయ పార్టీలు బూర్జువా పోకడలతో అధికారం కోసం, ఆస్తుల సంపాదన కోసం లేదా ఆస్తుల రక్షణ కోసం వెంపర్లాడుతున్నాయని ఎద్దేవా చేశారు. తామే గెలిపించామంటూ కొందరు గొప్పలు పోతున్నారని, కానీ కమ్యూనిస్టులే లేకుంటే వారి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకుంటే మంచిదన్నారు. ఒంటరి పోకడ అవలంబించిన బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి గతి పట్టిందో అందరికీ తెలిసిందే అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 260 కోట్ల మంది ప్రజలు కమ్యూనిస్టుల పాలనలో ఉన్నారన్నారు. ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీయే అతి పెద్ద పార్టీ అని ఆయన వివరించారు. ఈ నెల 9న మోదీ పాలనకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తే 30 కోట్ల మంది రోడ్లమీదికి వచ్చారని గుర్తు చేశారు. ఓట్ల కోసం డబ్బులు వెదజల్లుతూ ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దామాషా పద్ధతిలో ఓట్లను లెక్కిస్తే ఎవరి సత్తా ఏంటో తేలిపోతుందన్నారు. కమ్యూనిస్టులంతా ఏకమైతే రాజ్యాధికారం మనదేనన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను కాల్చి చంపుతున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం రాదని, దీనిని మావోయిస్టు పార్టీ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. త్వరలో స్థానిక సమరం జరగనుందని, కొందరు అంతా తామే అంటూ ఎక్కువగా ఊహించుకుంటున్నారని కూనంనేని అన్నారు. మంచి వాతావరణంలో ఎన్నికలు జరగాలని కమ్యూనిస్టులుగా కోరుకుంటున్నామన్నారు. నాటి పరిస్థితులను బట్టి ఒంటరి పోరు చేసేందుకైనా సీపీఐ వెనుకాడదని చెప్పారు. గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ఖమ్మం కేంద్రంగా శతజయంతి వేడుక

సీపీఐ శతజయంతి వేడుక 2026 డిసెంబర్ 26న ఖమ్మం కేంద్రంగా కనీవినీ ఎరుగని రీతిలో జరగబోతోందని కూనంనేని చెప్పారు. కమ్యూనిస్టుల సత్తా ఏంటో కారుకూతలు కూసేవారికి చూపిస్తామన్నారు. ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు యోధులు తరలిరానున్నట్లు కూనంనేని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ స్థానిక సంస్థల సమరానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. సీపీఐ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళదామని, మనుషులంతా ఒక్కటే అని, అంతరాలు లేని సమాజమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని ప్రజలకు చాటి చెబుదామన్నారు. ప్రజాక్షేత్రంలో తప్పుడు విధానాలు అనుసరించే వారికి సరైన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, చలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, గనగల్ల వీరస్వామి, వై.ఉదయ్ భాస్కర్, గెద్దాడు నగేశ్, కంచర్ల జమలయ్య, బోనోత్ గోవింద్, బరిగల సంపూర్ణ, రమణమూర్తి, శ్రీశైలం, యాంద్ర మహేశ్, ఎస్.నాగేశ్వరరావు, గుత్తుల సత్యనారాయణ, జకర్య తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

వినిపించారు. తాము కస్టడీకి కోరుతున్నందున మిథున్ రెడ్డిని గుంటూరు సబ్ జైలుకు రిమాండ్ కు పంపాలని సిట్ కోరగా, మిథున్ రెడ్డి ఓ ఎంపీ అని, ఆయనకు వై కేటగిరీ భద్రత ఉందని, ఆయనకు నెల్లూరు జిల్లా జైలులో ప్రత్యేక బ్యారక్ కేటాయించాలని న్యాయవాది నాగార్జునరెడ్డి కోరారు. పైగా మిథున్ రెడ్డి పార్లమెంటులో ప్యానెల్ స్పీకర్‌గా చేశారని, ఆయన అరెస్ట్ పై లోక్ సభ స్పీకర్ కు సమాచారం ఇవ్వాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది. మద్యం కుంభకోణం కేసులో మిథున్‌రెడ్డి ప్రధాన కుట్రదారుల్లో ఒకరని, లిక్కర్ పాలసీ రూపకల్పన, డొల్ల కంపెనీలకు ముడుపుల సరఫరా వంటి అంశాల్లో కీలక పాత్ర పోషించారని సిట్ ఆరోపిస్తోంది.

వైసీపీ శ్రేణుల్లో అలజడి

అటు ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్, మరోవైపు ప్రాథమిక ఛార్జ్‌షీట్ దాఖలు...వెరసి వైసీపీ శ్రేణుల్లో అలజడి రేకెత్తిస్తున్నాయి. ప్రాథమిక ఛార్జ్‌షీట్‌లో జగన్ పేరు ప్రస్తావించినట్లుగాను, ఆయనకు తెలిసే మద్యం కుంభకోణం జరిగినట్లుగా సిట్ పేర్కొంది. కేసులో మరో 8 మందిని నిందితులుగా చేర్చింది. సైమన్ ప్రసన్, కొమ్మారెడ్డి అవినాశ్, అనిల్‌రెడ్డి, సుజల్ బెహ్రాన్, మోహన్, రాజీవ్, బొల్లారం శివ, ముప్పిడి అవినాశ్ అనే 8మంది పేర్లను జత చేసింది. తాజా జాబితాతో మద్యం కేసులోని నిందితుల సంఖ్య 48కి చేరింది. ఈ కేసులో ఇప్పటికే 11మందిని సిట్ అరెస్టు చేసి..వారిని అనేక విడతలుగా విచారించింది. వాళ్ల వాంగ్మూలాలు, రిమాండ్, ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాలను జత చేసి న్యాయస్థానానికి సమర్పించారు. 268మంది సాక్షులను విచారించి సేకరించిన సమాచారంతోపాటు రూ.62 కోట్లను జప్తు చేసింది. మరో 20 రోజుల్లో రెండో ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశముంది. మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్ట్ అయినవారి సంఖ్య 12కు చేరింది. మిథున్‌రెడ్డి అరెస్టుపై చట్టం తన పని చేసుకుపోతుందని జనసేన ఎంపీ బాలశౌరి వ్యాఖ్యానించారు. మిథున్‌రెడ్డి అరెస్టును పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ చెప్పారు.

రిమాండ్ రిపోర్టులో ఆసక్తికర విషయాలు..

మద్యం కేసులో మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు సిట్ తన రిమాండ్ నివేదికలో తెలిపింది. మద్యం అమ్మకాలను ఆన్‌లైన్ నుంచి మాన్యువల్‌కి మార్చడం వెనక మిథున్‌రెడ్డి పాత్ర ఉందంటోంది. లిక్కర్ లావాదేవీలను మిథున్‌రెడ్డి పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకున్నట్లు ఆరోపించింది. సొంత బ్రాండ్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టి వసూళ్ల నెట్‌వర్క్‌లో మిథున్‌రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు చెబుతోంది. మద్యం విధానం మార్పు, అమలు, ఇతర నిందితులతో కలిపి డిస్టిలరీలు, సప్లయర్ల నుంచి నగదు తీసుకున్నట్లు నిర్ధారించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు ఐఏఎస్‌గా పదోన్నతి కల్పిస్తామని ఆశ చూపించి స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినట్లుగా సిట్ నివేదించింది. కుట్ర అమలుకు సత్యప్రసాద్‌ను ఉపయోగించారని, బెవరేజెస్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై డిస్టిలరీల నుంచి ముడుపులు సేకరించి రాష్ట్ర ఆదాయానికి గండి కొట్టారని సిట్ తేల్చిచెప్పింది. ఈ కుట్ర ఛేదించేందుకు భవిష్యత్‌లోనూ దర్యాప్తు అవసరమని స్పష్టం చేశారు. ముడుపుల ద్వారా నిందితులు, ప్రైవేట్ వ్యక్తులు, ఉన్నతాధికారులు రాజకీయ నేతలు, గత ప్రభుత్వంలో ఉన్నవారు లబ్ధి పొందినట్లు, ఇప్పటివరకు అరెస్టయిన వారితో పాటు పరారీలో ఉన్నవారినీ అదుపులోకి తీసుకుని విచారించాల్సి ఉందని నివేదించింది. మద్యం ముడుపులను 2024 ఎన్నికల్లో పోటీ చేసిన అప్పటి అధికార పార్టీ అభ్యర్థులకు పంపిణీ చేశారని, నిందితులకు రాజకీయ పలుకుబడి ఉండటంతో.. సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని సిట్ తెలిపింది. మరింత దర్యాప్తు కోసం మిథున్‌రెడ్డికి రిమాండ్ విధించాలని కోరింది. ప్రభుత్వ ఖజానాకు రూ.3,500 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని, మిథున్‌రెడ్డిపై గతంలోనూ ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించింది. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో మద్యం ధరలను అనూహ్యంగా పెంచి, తద్వారా డిస్టిలరీల నుంచి ముడుపులు, కిక్ బ్యాగ్స్ సేకరించినట్లు రిమాండ్ నివేదికలో పేర్కొంది. ముందస్తు ప్రణాళిక ప్రకారం అనుచిత లబ్ధికోసం ముడుపులు, కిక్ బ్యాగ్స్ ఈ కుంభకోణంలో తీసుకున్నట్లు వివరించింది. మిథున్ రెడ్డి 2023 మేలో అనేక సార్లు సీఎం ఎస్వీ కృష్ణమోహన్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ధనుంజయ్‌రెడ్డితో మాట్లాడినట్లు తెలిపింది. దర్యాప్తు సంస్థల దృష్టి మళ్లించేందుకు ముడుపులను ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్‌లో ఉండే షెల్ కంపెనీలకు హవాల ద్వారా పంపారని, అధికార దుర్వినియోగం చేసి మద్యం విధానాన్ని మార్చి నిధుల దుర్వినియోగానికి పాల్పడి రాష్ట్ర ఖజానాకి నష్టం కలిగించారని తెలిపింది.

మలేరియాపై పోరుకు ఐసీఎంఆర్ కొత్త వ్యాక్సిన్

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యంతో అడ్‌ఫాల్సీవాక్స్ అనే రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. అడ్‌ఫాల్సీవాక్స్ అనేది మలేరియాను కలిగించే ప్లాస్మోడియం పరాన్నజీవి రక్తంలో ఉన్న రెండు క్లిష్టమైన దశలను లక్ష్యంగా చేసుకోవడానికి రూపొందించిన మొట్టమొదటి చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్. ఈ వ్యాక్సిన్ మానవులను మలేరియా సంక్రమణ నుంచి రక్షించడమే కాకుండా... వ్యాధి వ్యాప్తిని తగ్గిస్తున్నట్లు గుర్తించింది. ఐసీఎంఆర్ రూపొందించిన ఈ వ్యాక్సిన్ ప్రీక్లినికల్ దశలో మంచి ఫలితాన్ని చూపింది. ఇప్పటికే ఉన్న సింగిల్-స్టేజ్ వ్యాక్సిన్‌ల కంటే అడ్‌ఫాల్సీవాక్స్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు ఉన్నట్లు ప్రీ-క్లినికల్ డేటా చెబుతోంది. ఇది మానవుల్లో మెరుగైన దీర్ఘకాలిక రోగనిరోధక శక్తిని పెంచి... మలేరియా నిర్మూలనకు దోహదపడుతుంది. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ పరిశోధన దశలోనే ఉంది. మార్కెట్‌లోకి అందుబాటులోకి రాలేదు.

ఆలయాల అభివృద్ధికి రూ.1,290 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సుభిక్షంగా ఉండాలని కోరారు. గోల్కొండ బోనాలు, సికింద్రాబాద్... లాల్ దర్వాజా బోనాలు... కేవలం మన రాష్ట్రానికే కాదు, యావత్ దేశానికి, ప్రపంచానికి మన తెలంగాణ జీవన విధానం, పల్లె సంస్కృతి, సాంప్రదాయాలను, ఇక్కడి ప్రజల స్ఫూర్తిని చాటి చెప్పే గొప్ప ఉదాహరణలు అని పేర్కొన్నారు. జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున రూ.20 కోట్లు కేటాయించామని, నగరంలోని 2,783 ఆలయాలకు చెక్కుల రూపంలో ఈ నిధులను అందజేశామన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేసే దృఢ సంకల్పమని చెప్పారు. తెలంగాణ ప్రజల భక్తి విశ్వాసాలకు, సంప్రదాయ పరిరక్షణకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటుపరం

చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయంపై నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వాణిజ్య కేంద్రమైన విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న విలువైన ఏపీఎస్ఆర్టీసీ భూములను కార్పొరేట్ సంస్థకు అప్పగించడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన ఒక కీలక సమావేశంలో చంద్రబాబు ప్రభుత్వం విజయవాడలోని గవర్నరు పేట-2 ఆర్టీసీ డిపో ప్రాంగణంలోని సుమారు ఐదెకరాల భూమిని లూలూ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు మాల్ నిర్మాణం కోసం కేటాయించనుందన్న వార్తలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు వెల్లువెత్తాయి. గవర్నరుపేట-2 డిపో భూముల విలువ సుమారు రూ.400 కోట్లకుపైగా ఉంది. ఆర్టీసీ నష్టాల్లో ఉన్న నేపథ్యంలో ఈ ఆస్తుల వినియోగం సరైన మార్గంలో జరగకపోవడాన్ని ఉద్యోగులు, వామపక్ష, ప్రజా సంఘాల నేతలు వ్యతిరేకిస్తున్నారు. ప్రధానంగా సీపీఐ విజయవాడ నగర సమితి నేతృత్వంలో నిరసనలు చేపట్టారు. లూలూకు గవర్నరుపేట-2 డిపో భూములను అప్పగిస్తే ఆర్టీసీ ఉద్యోగులకు, ప్రయాణికులకు, ఆర్టీసీ సంస్థకు నష్టం వాటిల్లనుంది. అన్నీ అనుకూలిస్తే త్వరలో జరగబోయే మంత్రి మండలిలో భూములకు అప్పగింతకు ఆమోదముద్ర వేస్తారన్న ప్రచారముంది. ఏ ప్రభుత్వం వచ్చినా...ఏపీఎస్ఆర్టీసీ పరిరక్షణకు ప్రయత్నించకుండా సంస్థ ఆస్తుల్ని తెగనమ్మే చర్యలకు, కారు చౌకంగా కార్పొరేట్‌కు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. గతంలోను రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి చెందిన అనేక విలువైన ఖాళీ స్థలాలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారు. అలా చేయకుండా వాటిలో వాణిజ్య సముదాయాలు ప్రభుత్వమే నిర్మించి ఉంటే...ఎంతోకొంత ఆదాయ వనరులు వచ్చేవి. ఇప్పుడు ఉన్న ఆస్తుల్ని కార్పొరేట్‌కు కట్టబెట్టి... ఆర్టీసీని మరింత బలహీనం చేసే చర్యలకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించడాన్ని వామపక్ష, ప్రజా సంఘాలు తప్పుబడుతున్నాయి. సంపద సృష్టి అంటే...ప్రభుత్వ ఆస్తులను తెగనమ్మడమేనా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై కూటమి నేతలు మౌనంగా ఉండటంతో లూలూ గ్రూప్‌కు కట్టబెట్టే ప్రయత్నాలు తథ్యమనే వాదనలున్నాయి.

తెల్లవారుజామునుంచే డిపో సేవలు...

గతంలో విజయవాడ పాత బస్టాండ్‌గా ఈ ప్రాంతం (గవర్నరు పేట-2 డిపో) గుర్తింపు పొందింది. 1990లో నూతనంగా పండిట్ నెహ్రూ బస్టాండ్ నిర్మించిన తర్వాత... గవర్నరుపేట-2 డిపో వచ్చింది. ప్రస్తుతం ప్రజల్లో ఇది 'పాత బస్టాండ్' అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ఇదే ప్రాంతాన్ని లూలూ గ్రూప్ మాల్ నిర్మాణం కోసం కేటాయించాలని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ఆమోదించినట్లుగా సమాచారం. లూలూ గ్రూప్ విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో రెండుచోట్ల మాల్స్ నిర్మాణానికి మొత్తం రూ.1,222 కోట్ల పెట్టుబడితో ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుల్లో మల్టీప్లెక్సులు, ఫుడ్ కోర్టులు, ఇంటర్నేషనల్ బ్రాండ్ల షోరూములు, వినోద కేంద్రాలు, ఆధునిక పార్కింగ్ వసతులు ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం ఈ డిపో కేంద్రంగా 100 బస్సులు నడుస్తున్నాయి. తెల్లవారు ఝామున 4 గంటల నుంచి ప్రయాణికులకు సేవలందిస్తుంటాయి. ఇక్కడ మొత్తం 500 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ డిపోకు ముందు వరుసలో ఉన్న ఖాళీ స్థలంలోని పార్కును ఇతరత్రా షాపింగ్ కాంప్లెక్స్‌కు ఉపయోగించుకుంటే మంచి వాణిజ్య సముదాయంగా ఏర్పడి...ఆర్టీసీ సంస్థకు లాభాలు వస్తాయి. నిత్యం ప్రజలతో మమేకమై ఉన్న డిపోను తొలగించి, దానిని లూలూకు ఇచ్చే ప్రతిపాదనలను చంద్రబాబు చేపట్టడంతో వ్యతిరేకత నెలకొంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ఆస్తులు ప్రజల హితాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగించాల్సి ఉండగా, వాటిని కార్పొరేట్ లాభాల కోసమే వినియోగించే చర్యలను ప్రజాసంఘాలు ఖండిస్తున్నాయి. ప్రజల అవసరాలను విస్మరించి, వ్యాపార లాభాల కోసమే ఈ మాల్ ప్రాజెక్టు చేపట్టడమేమిటని విమర్శలొస్తున్నాయి. పాత బస్టాండ్ ప్రాంగణాన్ని ప్రజలకు అవసరమైన రవాణా వసతులుగా ఉపయోగించకుండా, ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం అనైతికమని వామపక్ష, ప్రజా సంఘాలు నొక్కిచెబుతున్నాయి.

కమ్యూనిజం అజేయం... అజరామరం

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : సమాజంలో ఆర్థిక అసమానతలు వర్గాలు ఉన్నంతవరకు కమ్యూనిస్టుల పోరాటం కొనసాగుతుందని, ఎవరైనా వద్దనుకుంటే ఆగేదికాదని, కమ్యూనిజం.. అజేయం అజరామరం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలోనే బీజేపీ మొదలైన మత శక్తులు కమ్యూనిస్టులను లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నా యన్నారు. ఆదివారం మదిర పట్టణంలోని రెడ్డి ఫంక్షన్హాల్లోని పోటు ప్రసాద్నగర్లో భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా 23వ మహాసభలు రెండవ రోజు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ సమాజంలో మార్పు అనివార్యం అని మార్క్స్ చెప్పినట్లుగా పెట్టుబడిదారి సమాజంలో అవినీతి పెరిగినప్పుడు ఆ సమాజం పతనం అవుతుందని, ఇప్పుడు దేశంలో అదే పరిస్థితి నెలకొందని ఆయన తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు సానుకుల పవనాలు విస్తున్నాయని, గత ఎన్నికల లో 0.5 శాతం ఓట్లు సాధించిన కమ్యూనిస్టు పార్టీ శ్రీలంకలో అధికారంలోకి వచ్చిందన్నారు. దేశంలో బీజేపీ తన విధానలతో నిరంకుశ పాలనకు దారి తీస్తుందని హేమంత్రావు ఆరోపించారు. ఆపరేషన్ కగర్ పేరుతో మావోయిస్టుల ఏరివేతతో అమాయిక ఆదివాసులను హతమారుస్తున్నారని, భవిష్యత్తులో అర్బన్ నక్సలిజం పేరుతో కమ్యూనిస్టులను, ప్రశ్నించే వారిని హతమార్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మైనార్టీలే టార్గెట్గా బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ను తన జేబు -సంస్థగా మార్చుకొని, విపక్ష ఓటర్లను తొలగించే పనిలో ఉందన్నారు. ఎన్నికల వ్యవస్థకే ముప్పు తెచ్చే ప్రయత్నంలో ఉందన్నారు. మీడియాను నియంత్రించడంతో పాటు సోషల్మీడియా ద్వారా అభద్దాల ప్రచారాలతో వాస్తవాలను మరుగున పెడుతుందని హేమంత్రావు ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు విషయంలో నిర్ణయం తీసుకోవటంలో జాప్యం చేస్తుందన్నారు. విధాననిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తుందన్నారు. కాంగ్రెస్ గెలుపుకోసం కీలకంగా వ్యహరించిన సిపిఐ విషయంలో మిత్ర ధర్మాన్ని పాటించాలని కోరారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న యువత నిరాశలో ఉందని, వారిని ప్రజా ఉద్యమాలవైపు ఆకర్షించాలని హేమంత్రావు పిలుపునిచ్చారు. సమాజమార్పు యువతతోనే సాధ్యం అని యువత రాజకీయ భవిష్యత్కు పునాది అని, ఆయన తెలిపారు. పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం అత్యంత ఆలస్యం అని ప్రజా సంఘాల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలానుగుణంగా పోటీ చేసి అత్యధికస్థానాలలో గెలుపొందే విధంగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. పార్టీ నిర్మాణం అధ్యయనం విస్తృత పోరాటాలే లక్ష్యంగా భవిష్యత్ కార్యచరణ రూపొందించాలని హేమంతరావు సూచించారు. మహాసభలలో పార్టీ మండల కార్యదర్శులు ప్రజా సంఘాల బాధ్యులు చర్చలలో పాల్గొనగా సభ లోపల తీర్మానం ఆమోదించారు. జమ్ముల జితేందర్రెడ్డి, అజ్మీరా రామూమూర్తి, మందదుపు రాణి, దొండపాటి రమేష్, యంగాల ఆనంద్రావు అధ్యక్షవర్గంగా వ్యవహరించగా దండి సురేష్, మొహ్మద్ మౌలానా, ఎర్రబాబు, ఎస్కే జానిమీయా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డ నారాయణరావు సంతాప సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ సాయుధ పోరాట యోధులు అమరజీవి దొడ్డ నారాయణరావు సంతాప సభ ను ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు చిలుకూరులో నిర్వహించనున్నట్లు అట్టి బహిరంగ సభను జయప్రదం చేయాల్సిందిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు.ఆదివారం ఆయన నారాయణరావు సంతాప సభ కరపత్రాలను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ నారాయణరావు త్యాగం వల్ల ఈ మట్టికి చైతన్యం వచ్చిందని ప్రాణాలు ఫణంగా పెట్టి ఈ ప్రజల కోసం రాజీలేని నిజాయితీ జీవితం గడిపారని ఆయనధైర్యం, స్వార్ధరహిత సేవా దృక్పథం, ఐక్యత భావన, త్యాగశీలత, దృఢమైన సంకల్పం సామాజిక న్యాయం లాంటి అంశాలను యువత ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.తన అన్న స్వర్గీయ దొడ్డ నరసయ్య ప్రోత్సాహంతో సాయుధ పోరాటంలో పాలు పంచుకొని కార్యకర్తగా కమాండర్గా నాయకుడిని చేశాయని ఆనాటి నుండి ఆయన జీవితం త్యాగం ఒక ఆదరణ స్వాతంత్ర సమరయోధుడిగా సమాజ మార్గదర్శిగా రైతులు హక్కుల రక్షణ కోసం భూమి హక్కులు సాగునీటి హక్కులు ధరల స్థిరీకరణ వంటి అంశాలతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ఒక ప్రజా ప్రతినిధి గానే కాకుండా ఒక ప్రజా గొంతుకై రైతుల హక్కుల రక్షకుడుగా నిలిచారని ఆయన కొనియాడారు. కరపత్రాల విడుదల కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాస రెడ్డి పట్టణ సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/ తొర్రూర్ : స్థానిక సంస్థలలొ పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గల్లంత కావడం ఖాయమని, కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం మండలంలోని సోమారం గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఝాన్సీ రెడ్డి గ్రామానికి చేరుకోగానే డప్పు, ఒగ్గుడోలు చెప్పులు, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ కూతురు వయసున్న యశస్విని రెడ్డి పై 48 వేల ఓట్ల తేడాతో ఎర్రబెల్లి చిత్తుచిత్తుగా ఓడిపోయాడని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే ఫలితం బీఆర్ఎస్ కు పునరావృతం అవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొందన్నారు. సోమారం, జమస్తాన్ పురం గ్రామాల్లో రూ.36 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేయించామని, మరో రూ. 20 లక్షలతో మరికొన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ప్రజాభిమానం పొంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేందుకు నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కొండ మధుసూదన్ రెడ్డి ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్,మండల అధ్యక్షుడు సుంచు సంతోష్,మండల కోఆర్డినేటర్లు ఎర్రబెల్లి రాఘవరావు, చాపల బాపురెడ్డి,జాటోత్ నెహ్రూ నాయక్, సీనియర్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, పెదగాని సోమయ్య,పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష,ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోత్ రవి నాయక్,నాయకులు ధరావత్ రాజేష్ నాయక్,రామచంద్రయ్య, గుండాల నర్సయ్య,ధరావత్ సోమన్న,గంజి ప్రసాద్ రెడ్డి, విద్యాకర్ రెడ్డి,సహదేవ్,గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా దండి సురేష్

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : రెండు రోజులపాటు మదిరలో జరిగిన 23వ మహాసభలు ఆదివారం సాయంత్రం ముగిశాయి మహాసభలలో 91 మందితో కౌన్సిల్ ను 29 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు కార్యదర్శిగా ఎన్నికైన దండి సురేష్ ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామంలో సాంప్రదాయ కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్లో పనిచేసిన సురేష్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న సురేష్ 23వ మహాసభలో కార్యదర్శిగా ఎన్నికయ్యారు సహాయ కార్యదర్శిగా ఎన్నికైన జితేందర్ రెడ్డి చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో జన్మించారు. విద్యార్థి యువజన ఉద్యమాలలో పనిచేసిన ఆయన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘంలో సుదీర్ఘకాలం జిల్లా రాష్ట్ర బాధ్యతలను నిర్వర్తించారు ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరిద్దరు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు భాగం హేమంతరావు మహమ్మద్ మౌలానా తదితరులు నూతన నాయకత్వాన్ని అభినందించారు.

సోమారం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

విశాలాంధ్ర - తొర్రూరు: తన రాజకీయ అభివృద్ధికి అన్నివేళలా అండగా నిలిచిన సోమారం గ్రామ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పిఏసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం తొర్రూరు మండలంలోని సోమారం గ్రామంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సోమారం ప్రజలు గత కొన్ని దశాబ్దాలుగా తన నాయకత్వాన్ని బలపరుస్తున్నారని, తన దుఃఖంలో, సంతోషంలో గ్రామ ప్రజలు భాగస్వాములయ్యారని, వారి రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. త్వరలో తన తల్లి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నానని, దానికై రూ.25 లక్షలు డిపాజిట్ చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ట్రస్టు ద్వారా గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకుంటానని తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి కాంగ్రెస్ నాయకులను కలుపుకొని పోవడానికి కృషి చేయాలని, నాయకులను కలుపుకోకపోవడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. 2001 నుంచి తాను చెప్పిన వారు గెలిచారని, అదే కోవలో తాను చెప్పిన మేరకు తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేగా యశస్విని రెడ్డి విజయం సాధించిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్హెచ్పిఎస్ నాయకుడు జాటోత్ బాలు నాయక్, మాజీ సర్పంచ్లు తమ్మడపల్లి సంపత్, బానోతు చందులాల్, దర్శల కర్ణాకర్, యాకాంతం, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర - నాగర్కర్నూల్ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమమే లక్ష్యం గా అనేక పథకా లు అమలు చేస్తోం దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని సికెఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏ పథకం మొదలుపెట్టినా ముందు మహిళలకే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500లకే వంట గ్యాస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరు మీదనే ఇస్తున్నామన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలను ఆర్థిక బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి సంబరాలు నేడు పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో మహిళా సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గం లో 2500 రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు, 5800 మంది పేర్లను రేషన్ కార్డుల్లో నమోదు చేయడం జరిగిందని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. అదనపు పిడి రాజేశ్వరి, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కల్వకుర్తి నియోజకవర్గం మండలాల తాహసిల్దార్లు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు, అత్యధిక సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ చుంచుపల్లి మండల కార్యదర్శిగా వాసిరెడ్డి మురళి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చుంచుపల్లి మండల కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకులు వాసి రెడ్డి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన చుంచుపల్లి మండల మహాసభ సందర్భంగా ఈ ఎన్నిక చోటు చేసుకుంది. ఆయనతోపాటు సంయుక్త కార్యదర్శిగా గనిగాళ్ల వీరస్వామి, సహాయ కార్యదర్శిగా పొలమూరి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని శాఖల వారీగా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించడం తోపాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను జిల్లా పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధిష్టాన నిర్ణయం మేరకు ముందుకు సాగుతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మెరిల్లో అడియా 200 మిలియన్ డాలర్ల పెట్టుబడి

హైదరాబాద్: అబుదాబి ఇన్వెస్ట్మెంట్ అథారిటీ (ఏడీఐఏ-అడియా) పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ భారతదేశంలోని ప్రముఖ వైద్య పరికరాల కంపెనీలలో ఒకటైన మైక్రో లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (మెరిల్)లో 3% వాటా కోసం 200 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ పెట్టుబడి మెరిల్ను 6.6 బిలియన్ డాలర్ల ఎంటర్ప్రైజ్ విలువకు విలువ చేస్తుంది. ఈ లావాదేవీకి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నియంత్రణ ఆమోదానికి లోబడి ఉంటుంది. ఈ పెట్టుబడి తర్వాత, మెరిల్కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రెండు పెట్టుబడిదారులు అడియా, వార్బర్గ్ పింకస్ మద్దతు ఇస్తారు. బిలాఖియా గ్రూప్ ద్వారా స్థాపించబడిన మెరిల్, కార్డియోవాస్కులర్, స్ట్రక్చరల్ హార్ట్, ఆర్థోపెడిక్స్, ఎండో-సర్జరీ, ఇన్-విట్రో డయాగ్నోస్టిక్స్, సర్జికల్ రోబోటిక్స్తో సహా బహుళ ప్రత్యేకతలలో క్లినికల్గా అధునాతన పరిష్కారాలపై బలమైన దృష్టితో వైద్య సాంకేతికత (మెడ్టెక్)లో ప్రపంచవ్యాప్త ఆవిష్కర్త. భారతదేశంలోని వాపిలో ప్రధాన కార్యాలయం కలిగిన మెరిల్, 100 ఎకరాల స్థిరమైన మెడ్టెక్ క్యాంపస్లో అత్యాధునిక, ఇంటిగ్రేటెడ్, ప్రపంచవ్యాప్తంగా ధృవీకరించబడిన తయారీ, ఆర్సీడీ సౌకర్యాలను నిర్వహిస్తోందని మెరిల్ స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ భట్ తెలిపారు.

రిలయన్స్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ దివాలా తీర్పుపై ఎన్సీఎల్ఏటీ స్టే

ముంబయి : రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ దివాలా తీర్పుపై ఎన్సీఎల్ఏటీ స్టే విధించింది. రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీపై కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియపై జూన్ 2, 2025 నాటి ఆదేశాన్ని కొనసాగిస్తూ, జూన్ 6, 2025 నాటి లేఖలను అనుసరించి, నేషనల్ కంపెనీ లా అప్పీల్ ట్రిబ్యునల్ (ఎన్సీఎల్ఏటీ) మంగళవారం మే 30, 2025 నాటి ఆదేశాన్ని నిలిపివేసింది. కంపనీపై జరుగుతున్న ఇన్సాల్వెన్సీ ప్రక్రియపై స్టే విధించింది. తదుపరి విచారణ ఆగస్టు 27, 2025 తేదీన జరుగుతుంది.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న మండల అధ్యక్షులు చిటమట రఘు ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 12 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణి చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం మండల కమిటీ అధ్యక్షులు సి. హెచ్. రఘు తెలిపారు. ఈ సందర్బంగా రఘు మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో గాను ఉపయోగ పడుతుందన్నారు. 3,64,000 రూపాయల చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ అధ్యక్షులు ఎండీ సులేమాన్, శివాలయం కమిటి చైర్మన్ మాడుగురి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలను సందర్శించిన అటవీ క్షేత్ర అధికారి

విశాలాంధ్ర - గూడూరు/ కొత్తగూడ: గూడూరు, కొత్తగూడ మండలాలలో ఉన్న భీముని పాదం, గుంజేడు ముసలమ్మ దేవాలయాలను ఆదివారం నాడు తెలంగాణ రాష్ట్ర అటవీ క్షేత్ర అధికారి సి.హెచ్.సువర్ణ సందర్శించారు. గూడూరు అటవీ రేంజ్ విస్తీర్ణం ఎంత వరకు ఉందో మ్యాప్ ద్వారా ఎఫ్ డీ వో చంద్రశేఖరరావు తెలియజేయడం జరిగింది. అటవీ క్షేత్ర అధికారి స్వర్ణకు కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసి మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మించడానికి స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. ఈ విషయంపై అటవీ క్షేత్రాధికారి సువర్ణ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమ నాయక్, డీఎఫ్ వో బత్తుల విశాల్, ఎఫ్ డి వో వి.చంద్రశేఖర రావు, ఎఫ్ ఆర్ వో బి.సురేష్, డి ఆర్ వో మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ పంటపై దృష్టి సారించిన రైతు



విశాలాంధ్ర - కొమరం భీం : కౌటాల మండలంలోని గుడ్లబోరి గ్రామములో అనంతుల దేవన్న అనే రైతు 5 ఎకరాలలో ఆయిల్ ఫామ్ మొక్కలు ఆదివారం నాటారు. అంతర్గత పంటగా పత్తి, మిరప పంటలను పండిస్తున్నారు. ప్రస్తుతం అయిల్ ఫామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని ప్రభుత్వ ద్వారా 90శాతం రాయితీపై మొక్కలను రైతులకు అందచేయడంతో పాటు డ్రిప్పు పైపులను, బీసీ సామాజిక వర్గం రైతులకు 90 శాతం రాయితీ, ఎస్సీ ఎస్టి సామాజిక రైతులకు 100శాతం రాయితీ అందజేస్తున్నారని, అలాగే పంట నిర్వహణ ఖర్చుల కింద ఎకరానికి 4,200 రూపాయలు ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని అని మాట్రిక్స్ కంపెనీ సిబ్బంది జాడి సచిన్ రైతులకు తెలియజేశారు. అసక్తి గల రైతులు ఇతర వివరాల కొరకు 9346896083 సంప్రదించాలని తెలిపారు.

బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన మర్రి



విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: బోనాల పండుగా సందర్భంగా ములుగు జిల్లా నియోజకవర్గ ప్రజలకు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు, అన్నదమ్ములకు, అక్క చెల్లెలకు, ఎలక్ట్రానిక్, మీడియా, ప్రింట్ మీడియా, మిత్రులకు, శ్రేయోభిలాషులకు అందరికీ పేరుపేరునా, బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్బాబు, బోనాలు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ కుటుంబంతో కలిసి, బోనాల పండుగాను చేసుకొని, అమ్మవారి ఆశీస్సులు పొందాలని, అమ్మ వారి ఆశీస్సులు ఎప్పుడు ప్రజలపై ఉండాలని అయన కోరారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వాసుపత్రి సేవలు

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రి సేవలందిస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మిర్జా మోహిద్ బేగ్ అన్నారు. ఆదివారం రోజున మీర్జా మహమ్మద్ బేగ్ మనవళ్ళు ప్రిన్స్ సత్తామ్ బిన్ అబ్దులజీజ్ యూనివర్సిటీ, విద్యాశాఖ, డెంటిస్ట్రీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మిర్జా ముబాషిర్ బేగ్, పెద్దపల్లి సివిల్ ఆసుపత్రిని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిని పరిశుభ్రంగా, అద్భుత స్థితిలో నిర్వహిస్తున్నారని, ఆసుపత్రి వసతులు, పరిశుభ్రత సేవల నాణ్యత ఎంతో మెరుగ్గా ఉన్నాయని, స్థానిక ప్రజలు పరిసర ప్రాంతాల వారు ఈ ఆసుపత్రి అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సేవలు ప్రముఖ ఆసుపత్రులతో సమానంగా ఉన్నాయని, ప్రసూతి, శిశు విభాగంలో ఇన్క్యుబేటర్లు, నూతన శిశువుల కోసం ప్రత్యేక సదుపాయాలు, ప్రసవానంతర తల్లుల సంరక్షణ వంటి ఆధునిక సౌకర్యాలు ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని, ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బందితో కూడిన డయాలిసిస్ విభాగాన్ని, అదనంగా, ఆర్థోపెడిక్, కంటి (ఆఫ్తాల్మిక్) జనరల్ సర్జరీ వంటి విభాగాలు డాక్టర్ శ్రీధర్ మార్గదర్శకత్వంలో నిపుణులైన వైద్యులు సమర్థంగా నిర్వహిస్తున్నారని ఈ సేవలను జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీధర్, డాక్టర్ మిర్జా ముబాషిర్ బేగ్, మిర్జా మోహిబ్ బేగ్, మిర్జా షౌకత్ బేగ్ పాల్గొన్నారు.

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - చర్ల : ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీల విషయంలొ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, రాజ్యాంగబద్ధత చట్టాలను అపహాస్యం చేస్తున్నారని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భాగంగానే ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాలు ఐక్యరాజ్యస మితి నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. చర్ల మండలం జిఎస్పీ ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయితీలలో పర్యటిస్తూ సుబ్బంపేట గ్రామంలో ఆదివాసులతో ఆదివారం పాయం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్ ఏరియా చట్టాలను ఏమాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. ఆదివాసీల హక్కుల కోసం రాజకీయ పార్టీల శాసనసభ్యులు, మంత్రులు పనిచేయడం లేదన్నారు. షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఆదివాసి యువత మొత్తం భవిష్యత్తు ఉద్యమాలకు నడుము బిగించాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం చర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, ఇర్ప ప్రకాష్, ఏక సురేంద్ర, కాక రాంబాబు, యలం రమేష్, యాక సూరిబాబు, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

బోనం ఎత్తిన కలెక్టర్ దంపతులు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, శ్రీజ దంపతులు బోనం ఎత్తారు. మెదక్ జిల్లా కేంద్రంలో తారక రామ నగర్ నల్ల పోచమ్మ ఆలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్, అయన సతీమణి శ్రీజ భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఏడుపాయల దుర్గామాతను కలెక్టర్ రాహుల్ రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది శ్రీనివాస్ గౌడ్ ఆలయ మర్యాదలతో సత్కరించారు. వసతి గృహ సంక్షేమ అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యార్థుల ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. కుల్చారం బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, స్టోర్ రూం, మెనూ, వసతి గృహంలో మరుగుదొడ్లను పరిశీలించారు. వసతి గృహ నిర్వాహణ తీరును పర్యవేక్షించి రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని కల్పించాలన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కార్యాచరణ పాటించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : స్వచ్ఛ సర్వేక్షణ్ - 2025లో భాగంగా గ్రామాల పరిశుభ్రతను పెంపొందించేందుకు ఐదు రోజుల కార్యాచరణను అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన స్వచ్ఛ సర్వేక్షణ్ పై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామాలలో స్వచ్ఛత పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి వారంలో ఐదు రోజుల కార్యాచరణను పాటించాలని సూచించారు. సోమవారం రోజున బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు వంటి ఖాళీ ప్రదేశాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి, వాటి స్థానంలో ప్రజలకు ఉపయోగపడే మొక్కలను నాటాలని ఆదేశించారు. మంగళవారం తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం వల్ల లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి ప్రతి మంగళ, శుక్రవారం రోజుల్లోనే పొడి చెత్తను సేకరించాలన్నారు. బుధవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో పనికిరాని వస్తువులను తొలగించడం చేయాలన్నారు. నీటి నిలువున్న చోట్ల ఇంకుడు గుంతలు త్రవ్వే పనులు చేయాలన్నారు. గురువారం రోజున డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణకు మందుల పిచికారీ, కమ్యూనిటీ మరుగుదొడ్ల శుభ్రత చేపట్టాలన్నారు. ఐదు రోజుల కార్యాచరణతొ గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం మరింత సులభతరం అవుతుందన్నారు. వనమహోత్సవ లక్ష్యాలను కూడా వేగంగా పూర్తి చేయాలని ఈ ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

ఆవులను గోశాలకు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది



విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలోని రహదారులపై ఆవులు సంచరిస్తూ ప్రయాణికులకు వాహనాలకు ఇబ్బందిగా మారుతున్నాయి. ఆవులను రోడ్లపై సంచారించకుండా ఆవుల యజమానులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే రోడ్లపై సంచరిస్తున్న ఆవులను పట్టుకొని పురపాలక సంఘం వారు గోశాలకు తరలించబడతాయని అధికారులు పలుమార్లు హెచ్చరించిన ఫలితం కనిపించకపోవడంతో, ఆవులను మున్సిపాలిటీ సిబ్బంది పట్టుకుని గోషాలకు తరలిస్తున్నారు.

అనువాద కవిత

తిరిగి వచ్చుట

హిందీమూలం: డా॥కైలాశవాజపేయీ
తెలుగు అనువాదం: పారనంది నిర్మల
సెల్: 9985103804

ఏమిటి అయిపోతుంది
నీవు మిగిలేవు గాని నీవులా లేవు
నడుస్తూ వెళ్లిపోయావు
అలసట ఎరగకుండా నీవు
దారి ఇంకా తప్పతూ పోయింది
ఏమిటౌతుంది
వచ్చే శతాబ్దం లోకూడా
దుర్దినాలు వెళ్లిపోలేదు ఈ లోకానికి
క్షతగాత్రురాలు అయి కూడ
అలంకరించు కోవడంలో
ప్రకృతి
సిద్ధహస్తురాలు
పునర్జన్మని నమ్ముతుంది
పాడైంది ఎంతవరకూ పాడౌతుంది?
మాటి మాటికీ మునిగి కూడా తెలిపోయే
యుక్తి తెలుసు
వసుంధరకి.

సా హి తి

తుపాకీ పట్టిన చేతితోనే కలం ఝళిపించిన డా. రాజ్ బహదూర్ గౌర్

ఆర్వీ రామారావ్

ఆయన నడుస్తుంటే హైదరారాబాద్ చరిత్ర నడిచినట్టు ఉండేది. బహుశా ఆయన దక్కనీ తహజీబ్ (దక్కనీ సంస్కృతి) కు ఆఖరి ఆనవాలు. ఆయనది కార్మికోద్యమానికి అలవాటుపడ్డ ప్రాణం. కాని ఆయన సాహిత్యాభిరుచి అవధులు లేనిది. కార్మికోద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో తీరిక లేకుండా ఉన్నా సాహితీ సృజన ఆగలేదు. ఆయనే డా. రాజ్ బహదూర్ గౌర్ (1918 జులై 21 - 2011 అక్టోబర్ 7).

రాజ్ బహదూర్ గౌర్ కాయస్థ సామాజిక వర్గానికి చెందిన వారు. ఆయన పూర్వీకులు ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లా గోషైన్ గంజ్ తాలుకా కిషన్ పూర్ గ్రామానికి చెందిన వారు. ఆయన తాత 1850 ప్రాంతంలో హైదరాబద్ వచ్చి గాలిబుల్ ముల్క్ గాలిబ్ జంగ్ దగ్గర ఉద్యోగం చేసి హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు.

డా.రాజ్ బహదూర్ కుటుంబం హైదరాబాద్ పాతబస్తీలోని గౌలీ పురాలో నివాసం ఉండేది. ఆయన విద్యాభ్యాసం పాత బస్తీలోని ముఫీద్-ఉల్-ఆనాం, ధర్మవంత్, రిఫా-ఎ-ఆం పాఠశాలల్లో సాగింది. కాయస్థుల మాతృ భాష ఉర్దూ. రాజ్ బహదూర్ ఆరో తరగతి దాకా ఉర్దూ మాధ్యమంలోనే చదువుకున్నారు. ఏడో తరగితిలో చాదర్ ఘాట్ లోని ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మాధ్యమంలో చేరారు. కాని వైద్య విద్య మాత్రం ఉర్దూ మాధ్యమంలోనే సాగింది. అప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వైద్య శాస్త్రం కూడా ఉర్దూ మాధ్యమంలోనే బోధించే వారు. తన తల్లి భాష ఉర్దూ అయితే సవతి తల్లి భాష ఇంగ్లీషు అని రాజ్ బహదూర్ చమత్కరించే వారు. వైద్య శాస్త్రంలో పట్టభద్రుడైనా ఆయన ఆ వృత్తిలో కొనసాగలేదు. విద్యార్థి దశలోనే మరీ మాట్లాడితే తొమ్మిదవ తరగతిలో ఉండగానే రాజకీయాల మీద ఆయనకు దృష్టి మళ్లింది. నిరంతర విప్లవకారుడిగా ఉండడమే ఆయన వృత్తి. సాహిత్య రచన ఆయన ప్రవృత్తి.

అప్పటికి హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ పార్టీలు ఏవీ లేవు. నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ హయాంలో ఫ్యూడల్ విధానాలు, కర్కశమైన పాలనే అమలయ్యేది. హైదరాబాద్ సంస్థానంలో తెలుగు మాట్లాడే వారు అధిక సంఖ్యాకులు. కన్నడ, మరాఠీ మాట్లాడే వారు ఎనిమిది జిల్లాల్లో ఉండే వారు. కాని ఈ మూడు భాషల్లోనూ విద్యాబోధన లేదు. ఉర్దూనే దిక్కు నిజాం సంస్థానంలోని మొత్తం 16 జిల్లాల్లో ఉన్న పాఠశాలలు 20 మాత్రమే. తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించడానికి 1922 నుంచి ప్రయత్నాలు ప్రారంభమైనా 1930 లో ఆంధ్ర మహాసభ ఏర్పాటుతో ఆ ప్రయత్నాలు నిర్దిష్ట రూపం సంతరించుకున్నాయి. అంతకు ముందునుంచే ఆర్య సమాజం పౌరహక్కుల కోసం ఉద్యమిస్తుండేది. సహజంగానే రాజ్ బహదూర్ ఆర్య సమాజం వేపు ఆకర్షితులయ్యారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఒక సమావేశంలో ఖలీఫా అబ్దుల్ హకీం "మనిషి దేవుడిని పుట్టించే జీవి" అన్నారు. ఆ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ సౌఖే "మనిషి భగవంతుడిని అంతమొందించే జీవి కూడా" అన్నారు. అప్పుడు రాజ్ బహదూర్ తొమ్మిదో తరగతిలో ఉన్నారు. ఈ వివాదం ఆయనలో ఆలోచన రేకెత్తించి జాతీయవాదం వేపు లాక్కెళ్లింది. ఆ తర్వాత ఎం.ఎన్.రాయ్ రాసిన మెటీరియలిజం (భౌతిక వాదం), బుఖారిన్ రచన చారిత్రక భౌతిక వాదం చదవడం వల్ల నిరీశ్వర వాదం, భౌతికవాదం వేపు మొగ్గారు.

1937-38లో రాజ్ బహదూర్ స్టేట్ కాంగ్రెస్‌లో ఉన్నారు. సత్యాగ్రహం మీద అభిమానం కలిగింది. సత్యాగ్రహం చేయాలనుకున్నారు కాని గాంధీ సత్యాగ్రహోద్యమాన్ని ఉపసంహరించడంతో యువతరం నిరాశకు లోనైంది. అందువల్ల 1939 నాటికే రాజ్ బహదూర్ కమ్యూనిస్టు అవతారం ఎత్తారు. అప్పటికి తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ లేదు కాని ప్రసిద్ధ కవి మఖ్దూం మొహియుద్దీన్ లాంటి వారికి కమ్యూనిస్టులతో సంబంధాలు ఉండేవి. ఆ రకంగా హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో రాజ్ బహదూర్ కూడా ఒకరయ్యారు. 1938లో వందే మాతరం ఉద్యమంలో రాజ్ చురుకుగా పాల్గొన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. అయినా ఆ ఆంక్షలను ఉల్లఘించి వందేమాతరం ఆలపించేవారు. మహాత్మాగాంధి హఠాత్తుగా సహాయ నిరాకరణోద్యమాన్ని విరమించినందువల్ల చాలా మంది యువకులు వామపక్ష భావజాలం వేపు మొగ్గారు. రాజ్ బహదూర్ కూడా వామపక్షం వేపు మొగ్గారు.

1934 లోనే రాజ్ బహదూర్‌కు సాహిత్యం మీద అభిరుచి పెరిగింది. పాఠశాలలో ఉన్నప్పుడు ఇంగ్లీషు ఉపాధ్యాయులు జుల్ఫికర్ అలీ ఖాన్, వామన్ రావు ఆయనకు ఇంగ్లీషు మీద ఉన్న ఆసక్తిని ప్రోత్సహించారు. తసదిఖ్ హుసేన్ 'సిద్' జైసీ ఉర్దూ మీద ఆసక్తి పెంపొందించారు. రాజకీయాల విషయానికి వస్తే జవహర్ లాల్ నెహ్రూను, సరోజినీ నాయుడును రాజ్ అభిమానించే వారు. గాంధీకి మతానురక్తి ఉండడం వల్ల రాజ్ బహదూర్‌ను ఆకర్షించలేదు. 1938 లో అహింసా విధానాల వల్ల స్వాతంత్ర్య సాధన సాధ్యమా అని వ్యాసం రాస్తే అది పయాం పత్రికలో ప్రచురితమైంది. బహుశా అదె రాజ్ తొలి రచన కావచ్చు.

మఖ్దూం మొహియుద్దీన్‌కు అప్పటికే కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు ఉండేవి. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ పంపే సాహిత్యాన్ని రహస్యంగా బట్వాడా చేసే వారు. 1939 లో అంటే 21వ ఏట రాజ్ బహదూర్ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1940 లో హైదరాబాద్‌లో పార్టీ శాఖ ఏర్పడింది. మఖ్దూం కార్యదర్శిగా రాజ్ బహదూర్ సహాయ కార్యదర్శిగా ఉండేవారు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ నిర్వహణలోని ప్రాంతీయ కమిటీలో కూడా రాజ్ బహదూర్ పని చేసేవారు. 1938-39 లో హైదరాబాద్ కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పడింది. అప్పటికే రాజ్ బహదూర్ కమ్యూనిస్టు కనక అందులో చేరలేదు కాని 1941లో చేరారు. కమ్యూనిస్టు పార్టీని ప్రభుత్వం నిషేధించినందువల్ల అజ్ఞాతంగానే పని చేయాల్సి వచ్చేది.

1946 లో నల్లగొండ, వరంగల్ జిల్లాలో సాయుధ ప్రతిఘటన మొదలైంది. అధికారికంగా కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చింది మాత్రం 1947 సెప్టెంబర్ 11న. 1946లో నవంబర్‌లో మఖ్దూం మొదలైన వారితో పాటు రాజ్ అరెస్టయ్యారు. 1947 మే 7వ తేదీన జైలు నుంచి ఆసుపత్రికి తీసుకొచ్చి నప్పుడు జవాద్ రజ్వీతో పాటు రాజ్ బహదూర్ గౌర్ తప్పించుకున్నారు. హైదరాబాద్‌లోనే అజ్ఞాతంగా ఉండిపోయారు. 1951 ఏప్రిల్‌లో మళ్లీ రాజ్‌ను అరెస్టు చేశారు. 1952 ఎన్నికల నాటికి సాయుధ పోరాటం అంతమైంది. జైళ్లలో ఉన్న కమ్యూనిస్టు నాయకులు విడుదలయ్యారు. మొదటి సార్వత్రిక ఎన్నికలలో పోటీ కూడా చేశారు. రాజ్ మాత్రం విడుదల కాలేదు. కాని జైలు నుంచే నామినేషన్ దాఖలు చేశారు. కాని ఆయన పేరు ఓటర్ల జాబితాలో లేనందువల్ల నామినేషన్ తిరస్కరించారు. 1952లో రాజ్ బహదూర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చొరవతో విడుదలయ్యారు. "రాజ్ బహదూర్ అడవి మనిషి. ఆయుధాలతో పట్టుబడ్డాడు కనక విడుదల చేయడానికి వీలు లేదు" అని గోపాల స్వామి అయ్యంగార్ లాంటి వారు వాదించారు. "ప్రతి సాధువుకు ఓ గతం ఉంటుంది. ప్రతి నేరస్థుడికి ఓ భవిష్యత్తు ఉంటుంది" అని రాధాకృష్ణన్ రాజ్ బహదూర్ విడుదలకు దోహదం చేశారు.

1947 లో రాజ్ బహదూర్ గౌర్ ట్రై కలర్ షల్ ఫ్లై ఓవేర్ హైద్రరాబాద్ గ్రంథం ఇంగ్లీషులో రాశారు. ఇదే ఆయన ప్రచురించిన మొదటి గ్రంథం. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘంతో ఆయనకు 1955 నుంచి సంబంధం ఉండేది. ఆభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష వర్గ సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ అంజుమన్-ఎ-తరక్కీ ఉర్దూ (అభ్యుదయ రచయితల సంఘం) కు చాలా కాలం అధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య ప్రయోజనంపై డా. గౌర్ కు నిర్దిష్ట అభిప్రాయాలున్నాయి. ఆనందం కలిగించడం మాత్రమే సాహిత్య ప్రయోజనం కాదని అది అలసిన గుండెలను సేద తీరుస్తుందని నమ్మేవారు. శ్రామికులకు కూడా సాహిత్యం అవసరమేననే వారు.

1975లో మఖ్దూం కవిత్వాన్ని విశ్లేషిస్తూ ఒక గ్రంథం వెలువరించారు. డిక్షనరీ జాన్సన్‌కు బాస్వెల్ లాగా మఖ్దూం కవిత్వానికి రాజ్ బహదూర్‌ను మించిన వ్యాఖ్యాత లేడు. కైఫీ ఆజ్మీ, అలీ సర్దార్ జాఫ్రీ, మౌలానా హస్రత్ మోహానీ వంటి వారి కవిత్వానికి భాష్యకారుడు రాజ్ బహదూర్. అదబి జాయజే, అదబి తంజూర్, అదబి ముతాలే వంటి గ్రంథాలు ఉర్దూలో రాశారు. ఉర్దూ సాహిత్య విమర్శకుడిగా రాజ్ బహదూర్ లబ్ధ ప్రతిష్ఠితుడు. ఆయన ఇంగ్లీషులో రాసిన వ్యాసాలు రాండం రైటింగ్స్‌గా వెలువడింది. తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలను గ్లోరియస్ తెలంగాణ ఆర్మ్డ్ స్ట్రగుల్ ఇంగ్లీషులో గ్రంథస్థం చేశారు. ముల్కీ టాంగుల్: ది కమ్యూనిస్ట్ అప్రోచ్, వర్కింగ్ క్లాస్ అండ్ ఎమర్జెన్సీ గ్రంథాలు ఇంగ్లీషులో వెలువరించారు. రాజ్ బహదూర్ ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో అసంఖ్యాకమైన వ్యాసాలు రాశారు. హైదరాబద్ కమ్యూనిస్టు సమితి కార్యకలాపాలకు డబ్బు అవసరమైనప్పుడల్ల హైదరాబాద్ నగర కమిటీ ఆఫీసు కార్యదర్శి యూసుఫ్ వెళ్లి ఒక వ్యాసం రాయించుకుని అచ్చు వేయించి వచ్చే వందో రెండువందలతో పార్టీ కార్యకలాపాలు నిర్వహించేవారు.

నిజాం ఏలుబడిలో తెలుగు కోసం పోరాడిన రాజ్ బహదూర్ ఆ తర్వాత ఉర్దూ అస్తిత్వం కోసం పాటుపడ్డారు. రాజ్ బహదూర్ మంచి హాస్య చతురుడు. మాటకు మాట తిప్పి కొట్టడంలో దిట్ట. ఒకసారి మఖ్దూం నిరాహార దీక్ష చేయాల్సి వచ్చింది. మఖ్దూం ఆరోగ్యం క్షీణిస్తున్నా అప్పటి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదు. చివరకు కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి వర్గం ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిని కలుసుకునే అవకాశం వచ్చింది. బ్రహ్మానందరెడ్డి ఆగ్రహంతో ఉన్నందువల్ల ఈ ప్రతినిధి వర్గం రాకను గుర్తించనట్టే ఫైళ్ల మీద సంతకాలు చేస్తూ ఉండిపోయారు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదించడానికి రాజ్ బహదూర్ "మా ఇంటి దగ్గర ఆనందం అని ఒకడుంటాడు. చిన్న కష్టం వస్తే కుంగి పోతాడు. సంతోషం కలిగితే అంతెత్తు ఎగిరి గంతులేస్తాడు. మీ పేరు బ్రహ్మానందరెడ్డి అయితే మరెంత ఆనందంగా ఉండాలి? ఇలా మొహం ముడుచుకు కూర్చున్నారే" అన్నారు. రాజ్ హాస్య చతురతకు బ్రహ్మానందరెడ్డి విరగబడి నవ్వడంతో వాతావరణం చల్లబడింది. ఒకసారి ఎవరో మీరు నాస్తికులా అని అడిగితే "నేను నాస్తికుడినే. భగవంతుడి మీద ప్రమాణం చేసి నాస్తికుడినని చెప్తున్నాను" అని దిమ్మ తిరిగే వెటకారంతో సమాధానం చెప్పారు.

రాజ్ బహదూర్ చిక్కడపల్లిలో ఓ మురికివాడ లాంటిచోట ఓ చిన్న ఇంట్లో ఉండే వారు. ఆ ఇంటికి చమేలీకె మండ్వా అని పేరుపెట్టారు. చమేలీకే మండ్వా మఖ్దూం ప్రసిద్ధకవిత. సినిమాపాటగా కూడా ప్రసిద్ధ మైంది. భోగలాలసత, ఆడంబరాలు రాజ్ బహదూర్ జీవితంలో ఎన్నడూ దరిజేరలేదు. ఎక్కడికెళ్లినా తన బట్టలు తానే ఉతుక్కునే వారు. ఒక సారి ఢిల్లీలోని కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో ఉన్నారు. అప్పుడు విద్యార్థి యువజన నాయకుడిగా ఉన్న సురవరం సుధాకరరెడ్డి (మాజీ సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి) ఎక్కడికో పర్యటనకెళ్లి పదిహేను రోజుల తర్వాత తిరిగి వచ్చారు. సుధాకరరెడ్డి బట్టలు, దుప్పట్లు, దిండు గలేబులు రాజ్ బహదూర్ శుభ్రంగా ఉతికి పెట్టారు. ఇదేమిటి అని అడిగితే నువ్వు ఇంతకన్నా బాగా ఉతుకుతావా, పైగా సాయుధ పోరాటంలో నా సహచరుడి (సురవరం నారాయణ్ రెడ్డి. సుధాకర్ రెడ్డి తండ్రి. సాయుధ పోరాటంలో భాగస్వామి) కొడుకు బాగోగులు చూడడం నా విధి అన్నారు డా. గౌర్.

రాజ్ బహదూర్ మరణానికి కొన్ని రోజుల ముందే పార్లమెంటు సభ్యులకు రావాల్సిన పింఛన్ బకాయిలు అందాయి. అందులోంచి మూడు లక్షల రూపాయలు ఉర్దూ అభ్యసించే విద్యార్థులకు ఉపకార వేతనాల కోసం ఉర్దూ తాలిమీ ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చారు. బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు కమ్యూనిస్టు పార్టీకి చెందాలని వీలునామా రాశారు. తన మరణం తర్వాత ఎలాంటి కర్మ నిర్వహించకూడదని కూడా అందులో రాశారు. ఆయన పార్థివ శరీరాన్ని ఉస్మానియా వైద్య కళాశాలకు అప్పగించారు.

90 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా ఎవరైనా ఆయన ఇంటికి వెళ్తే మాట మంతీ ముగిసిన తర్వాత సాగనంపడానికి గేటు దాకా వచ్చే వారు. మీరు రావడం ఎందుకు ఉండండి అంటే "అతిథి మర్యాద చేయడం నా బాధ్యత" అనే వారు. దక్కనీ తహజీబ్ అంటే అదే. తుపాకి పట్టిన చేతితోనే కలం ఝళిపించిన సాహితీరంగ యోధుడు డా. రాజ్ బహదూర్ గౌర్.

డా॥ రాజ్ బహదూర్ గౌర్ 107 వ జయంతి సందర్భంగా

అభివృద్ధి మూలాల శోధనే చరిత్ర

చెన్నాప్రగడ శర్మ
9440587567

గ్రంథ సమీక్ష

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని ఘనంగా పలికిన శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాషాభిమాని. తెలుగుజాతిని భాష పరంగా ఒకే తాటిపై నడిపించిన సాహితీ పిపాసి. 1509-1529 మధ్య కాలంలో విజయనగర సామ్రాజ్యాన్ని ఏలిన చక్రవర్తి. ఆంధ్రభోజుడిగా, సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా కీర్తి గడించిన రాయలవారి ఆస్థానంలో అష్టదిగ్గజాలనే ఎనిమిది మంది కవి పండితులు ఉండేవారు. వారు కొలువుతీరే సభా ప్రాంగణమే 'భువన విజయం'. ఇదే శీర్షికతో తెలుగు భాషోద్యమ ప్రముఖుడు, శతాధిక గ్రంథకర్త, ఆయుర్వేద వైద్యుడు అయిన డాక్టర్ జి.వి.పూర్ణచందు రాయల కాలం నాటి కథలు, గాథలను పుస్తక రూపంలో మన ముందుంచారు. అభివృద్ధి మూలాలను వెతకడమే చరిత్ర ముఖ్య లక్ష్యంగా ఆయన ఈ పుస్తకం రాశారు. విజయనగర కాలంలో జరిగిన అభివృద్ధిపై దృష్టి సారించి పరిశీలన చేస్తే.. అది నేటి కాలపు ఆలోచనలకు మేలు చేసేదిగా ఉంటుంది. చరిత్ర పరిశీలనా దృష్టి మారాలన్న దృక్పథంతోనే ఈ పుస్తకాన్ని తీసుకొచ్చానన్నది రచయిత భావన. రాయల చరిత్రలో వక్రీకరణలే అధికంగా ఉన్నాయని గుర్తించి ఈ గ్రంథం ద్వారా అనేక వాస్తవాలను బట్టబయలు చేశారు. వివిధ సందర్భాల్లో డాక్టర్ రాసిన వ్యాసాల సమాహారమే ఈ 'భువన విజయం'.

రాయలవారి పేరు చెప్పగానే గుర్తొచ్చే దివ్య ప్రబంధం 'ఆముక్తమాల్యద'. స్వయంగా ఆంధ్ర మహావిష్ణువే కలలో సాక్షాత్కరించి రాయించినట్టు 'ఆంధ్రవిష్ణు కథ'లో పూర్ణచందు ప్రస్తావించారు. ఈ గ్రంథానికి బీజంపడింది కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళం కావడం విశేషం. అసలీ ఆంధ్ర మహావిష్ణువు ఎవరు... ఎలా ఉంటాడనే దానిపై చాలా లోతుగా విశ్లేషించారు. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ ప్రాంతాలన్నీ విజయనగర సామ్రాజ్యాన్ని ఆర్థికంగా సుసంపన్నం చేసినట్లు చెబుతారు. వజ్రాలు, మంచి గంధపు చెక్క విరివిగా లభ్యంకావడమే ఇందుకు కారణమని విశ్లేషించారు. కెంపులు, వజ్రాలు, పచ్చలు, రత్నాలు, ముత్యాలు, పగడాలను అంగళ్లలో కుప్పలుగా పోసి కూరగాయల్లా అమ్మేవారట. అందుకే ఆ కాలాన్ని స్వర్ణయుగమని చెబుతారు. విజయనగర కాలం తర్వాత ఆంధ్ర ప్రాంతంలోని కొండపల్లి, పరిటాల, కోళ్లూరు, వజ్రకరూరు, సంద్యాల, జొన్నగిరి, బనగాన పల్లి తదితర ప్రాంతాల్లో ప్రసిద్ధిగాంచిన వజ్రాల గనులున్నట్లు చెప్పారు. రాయల అనంతరం దాదాపు 16 తెలుగు వజ్రాలు లభ్యమయ్యాయట. వాటిలో కోహినూర్ అతి ముఖ్యమైనది. వాటన్నింటి గురించి రచయిత విపులంగా వివరించారు. రాయల వారి పాలనలో తెలుగు భాషకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చారు. అదే ప్రాధాన్యతను నేటి పాలకులూ కలిగించాలని ఆకాంక్షిస్తారు. రాయలవారు చేసిన అనేక శాసనాల గురించి ప్రస్తావిస్తూ.. వాటి లోంచి మన భాషా సంస్కృతులకు ఉపయుక్తమయ్యే అంశాలను వెలుగులోకి తేవాల్సినఅవసరం ఎంతైనాఉందని నొక్కి చెబుతారు. రాయలవారి జననం, ఇంటి పేరు, తిమ్మరసును మంత్రివర్గంలోకి తీసుకోవడంవంటి విషయాలను ప్రస్తావించారు. కృష్ణదేవ రాయలు మరణంగురించి విభిన్నతేదీలు ప్రచారంలో ఉన్నాయన్న సంగతిని చెప్పకనే చెప్పారు.

రాయల వారి కూతురు మోహనాంగి...

తెలుగు విశ్వానికి ఆది భాష అని సగర్వంగా చెప్పిన ఏకైక రచయిత్రి మోహనాంగి. ఆమె రాయలవారి పుత్రికారత్నం. మంచి చిత్రకారిణి కూడా. ఆమె పేరు వెనుకగల కథనూ రచయిత ప్రస్తావించడం విశేషం. 'మారీచీ పరిణయం' పేరిట రాసిన కావ్యంలో రాయలవారి వంశచరిత్ర, ఆ కాలంలోని సాంఘికజీవనం, చారిత్రకఅంశాలను చక్కనిపద్యాల్లో వివరించింది. ఆమెకు తెలుగు భాషపట్ల మక్కువఎక్కువని నిరూపించడానికి ఈ పద్యమే సాక్ష్యం.

"తెనుగు భాస ప్రపంచమంతటికి నాదింబొల్చి నిర్దోషలౌ/ట నిజాంచత్పదముల్ బుధాగ్రణుల్ వేడ్కన్ మౌళులందాల్చి మ/ న్నన సల్పంగ త్రిమూర్తులై వెలయు నా నన్నయ తిక్కన యె/ ర్రనలన్ భావమునన్ స్మరించెదను నేనాంధ్రాభిలాషంబునన్". ఇలా సాహితీ త్రిమూర్తులైన నన్నయ, తిక్కన, ఎర్రనలను మనసు లోనే స్మరిస్తున్నానంటూ మోహనాంగి ముందుగా కవిత్రయానికి నమస్కృతులు తెలుపుకొంది. పైగా ఈ కావ్యాన్ని తండ్రికే అంకితమిచ్చింది. ఈ మోహనాంగి పాత్రపైనా అనేక సందేహాలున్నాయని, అనేక చర్చలకు దారితీసిందని పూర్ణచందు చక్కగా తెలియజేశారు. ఆయన ఈ సందర్భంగా మరో ముఖ్యమైన ప్రస్తావన తీసుకొచ్చారు. రాయలవారికి పిల్లనిచ్చిన మామ ప్రతాపరుద్ర గజపతా? లేక ఆయన సోదరుడు వీరరుద్ర గజపతా? అని సందేహం వ్యక్తంచేశారు. రాయలవారు ప్రతాపరుద్ర గజపతిని ఓడించాక ఆయన కుమార్తె తుఖాదేవిని వివాహమాడిన సంగతి చెబుతారు. రాయలవారి పెద్ద భార్య తిరుమలాదేవి. రెండో భార్య చిన్నాదేవి. ఆమె మరణానంతరమే తుఖాదేవి ఉరఫ్ అన్నపూర్ణా దేవితో పెళ్లి జరిగిందన్నది కొందరి వాదనగా అభివర్ణించారు. వీరి వివాహం గురించి ప్రచారంలో ఉన్న రకరకాల కథలను ఈ పుస్తకం ద్వారా వెలుగులోకి తెచ్చారు.

ఆముక్తమాల్యదలో ఆహారం...

విష్ణుచిత్తుడు కాలానుగుణంగా వంటకాలు వండించి తన అతిథులకు వడ్డించేవాడని ఆముక్తమాల్యద గ్రంథంలో రాయల వారు ప్రస్తావించినసంగతిని డాక్టర్ పేర్కొన్నారు. ఆనాటి వంటకాల్లో ఐదాకుల వేపుడుకూర, తేమనం, తిమ్మనం, చాపట్లు, పొరివిళంగాయలు ముఖ్యమైనవి. పూర్ణచందు తెలుగువారి ఆహార చరిత్రకారుడు కూడా కావడంతో శాకపాకాల వివరణలో చెయ్యి బాగా తిప్పారు. భోజనం భోగమే కాదు..ఒక యోగమని చెబుతారాయన. రాయలనాటి సమాజం..ప్రధానంగా రైతులపట్ల ఆయనకున్న అవగాహన ఏమిటో విశ్లేషించారు. భువనవిజయంలోని కవిపుంగవులందరినీ పరిచయంచేశారు. ఇంకా బెజవాడ ప్రాభవం, రాయలవారి తాంబూలం, దసరా ఉత్సవం గురించి చక్కగా విశదీకరించారు. అలనాటి దసరా ఉత్సవాలే తిరుమల, మైసూరుల్లో జరిగే దశమి ఉత్సవాలకు మూలాలుగా పేర్కొంటూ చక్కని ముగింపు పలికారు. అర్ధ శతాబ్దిగా సాహితీ వ్యవసాయం చేస్తూ 150కి పైగా పొత్తములపంట పండించి గత ఏడాది సాహితీ స్వర్ణోత్సవం జరుపుకొన్న డాక్టర్ జి.వి.పూర్ణచందు కలం నుంచి జాలువారిన ఈ 'భువనవిజయం' మరో ఆణిముత్యమనే చెప్పాలి. చరిత్రమీద ఆసక్తిఉన్న ప్రతిఒక్కరూ చదవాల్సినపుస్తకం. చరిత్రకు సంబంధించిన వాస్తవాలను గ్రహించేందుకు దోహదపడ గలదు.

శ్రీ రేగుళ్ల మల్లికార్జునరావు వేసిన ముఖపత్ర చిత్రం అదనపు ఆకర్షణ. 184 పేజీలు.. స్వల్ప బరువున్న ఈ పుస్తకం వెల రూ.200/-. ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి, ఘంటసాల సంగీత కళాశాల, దుర్గాపురం, విజయవాడ-520003 చిరునామాలో సంప్రదించవచ్చు.

మాతృదేవోభవ

తమిరిశ జానకి

అందాలరాశి ఈ ప్రకృతి అది నిజం!
అమ్మ మనసుకి ఉంది
అంతకన్నా అందం!
పచ్చని నవ్వులు
ప్రకృతి అంతా!
పచ్చని దీవెనలు అమ్మ మదినిండా!
ఫలపుష్పాదులు మనకందించి
ఊపిరిపోసే ప్రకృతిమాతకు వందనాలు !
తన ఊపిరినే లెక్కించక
పునర్జన్మనెత్తు అమ్మపాదాలకు ప్రణామాలు!
భూత భవిష్యత్ వర్తమానాలకు
అమూల్యవరమది అమ్మఒక్కతే!
మాయమవని మమతల వెన్నెలధార!
వాడిపోని మమకారపు కుసుమకోమల హృదయ!
అమ్మ అన్నది
ఉత్తుత్తి మాట కాదు!
రెండక్షరాలకు జీవంపోసిన అమృతభాండమది !

ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం-2025కు

విమర్శా గ్రంథాలకు ఆహ్వానం

అరసం వరంగల్ వారు ప్రతి సంవత్సరం ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేయుట మీకు తెలిసిందే. 2025 సంవత్సరంకు గాను సాహిత్య విమర్శకు ప్రదానం చేయుటకు నిర్ణయించడమైనది. కావున సాహిత్య విమర్శా గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం.

నిబంధనలు:

1. 2021జూలై నుంచి 2025 జూన్ వరకు ప్రచురించినవై ఉండాలి.
2. మొదటి ముద్రణలు మాత్రమే పంపాలి.
3. నాలుగు ప్రతులు పంపాలి.
4. అన్ని ప్రాంతాల వారు పంపవచ్చును.
5. వివిధ రచయితల కూర్పు సంకలనాలు పంపరాదు.
6. ప్రతులు చేరవలసిన చివరి తేది 31 ఆగస్టు 2025.
7. ఎంపికైన గ్రంథకర్తకు అక్టోబర్ 2025లో హనుమకొండలో జరుగు ప్రత్యేక కార్యక్రమంలో రూ.5000/- నగదు, శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం చేయటం జరుగుతుంది.

పుస్తకాలు పంపవలసిన చిరునామా:

బూర భిక్షపతి,
ఇంటి నెంబర్, 2-12-293/20, రోడ్ నెంబర్ 2బి,
విజయనగర్ కాలని, గోపాలపురం రోడ్
హనుమకొండ 506009 (తెలంగాణ),
ఫోన్: 9866612712

రచయితలు సకాలంలో వారి విమర్శా గ్రంథాలను పంపవలసినదిగా అరసం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బూర భిక్షపతి, ప్రధాన కార్యదర్శి మార్క శంకరనారాయణలు ఒక ప్రకటనలో కోరారు.

ధర్మశాల హత్యలపై సిట్ దర్యాప్తు

బెంగళూరు: దక్షిణ కన్నడ జిల్లాలోని ధర్మస్థల ప్రాంతంలో రెండు దశాబ్దాలుగా జరిగిన అనేక హత్యలు, లైంగిక వేధింపులు, మహిళల అదృశ్యం కేసులకు సంబంధించి తీవ్ర ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి కర్నాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందానికి అంతర్గత భద్రతా విభాగం పోలీసు డైరెక్టర్ జనరల్ ప్రణవ్ మొహంతి నేతృత్వం వహిస్తారు. దీనిలోని ఇతర సభ్యులలో పోలీసు అదనపు కమిషనర్ (రిక్రూట్‌మెంట్) ఎం.ఎన్.అనుచేత్, పోలీసు డిప్యూటీ కమిషనర్ (సీఏఆర్ ప్రధాన కార్యాలయం) సౌమ్యలత, పోలీసు సూపరింటెండెంట్ (అంతర్గత భద్రతా విభాగం) జితేంద్ర కుమార్ దయామ ఉన్నారు. 'ధర్మస్థల ప్రాంతంలో వందలాది మృతదేహాలను ఖననం చేశారని' ఒక వ్యక్తి కోర్టు ప్రకటనను ఉటంకిస్తూ కర్నాటక రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి చౌదరి రాసిన లేఖకు ప్రతిస్పందనగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మనిషి పుర్రె దొరకడం, తప్పిపోయిన వైద్య విద్యార్థి కుటుంబం చేసిన ప్రకటనలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ మీడియాలో వచ్చిన నివేదికలను కూడా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. కోర్టు సాక్ష్యంతో పాటు మీడియా నివేదికలు '20 సంవత్సరాలకు పైగా మహిళలు, విద్యార్థినులపై అఘాయిత్యాలు, అసహజ మరణాలు, అదృశ్యాల కలతపెట్టే పరిస్థితిని' సూచిస్తున్నాయని కమిషన్ పేర్కొంది. దీనిపై ధర్మస్థల పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్ సెక్షన్ 211 (ఎ) కింద ఇప్పటికే కేసు నమోదయింది. సిట్ ద్వారా సమగ్ర దర్యాప్తు నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

సిద్ధు వర్సెస్ డీకే

- ఇంటికెళ్లిన వారి పేర్లు ఎందుకు?
- డీకే ప్రస్తావనపై సిద్ధరామయ్య తీవ్ర అసహనం

బెంగళూరు: కర్నాటకలో సిద్ధరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించి డీకే శివకుమార్‌కు పగ్గాలు అప్పగిస్తారనే ఊహాగానాల నడుమ మైసూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో డీకే శివకుమార్ ప్రస్తావన తేవడంపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్ర అసహనం వ్యక్తం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మైసూర్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ వేడుకలో సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ హాజరయ్యారు. కానీ డీకే అత్యవసరంగా బెంగళూరుకు వెళ్లిపోయారు. అనంతరం సిద్ధరామయ్య వేదికపై మాట్లాడుతున్న సమయంలో, కాంగ్రెస్ నేత ఒకరు శివకుమార్ పేరు ప్రస్తావించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. "డీకే శివకుమార్ ఇక్కడ లేరు కదా? మీరు వెళ్లి కూర్చోండి. మీరు గొప్ప లాయరు' అంటూ కౌంటర్ ఇచ్చారు."ఇక్కడ వేదికపై ఉన్నవారి పేర్లే ప్రస్తావించాలి. ఇంటికెళ్లిపోయినవారి పేర్లు ఎందుకు చెప్పాలి? ఇది ప్రోటోకాల్. మీరు న్యాయవాదిగా ఇది అర్థం చేసుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అధికార మార్పిడి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అంతర్గత పోరు జరుగుతున్న వేళ ఈ పరిణామం చర్చనీయాంశమైంది.

బీజేపీ ఇప్పటికే ఈ అంశాన్ని ప్రచార అస్త్రంగా మార్చుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన అనంతరం డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవికి కోసం ప్రయత్నాలు చేశారు. చివరికి హైకమాండ్ ఆయన్ని డిప్యూటీ సీఎం పదవికి ఒప్పించి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమించింది. ఒక దశలో సీఎం పదవి రొటేషన్ విధానంలో మారే అవకాశం ఉందన్న వార్తలు వినిపించాయి. కానీ అధికారికంగా ఏ నిర్ణయం ప్రకటించలేదు. అయితే డీకే శివకుమార్ సీఎం పదవిపై తరుచూ తన మనసులో మాటను వ్యక్తం చేస్తూనే ఉన్నారు.ఈ క్రమంలోనే సిద్ధరామయ్య పదవిలో కొనసాగుతుండటంతో శివకుమార్ వర్గంలో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్టు వర్గాలు చెబుతున్నాయి. ఇదివరకూ సిద్ధూ, డీకే మధ్య విభేదాలు కొన్ని బహిరంగ కార్యక్రమాల్లో స్పష్టంగా కనిపించాయి. తాజాగా, మైసూరు వేదికపై చోటుచేసుకున్న ఈ సంఘటన, మరోమారు అధికార కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటను బయటపెట్టింది.

దిద్దుబాటుకు యత్నం

సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇద్దరూ కలిసి ఆదివారం కావేరీ ఉపనది కాబినీ నదికి 'బాగిన' (సంప్రదాయ ఆచార నైవేద్యం) సమర్పించారు. శనివారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరైన మైసూరు సభలో శివకుమార్‌ను సిద్ధరామయ్య నిర్లక్ష్యం చేశారనే వివాదం చెలరేగిన ఒక రోజు తర్వాత వీరిద్దరూ ఒకే కార్యక్రమంలో పాల్గొని ఐక్యతను చాటడం గమనార్హం. ఈ సందర్భంగా సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ... డీకే శివకుమార్‌కు అవమానం జరిగిందన్న బీజేపీ ప్రచారాన్ని ఖండించారు. రాజకీయ దుశ్చర్యగా పేర్కొన్నారు. "బీజేపీ పెరుగులో గులకరాళ్లను వెతకడానికి ప్రయత్నిస్తోంది - సమస్య లేని దాని నుండి సమస్యను సృష్టిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. 'శివకుమార్ ముందుగానే హాజరయ్యారు. తాను ఢిల్లీకి వెళు న్నానని ఆయన మాకు తెలియజేశారు. బహిరంగంగా కూడా అలా అన్నారు. అందుకే నేను ఆయన పేరును ప్రస్తావించలేదు" అని వివరించారు. వేదిక నుండి వెళ్లిపోయిన వ్యక్తి పేరు చెప్పకపోతే అది అవమానం ఎలా అవుతుంది? బీజేపీ మా మధ్య చీలిక సృష్టించవచ్చని భ్రమపడింది. వారు రాజకీయ మైలేజ్ గురించి కలలు కంటున్నారు. వారు ఎప్పటికీ ఆ భ్రమలోనే ఉంటారని ఎద్దేవా చేశారు. శివకుమార్ కూడా శనివారం జరిగిన ఘటనను తక్కువ చేసేందుకు యత్నించారు. "బీజేపీ నాయకులకు నాపై చాలా ప్రేమ ఉన్నట్లు అనిపిస్తోంది" అని నవ్వుతూ అన్నారు. తాను కార్యక్రమం నుండి నిష్క్రమిస్తున్నట్లు ముందుగానే తెలియజేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో అత్యవసర పని ఉందని ముఖ్యమంత్రి, ఇతరులకు తెలియజేశానని చెప్పారు. "నేను ఒక న్యాయవాదితో అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. నా ప్రసంగం తర్వాత వెంటనే అక్కడికి వెళ్లాను. నేను అదే రాత్రి తిరిగి వచ్చాను. నా ఢిల్లీ పర్యటనలో ఎటువంటి రాజకీయాలు లేవు" అని శివకుమార్ స్పష్టం చేశారు. తన కాన్వాయ్‌లో వాహనానికి జరిగిన చిన్న ప్రమాదం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. చాముండేశ్వరి దేవి దయవల్ల, ఎటువంటి హాని జరగలేదన్నారు.

రాజకీయాలకంటే దేశమే ముఖ్యం

జాతీయ భద్రత దృష్ట్యా మోదీకి మద్దతు: థరూర్

కొచ్చి: కాంగ్రెస్‌తో విభేదాల వేళ ఆ పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ మరోమారు కీలక వ్యాఖ్యలు చేశారు. 'శాంతి, సామరస్యం, జాతీయ అభివృద్ధి' అంశంపై కొచ్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్నిటికంటే దేశమే ముందుండాలని, పార్టీలు కేవలం మెరుగైన దేశాన్ని నిర్మించే సాధనాలు మాత్రమేనని చెప్పారు. జాతీయ భద్రత దృష్ట్యా రాజకీయ పార్టీలు ఒకదానితో ఒకటి సహకరించుకోవాలని స్పష్టం చేశారు. మీ మొదటి విధేయత ఏమిటన్న ప్రశ్నకు థరూర్ బదులిస్తూ తన దృష్టిలో దేశమే ముందని, పార్టీలు దేశాన్ని మెరుగుపరిచే సాధనాలు మాత్రమేనని చెప్పారు. ఏ పార్టీకి చెందిన వారైనా పార్టీ లక్ష్యం సొంత మార్గంలో మెరుగైన భారతదేశాన్ని సృష్టించడమేనని అన్నారు. ఆపరేషన్ సిందూర్, దేశ రక్షణకు సంబంధించిన విషయాల్లో ప్రధానమంత్రి మోదీకి మద్దతు ఇవ్వడంపై తాను ఎదుర్కొన్న విమర్శలను ప్రస్తావిస్తూ... మన సాయుధ దళాలకు, ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ తాను తీసుకున్న వైఖరిపై చాలామంది తనను విమర్శించినప్పటికీ

తన వైఖరిలో మార్పు ఉండబోదని చెప్పారు. ఎందుకంటే దేశానికి ఇది సరైనదని తాను నమ్ముతానని తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వంతో థరూర్‌కు ఉన్న బంధంపై ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... తమ పార్టీలో కొన్ని విలువలు, నమ్మకాలు ఉన్నాయని, కానీ జాతీయ భద్రత దృష్ట్యా తాము ఇతర పార్టీలకు సహకరించాల్సి వస్తుందన్నారు. అయితే, కొన్నిసార్లు పార్టీలు అది తమకు నమ్మక ద్రోహంగా భావిస్తాయని, అప్పుడు సమస్యగా మారుతుందని వివరించారు. ఏ ప్రజాస్వామ్యంలోనైనా రాజకీయాల్లో పోటీ అనివార్యంగా ఉంటుందని, కానీ క్లిష్ట సమయాల్లో కలిసి పనిచేయడానికి అది అడ్డురాకూడదన్నారు. తన 16 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను జాతీయ భద్రత, జాతీయ ప్రయోజనాలను కూడా నమ్ముతానని థరూర్ చెప్పారు.

అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రి

ముంబై: అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మంత్రి తన సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మాణిక్‌రావ్ కోకాటె అసెంబ్లీ సమావేశాల సమయంలో ఫోన్‌లో రమ్మీ ఆడుతున్నారని ఎన్సీపీ (శరద్‌పవార్ వర్గం) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా దీనికి సంబంధించిన వీడియోలను పంచుకున్నారు. రైతులు, వ్యవసాయ సమస్యల గురించి సభలో చర్చలు జరుగుతున్న సమయంలో మంత్రి ఇలా వ్యవహరించారని మండిపడ్డారు. రాష్ట్రంలో రోజుకు 8 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. అయిన ప్పటికీ వ్యవసాయ మంత్రి వీటన్నింటినీ పట్టించుకోకుండా ఆటలాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి మంత్రులున్న ప్రభుత్వం... పంట బీమా, రుణ మాఫీ, మద్దతు ధరల కోసం రైతులు చేసే డిమాండ్‌లను ఎందుకు వింటుందని విమర్శించారు. అప్పుడప్పుడైనా పేద రైతుల పొలాలు సందర్శించండి

మహారాజా అంటూ కోకాటెపై రోహిత్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సంఘటనపై ప్రతిపక్షాలు భగ్గుమంటు న్నాయి. ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడం లేదని ఆరోపించాయి. దీనిపై శివసేన (యూబీటీ) ప్రతినిధి ఆనంద్ దూబే స్పందిస్తూ మంత్రి కోకాటె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు విజ్ఞప్తి చేశారు.

ఒక రాధ...ఇద్దరు కృష్ణులు

సిమ్లా: ఒక వధువు... ఇద్దరు పెండ్లి కొడుకులు... పైగా వారిద్దరు అన్న దమ్ములు... వివాహంతో ఒక్కటయ్యారు. ఈ వేడుకకు వందలమంది హాజరై... ఆ అరుదైన జంటను ఆశీర్వదించారు. హిమాచల్ ప్రదేశ్ సిరమూర్ జిల్లా షిల్లై గ్రామంలో జులై 12 నుంచి మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా ఈ వివాహ వేడుక జరిగింది. హట్టి తెగ జానపద పాటలతో, నృత్యాలతో అన్నదమ్ములైన ప్రదీప్, కపిల్‌ను సునీతా చౌహాన్ వివాహం చేసుకున్నది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వేడుకకు హాజరై వాళ్లను ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రదీప్ స్థానికంగా ప్రభుత్వ ఉద్యోగి కాగా... అతని సోదరుడు కపిల్ విదేశాల్లో జాబ్ చేస్తున్నాడు. కున్‌హట్ గ్రామానికి చెందిన సునీత పెద్దల మాటకు విలువ ఇచ్చే ఈ వివాహం చేసుకున్నట్లు చెబుతున్నారు. తమపై ఎవరి ఒత్తిడి లేదని, ఇష్టపూర్వకంగానే చేసుకున్నామని, ఇలా వివాహం చేసుకోవడం అనాదిగా తమ తెగలో వస్తున్న ఆచారమని చెబుతున్నారు. ఈ వివాహం తమకెంతో గర్వంగా ఉందని ఫొటో షూట్‌లో ఉత్సాహంగా పాల్గొంటూ చెప్పారు. హట్టి తెగ ప్రజలు హిమాచల్ ప్రదేశ్-ఉత్తరాఖండ్ సరిహద్దులో ట్రాన్స్ గిరి రీజియన్‌లో 450 గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. మూడేళ్ల కిందటే ఈ తెగకు షెడ్యూల్ ట్రైబ్(గిరిజన తెగ- ఎస్టీ) గుర్తింపు దక్కింది. అయితే వేల ఏళ్లుగా బహుభర్తృత్వాన్ని ఈ తెగ పాటిస్తోంది. అందుకు భూవివాదాలే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ ఐక్యత... తద్వారా భూవివాదాలు లేకుండా ఉండేందుకే హట్టి తెగ ఈ ఆచారం మొదలుపెట్టింది. సోదరుల మధ్య బంధం బలంగా ఉండి ఉమ్మడి కుటుంబంలో గొడవలు జరగవనేది మరో కారణం. ఇద్దరు భర్తలు ఉంటే తమ ఆడబిడ్డలకు రక్షణ బలంగా ఉంటుందని ఈ తెగవారు భావిస్తారు. ఈ తరహా వివాహాలకు అక్కడి రెవెన్యూ చట్టాలు కూడా సమ్మతిని తెలుపుతున్నాయి.

డాన్ దర్శకుడు బరోట్ కన్నుమూత

ముంబై: హిందీ సినిమా పరిశ్రమలో విషాదం నెలకొంది. భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన అలనాటి మేటి చిత్రం డాన్ దర్శకుడు చంద్రా బరోట్ (86) కన్నుమూశారు. కొంత కాలంగా పల్మనరీ ఫైబ్రోసిస్‌తో భాధ పడుతున్న ఆయన ఆదివారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. భారతీయ సినీ ప్రపంచంలో కొన్ని సినిమాలు ఎప్పటికీ గుర్తుండి పోతాయి. అలాంటి క్లాసిక్ హిట్‌లలో ఒకటి డాన్. ఈ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు చంద్రా బరోట్ నేటి తరం ప్రేక్షకులకు పెద్దగా పరిచయం కాకపోయినా బాలీవుడ్‌లో తనకంటూ చిరస్థాయిగా నిలిచేలా ప్రత్యేక ముద్రను సొంతం చేసుకున్నారు. 1940లో గుజరాత్‌లో జన్మించిన ఆయన బాల్యం నుంచే సినిమా, నాటక రంగంపై ఆసక్తి కనబరిచారు. ముంబై ఫిల్మ్ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. తక్కువ సమయంలోనే అంచలంచెలుగా ఎదుగుతూ 1970లో అసిస్టెంట్ డైరెక్టర్ అయ్యారు. మనోజ్ కుమార్ నటించి, నిర్మించిన నాలుగు సినిమాలకు పనిచేశారు. ఆ అనుభవంతో అనుకోకుండా వచ్చిన అవకాశంతో 1978లో డాన్ సినిమాకు దర్శకత్వం వహించి బాలీవుడ్ చరిత్రలో ఒక లెజెండరీ మూవీగా నిలిపారు. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ ద్విపాత్రాభి నయం చేయగా, సలీమ్-జావేద్ రాసిన కథను చంద్రా బరోట్ అద్భు తంగా తెరకెక్కించారు. విడుదలైన తర్వాత బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి ఇండస్ట్రీ హిట్ సాధించడమే గాక అనేక రికార్డులు తిరగరాసిన ఈ చిత్రం...తర్వాత తెలుగులో ఎన్టీఆర్ హీరోగా యుగంధర్, ప్రభాస్ బిల్లా, తమిళంలో అజిత్ బిల్లాగా తెరకెక్కింది. హిందీలోనే షారుఖ్ హీరోగా రీమేక్ చేశారు. డాన్ వంటి సంచలన విజయవంతమైన మూవీ తర్వాత బెంగాలీలో ఓ సినిమా చేసిన ఆయన మంచి హిట్ కొట్టారు. తర్వాత మరో మూడు చిత్రాలు డైరెక్ట్ చేసినా అవి విడుదలకు నోచుకోలేదు. దీంతో ఆయన సినిమాలకు గుడ్ బై చెప్పి... డాక్యుమెంటరీలు, అడ్వర్టైజింగ్ రంగాల్లో కొనసాగారు.

జస్టిస్ వర్మ అభిశంసన నోటీసుపై

100 మంది ఎంపీల సంతకం: రిజిజు

న్యూఢిల్లీ: జస్టిస్ యశ్వంత్ వర్మ తొలగింపునకు పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టేందుకు 100 మందికి పైగా ఎంపీలు ఇప్పటికే నోటీసుపై సంతకం చేశారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం తెలిపారు. లోక్‌సభలో అభిశంసన ప్రక్రియను ప్రవేశపెట్టడానికి అవసరమైన మద్దతు పరిమితిని ఇది దాటిందని ఆయన అన్నారు. 'సంతకాలు జరుగుతున్నాయి. ఇది ఇప్పటికే 100 దాటింది' అని రిజిజు అఖిలపక్ష సమావేశం తర్వాత విలేకరులతో మాట్లా డుతూ అన్నారు. తమ తమ సభలలో అజెండాను ఖరారు చేసే పార్టీల బృందం అయిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఈ తీర్మానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టాలో నిర్ణయించాల్సి ఉంటుందని చెప్పారు. న్యాయమూర్తి తొలగింపు తీర్మానంపై లోక్‌సభలో కనీసం 100 మంది ఎంపీలు, రాజ్యసభలో 50 మంది ఎంపీలు సంతకం చేయాలి. దిగువ సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఉంది. సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నందున... ఈ సమావేశా ల్లోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. 'న్యాయవ్యవస్థలో అవినీతి' కి వ్యతిరేకంగా ఈ చర్యలో ప్రతిపక్షాలతో సహా వివిధ పార్టీల నుంచి మద్దతు పొందుతోంది. 'ప్రాధాన్యత పరంగా నేను ఏ విషయంపైనా వ్యాఖ్యానించలేను. ఎందుకంటే ఈ అంశాన్ని బీసీఏ చైర్ ఆమోదంతో ఆమోదించే వరకు బయట ప్రకటన చేయడం నాకు కష్టం' అని సెషన్ మొదటి వారంలో ఈ తీర్మానాన్ని తీసుకు రావచ్చా అని అడిగినప్పుడు రిజిజు అన్నారు. వర్మను తొలగించే చర్యతో అన్ని రాజకీయ పార్టీలు ఏకీభవిస్తున్నాయని ఆయన గతంలో పీటీఐకి చెప్పారు. 'న్యాయ వ్యవస్థలో అవినీతి అనేది చాలా సున్నితమైన, తీవ్రమైన విష యం. ఎందుకంటే న్యాయవ్యవస్థ ప్రజలకు న్యాయం జరిగే ప్రదేశం. న్యాయ వ్యవస్థలో అవినీతి ఉంటే, అది అందరికీ తీవ్రమైన ఆందోళన కలిగిస్తుంది. అందుకే జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించాలనే తీర్మానంపై అన్ని రాజకీయ పార్టీలు సంతకం చేయాలి' అని ఆయన అన్నారు. మార్చిలో అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వర్మ ప్రాంగణంలో జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత అత్యవసర సేవల సంస్థలు ఆయన అవుట్ హౌస్ వద్ద పెద్ద మొత్తంలో కాలిపోయిన నగదును గుర్తిం చారు. అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నియమించిన ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ ఆయనపై నేరారోపణ చేసింది. రాజీనామా చేయడానికి జస్టిస్ వర్మ నిరాకరించడంతో ఆయనను తొలగించాలని మాజీ సీజేఐ ఖన్నా ఈ విషయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సిఫార్సు చేశారు. అయితే జస్టిస్ వర్మ కమిటీ కనుగొన్న వాటికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

అప్పల బాధతో కుటుంబం ఆత్మహత్య

అహ్మదాబాద్: గుజరాత్‌లో దారుణం జరిగింది. ఆర్థిక ఇబ్బందుల్ని తట్టుకోలేక ఓ ఆటోడ్రైవర్ కుటుంబం విషం తాగి సామూహికంగా ఆత్మహత్యకు పాల్పడింది. ఆటో డ్రైవర్ దంపతులిద్దరూ తమ ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడికి విషం ఇచ్చి ఆత్మహత్య చేసుకున్నారు. అహ్మదాబాద్ లోని బాగోదరలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... విపుల్ వాఘేలా (32) ఆటో రిక్షా నడుపు తున్నాడు. అతను తీవ్ర అప్పుల బాధలో ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అతను తన కుటుంబసభ్యులకు విషం ఇచ్చి... తాను ఆత్మహత్య చేసుకున్నాడని వారు అను మానిస్తున్నారు. బంధువులిచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలం నుంచి విపుల్ వాఘేలా, అతని భార్య సోనాల్ వాఘేలా (26), పిల్లలు కరీనా (11), మయూర్ (8), ప్రిన్సీ (5)లను మృతదేహాలను శవపరీక్ష కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలు వారి ఇంట్లో రెండు మంచాలపై కనిపించాయని, ఈ విషాద సంఘటనకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సామూహిక ఆత్మహత్యకు ఉపయోగించిన విషం ఏంటనేది ఫోరెన్సిక్ పరీక్షల్లో వెల్లడవుతుందని ఓ అధికారి తెలిపారు.

రాష్ట్ర హోదా మా హక్కు

- కేంద్రం వద్ద శాంతిభద్రతల అంశం సరికాదు
- ద్వంద్వ అధికార నిర్మాణ నమూనా పని చేయదు
- కేంద్రం పాలనలోనే ఉగ్రవాద వ్యాప్తి
- జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా మరింత ఆలస్యం చేయకుండా పునరుద్ధరిం చాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆదివారం గట్టిగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో పాలక నేషనల్ కాన్ఫరెన్స్ చట్టపరమైన ఎంపికలతో సహా అన్ని మార్గాలను అన్వేషిస్తోందన్నారు. కేంద్ర పాలిత ప్రాంతంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధికారంలోకి వచ్చిన దాదాపు పది నెలల తర్వాత రాష్ట్ర హోదా ప్రజల ప్రాథమిక హక్కు అని అబ్దుల్లా నొక్కి చెప్పారు. 'కేంద్రం పార్లమెంటులో, సుప్రీం కోర్టు ముందు దీనికి హామీ ఇచ్చింది' అని ఆయన అన్నారు. రాష్ట్ర హోదా పునరుద్ధరించబడిన తర్వాత శాంతి భద్రతలు కేంద్రం వద్ద కొనసాగే ప్రభుత్వ 'హైబ్రిడ్ వ్యవస్థ' గురించిన చర్చను తోసి పుచ్చారు. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడంపై సందేహాలు వ్యక్తం చేసిన వారి నుంచి అలాంటి చర్చ వస్తోందని, ఇందులో 64 శాతం కంటే ఎక్కువ మంది ఓటర్లు పాల్గొన్నారని అన్నారు. 'స్పష్టంగా ఇది ఆదర్శవంతమైన పరిస్థితి కాదు. తరచూ వాగ్దానాలు, పార్లమెంటులో ప్రకటనలు, సుప్రీం కోర్టుకు ఇచ్చిన హామీలు ఉన్నప్పటికీ ఈ విషయం ఇంకా పరిష్కారం కాలేదు. మాకు చెందనది మేము అడగడం లేదు. రాష్ట్ర హోదా హక్కు. అది ప్రజలకు వాగ్దానం చేయబడింది. అందువల్ల మేము కోరడం లేదు. ఇది సాధారణం కానిది లేదా ప్రజా చర్చలో భాగం కానిది కాదు. కానీ కేంద్ర ప్రభుత్వంలో ఉన్న అధికార వర్గాలకు బాగా తెలిసిన కారణాల వల్ల అది ఇప్పటి వరకు జరగలేదు. కానీ మేము ఒత్తిడి చేస్తున్నాము' అని అబ్దుల్లా పీటీఐకి ఇచ్చిన

ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీతో 'స్నేహపూర్వక' సంబంధాన్ని కొనసాగిస్తున్న అబ్దుల్లా... ఈ విషయంపై వారి ప్రైవేట్ చర్చల ప్రత్యేకతలను వెల్లడించ కుండా... రాష్ట్ర హోదా అంశం 'బహుళ స్థాయిలలో అనేక సార్లు' లేవనెత్తబడిందని మాత్రమే ధ్రువీకరించారు. 'నాకు, ప్రధాన మంత్రికి, హోం మంత్రికి, మొదలైన వారికి మధ్య వ్యక్తిగతంగా జరిగిన సంభాషణలు పంచుకోవడానికి ఉద్దేశించిన సంభాషణలు కావు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన రాష్ట్ర హోదా అంశం, ఇతర సమస్యలు అనేక స్థాయిలలో అనేకసార్లు చర్చకు వచ్చాయి. మేము కూడా అలాగే కొనసాగిస్తున్నాము' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబం ధాలు ఏర్పరచుకోవడంలో తన ఆచరణాత్మక విధానాన్ని ఆయన సమర్థించుకున్నారు. సహకారం పట్ల ప్రజల ప్రశంసలు, అవసరమైనప్పుడు తనను మాట్లాడకుండా నిరోధించవని నొక్కి చెప్పారు. బీజేపీ విధానాలకు సంబంధించి నేషనల్ కాన్ఫరెన్స్ కలిగి ఉన్న దాని పరంగా అవి అలాగే ఉన్నాయి లేదా దీనికి విరుద్ధంగా ఉన్నాయి. కానీ ప్రభుత్వం-ప్రభుత్వ సంబంధాలు కూడా ఉన్నాయని అన్నారు. గత రాజకీయ పరిణామాలలో... ముఫ్తీ మొహమ్మద్ సయీద్, మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) బీజేపీతో పొత్తును అబ్దుల్లా విభేదించారు. 'ముఫ్తీ సయీద్ బీజేపీతో పెట్టుకోవాల్సిన అవసరం ఏమిటి?. ప్రధాన మంత్రి, అతని వ్యక్తిత్వం గురించి మెహబూబా ఏమి చెప్పేవారు. వారు దానిని మర్చిపోయారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అబ్దుల్లా తన సొంత వైఖరిని స్పష్టం చేస్తూ... 'ఘర్షణ అవసరమైనప్పుడు ఘర్షణ జరుగుతుంది. ఇప్పటి వరకు భారత ప్రభుత్వం సహాయకారిగా ఉంటే నేను కనీసం బహిరంగంగా దానిని అభినందిస్తున్నాను కదా? కానీ పరిస్థితులు బాగా లేని చోట లేదా విషయాలు తప్పుగా ఉన్న చోట నేను దానిపై మౌనంగా లేను' అని తెలిపారు. రాష్ట్ర హోదా కోసం మీ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించాలని యోచిస్తోందా అనే ప్రశ్నకు ముఖ్యమంత్రి స్పందిస్తూ... 'మేము వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నాము. మనం ఏమి చేయాలో చూడటానికి పార్టీ లోపల, కొంతమంది నిపుణులతో కొన్ని సంభాషణలు జరిగాయి' అని అన్నారు. రాష్ట్ర హోదా పునరుద్ధరించబడిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం వద్ద శాంతిభద్రతలు ఉండే 'హైబ్రిడ్ వ్యవస్థ' అంశాన్ని ముఖ్యమంత్రి తోసిపుచ్చుతూ... 'ఈ దేశంలో అలాంటి నమూనా లేదు. ఎన్నికలు జరగవని లేదా ఎన్నికలు జరగకూడదని భావిస్తున్న వ్యక్తులే దీనిని నాటుతున్నారు. అయినప్పటికీ వారు పహల్గాం వైఫల్యాల గురించి లేదా ఉగ్రవాద వ్యాప్తి గురించి మౌనంగా ఉన్నారు' అని చెప్పారు. జనవరి 2015లో తాను పదవీ విరమణ చేసినప్పటి నుంచి జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద మౌలిక సదుపాయాల 'నాటకీయ వ్యాప్తి' ని వివరించాలని, అటువంటి వ్యవస్థను ప్రతిపాదించే వారిని ఆయన సవాలు చేశారు. జమ్మూకశ్మీర్ ఎన్నికయిన ప్రభుత్వం కాకుండా కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్నప్పుడు ఈ ఉగ్రవాద విస్తరణ జరిగిందని సీఎం అబ్దుల్లా వాదించారు. ఎన్నికయిన ప్రభుత్వం భద్రతా పరిస్థితిని నిర్వహించడంలో అసమర్థమనే భావనను తోసిపుచ్చుతూ... 'గతంలో సంపూర్ణంగా నిర్వహించాము. భవిష్యత్‌లో కూడా మేము బాగా నిర్వహిస్తాము. ఈ హైబ్రిడ్ వ్యవస్థ ఆమోదయోగ్యం కాదు' అని స్పష్టం చేశారు. అటువంటి వ్యవస్థ 'ఆదర్శవంతమైనది' అయితే, కొన్ని చిన్న ప్రాంతాలకు మాత్రమే ఎందుకు పరిమితం చేయబడిందని ప్రశ్నించారు. 'ఇది ఉత్తమ పాలన అయితే... దయచేసి ఉత్తర ప్రదేశ్‌లో చేయండి. మహారాష్ట్రలో చేయండి. ఛత్తీస్‌గఢ్‌లో చేయండి. మధ్య ప్రదేశ్‌లో చేయండి. అన్ని ఈశాన్య రాష్ట్రాలలో చేయండి' అని ఆయన సవాలు విసిరారు. జమ్మూకశ్మీర్‌లో ఈ పాలనా నమూనా పని చేయదన్నారు. ప్రస్తుత ద్వంద్వ అధికార నిర్మాణాన్ని ఆయన మరింత విమర్శించారు. దీనిని 'ప్రభుత్వానికి ఆదర్శవంతమైన రూపం కాదు' అని అభివర్ణించారు. కానీ ఈ కార్యాచరణ సవాళ్లు, ఇతర అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న సంభాషణలకు త్వరిత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా

కేసీ వేణుగోపాల్ డిమాండ్

న్యూఢిల్లీ: జులై 21 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం డిమాండ్ చేస్తామని కాంగ్రెస్ ఆదివారం తెలిపింది. 'జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా మంజూరు చేయడం గురించి ప్రధాని మోదీ పార్లమెంటులో అబద్ధం చెప్పారా? లేకపోతే, జమ్మూకశ్మీర్ పోలీసులు జేకేపీసీసీ అధ్యక్షుడు తారిక్ హమీద్ కర్రా జీని, ఇతర కాంగ్రెస్ నాయకులను ఎందుకు అరెస్టు చేశారు?' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగతం) కేసీ వేణుగోపాల్ 'ఎక్స్' పోస్ట్‌లో ప్రశ్నించారు. 'వారు నిన్న శ్రీనగర్‌లోని పీసీసీ కార్యాలయాన్ని ఎందుకు సీలు చేశారు. రాష్ట్ర హోదా కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మా పార్టీ కార్యకర్తలను ఎందుకు ఆపారు?. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో జమ్మూకశ్మీర్‌లో పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ఇండియా ఐక్య సంఘటన డిమాండ్ చేస్తోంది. ఈ ప్రహసనం ఇక కొనసాగకూడదు' అని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశాన్ని లేవనెత్తుతామని కాంగ్రెస్ స్పష్టం చేసింది.

కాంగ్రెస్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

జమ్మూకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) తారిఖ్ హమీద్ కర్రా నేతృత్వంలో ఆదివారం ఇక్కడ రాష్ట్ర హోదా డిమాండ్‌తో ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు.

అయితే పోలీసులు అనుమతి నిరాకరిస్తూ తారిక్‌తో పాటు అనేక మంది కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. 'హమారీ రియాసత్ హమారా హక్' బ్యానర్ కింద జరిగిన కాంగ్రెస్ ర్యాలీని నిర్వహించడానికి పోలీసులు అనుమతించకపోవడం ఇది రెండవసారి. శనివారం శ్రీనగర్‌లో కాంగ్రెస్ ర్యాలీని పోలీసులు ఆపారు. కర్రా, పార్టీ ప్రధాన కార్యదర్శి జి.ఎ.మీర్ నేతృత్వంలో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు జమ్మూ నడిబొడ్డున ఉన్న షాహీదీ చౌక్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు వినతి పత్రం సమర్పించడానికి వారు రాజ్ భవన్‌కు వెళ్లాల్సి ఉంది. కానీ పోలీసు బారికేడ్లు వారిని అడ్డుకున్నాయి. అదుపులోకి తీసుకున్న వారిలో మీర్ కూడా ఉన్నారు. తాము అశాంతిని వ్యాప్తి చేయడానికి రోడ్లపై లేమని, కానీ రాష్ట్ర హోదా కోసం ప్రజల ఆకాంక్షను సమర్థిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఒక వినతి సమర్పించాలని ప్రణాళిక వేసుకున్నామని కర్రా తెలిపారు. శ్రీనగర్, జమ్మూలో పోలీసు చర్య ఉన్నప్పటికీ, వర్షాకాల సమావేశాల మొదటి రోజున సోమవారం పార్లమెం టుకు 'ఢిల్లీ చల్లో' కార్యక్రమాన్ని పార్టీ కొనసాగిస్తుందని ఆయన అన్నారు. 'ఢిల్లీకి చేరుకున్న తర్వాత మేము పార్లమెంటును చుట్టుముట్టడానికి ప్రయత్నిస్తాము. వీలైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌ను రాష్ట్రంగా మార్చగలిగేలా ఈ చెవిటి, అంధ, వికలాంగ ప్రభు త్వాన్ని మేల్కొల్పడానికి ప్రయత్నిస్తాము' అని పీసీసీ అధ్యక్షుడు తెలిపారు. రాష్ట్ర హోదా డిమాండ్‌కు మొత్తం ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు మద్దతు ఇస్తున్నారని ఆయన అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దుష్టశక్తులు తెలంగాణలోకి వచ్చేందుకు ప్రయత్నం

ఎమ్మెల్సీ విజయశాంతి సంచలన వ్యాఖ్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బోరబండ పోచమ్మ బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి పాల్గొని అమ్మవారికి బోనాలను విజయశాంతి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు విజయశాంతిని ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పోరాటాలు చేసి తీసుకువచ్చిన ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ అని అభివర్ణించారు. కొన్ని దుష్టశక్తులు తెలంగాణ లోపలికి రావడానికి ప్రయత్నిస్తున్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అనేది అక్షయపాత్ర అని ఉద్ఘాటించారు. తెలంగాణని దోచుకోడానికి మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆక్షేపించారు. ప్రతి ఒక్కరూ ధర్మం వైపు నడవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని.. దుష్ట శక్తులు మాట్లాడేవి పట్టించుకోవద్దని చెప్పుకొచ్చారు. ప్రజల గుండెల్లో తెలంగాణ ఉందని నొక్కిచెప్పారు. ఎవరిని రాష్ట్రంలోకి రానివద్దని ఎమ్మెల్సీ విజయశాంతి కోరారు.

మల్కాజిగిరిలో ఘనంగా బోనాల ఉత్సవాలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరిలో బోనాల పండుగను భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో నిలబడి బోనాలు సమర్పించేందుకు ఆలయాలను తరలివచ్చారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయం వద్ద భక్తుల రద్దీ భారీగా కనిపించింది. కట్ట మైసమ్మ దేవాలయం, మూడు గుళ్ళ దేవాలయాల లోనూ భక్తులు పోటెత్తారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆలయాల పరిసరాలు భక్తి పాటలతో మార్మోగుతున్నాయి. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు కార్పొరేటర్ సునీత రాము యాదవ్, టీఆర్ఎస్ నాయకులు జగదీష్ గౌడ్ తదితరులు బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి : కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బోనాల పండుగ సందర్భంగా ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి బోనం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారు అందరి పట్ల కరుణ చూపి ప్రజలను సుఖ సంతోషాలతో ఉంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులు బాబు సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, నాగేష్, శంకర్‌రావు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ బలో పేతానికి కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని కుత్బుద్దీన్ గూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు యాదయ్య, షరీఫ్, హాఫిజ్, ఈశ్వర్, మహమ్మద్ మహిమూద్, ఖలీమ్, పీటర్, సికిందర్, అలీం, మరో 15 మంది ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరేలా కాంగ్రెస్ నాయకులు కీలకపాత్ర పోషించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభంగా పోచమ్మ బోనాలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గోపన్‌పల్లి గ్రామంలోని దేవుని గుట్టపై ఉన్న శ్రీ పోచమ్మ ఆలయ బోనాలు రంగ రంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయమే అమ్మవారికి దేవాలయ కమిటీ అధ్వర్యంలో అభిషేకం నిర్వహించి, అమ్మవారిని అలంకరించడం జరిగింది. ప్రసాద వితరణ తరువాత, ఉయల ఘట ఊరేగింపు నిర్వహించటం జరిగింది. ఇట్టి బోనాల ఉత్సవాలలో స్థానిక భక్తులు, గ్రామ ప్రజలతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షులు రవీంద్ర ప్రసాద్ దూబే, కోశాధికారి కే. నరసింహ, ప్రధాన కార్యదర్శి ఇ.అనిల్, సభ్యులు రాజేందర్, పోచయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పరిధిలో ఘనంగా బోనాల పండుగ

ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అమ్మవారిని దర్శించిన నగర మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచేది బోనాల పండుగ ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వైభవోపేతంగా జరిగింది. ఆదివారం హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ మేయర్ గద్వాల విజయలక్ష్మి హరిబౌలిలోని అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో అమ్మవారిని, మీర్ ఆలంమండిలోని మహంకాళేశ్వరాలయం అమ్మవారిని, బోరబండ మహంకాళి అమ్మ వారిని, యూసుఫ్ గూడలో అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

త్వరలో వికలాంగుల చెంతకు వీరయ్య ప్రోగ్రామ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలు (హన్మకొండ, ములుగు, వరంగల్, జయశంకర్ భూపాల పల్లి, జనగాం, మహబూబ్‌బాద్) కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం అనుబంధ వికలాంగుల సంఘాల జిల్లాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు సమావేశంలో ముఖ్య అతిథిగా వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే వికలాంగుల చెంతకు వీరయ్య అనే ప్రోగ్రామ్‌నీ తీసుకుంటున్నాను అని వారంలో 4 రోజులు జిల్లాలలో, మండలాలలో, గ్రామాలలో వికలాంగులనీ కలుస్తాను అని వారీ సమస్యలు పరిష్కారించడమే ఏకైక లక్ష్యంగా ఈ ప్రోగ్రామ్ ఉంటుంది అని తెలియజేశారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా వికలాంగుల కుటుంబాలను కలుస్తాను అని ఆ నాలుగు రోజులు గ్రామాల్లో వికలాంగుల ఇండ్లలోనే నిద్రిస్తాను అని, వికలాంగుల సమస్యలు ను ఆయా అధికారులు దృష్టికి, స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానని తెలియ జేశారు. రాబోయే మూడున్నర సంవత్సరాలు వికలాంగుల సంక్షేమ అభివృద్ధి సంవత్సరా లుగా చరిత్రలో లిఖించ బడతాయి అని, ఇప్పటికే విద్యలో, ఉద్యోగాలులో రిజర్వేషన్‌లు ఇచ్చాం అని, వికలాంగుల సమగ్రాభివృద్ధి కోరకు వ్యక్తిగత రుణాలు ఇస్తున్నామని, నిరుద్యోగ వికలాంగుల కోరకు రాజీవ్ యువ వికాసంలో 5శాతం రిజర్వేషన్ నీ, ఇందిరమ్మ ఇండ్లలో 5శాతం రిజర్వేషన్ నీ ఇచ్చామని, వికలాంగుల కుటుంబాల ఆర్థిక స్థిరత్వమే లక్ష్యంగా గ్రామానికో వికలాంగుల సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ చేయబోతున్నాం అని చెప్పారు. ఇలా అనేక సంక్షేమ పథకాలు వికలాంగుల కోసం చేస్తున్నాము అని ఇవన్నీ అమలు చేస్తూనే గ్రామ గ్రామాన వీటినీ సమర్ధవంతంగా అమలు చేయడం కోరకు, చివరి లబ్ధిదారుడి వరకు వికలాంగుల సంక్షేమం అందించడం కొరకు మండలం /మునిసిపాలిటీకి 10మంది వికలాంగులను మండల /మునిసిపాలిటీ కో ఆర్డినేటర్‌లుగా వికలాంగులను దాదాపు 8000 వేల మందిని కో ఆర్డినేటర్‌లుగా కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం తరుపున నియమిస్తాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగోతు వీరన్న నాయక్, బోట్ల సురేష్, అజీమ్, ప్రశాంత్, పూజారి మాణిక్యము, చక్రపాణి, శంకర్ నాయక్, మేకల సమ్మయ్య, బోట్ల సుమతీ, సతీష్, యాకుబ్, అసద్, బత్తిని రాజు, ఐలేష్‌తో పాటు 30 మంది ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదిగినప్పుడే సమాజ అభివృద్ధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్ రూరల్ : యువత స్వశక్తి తో ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించి ఆర్థికంగా ఎదగాలని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణం పరిగి రోడ్‌లో ఉన్న సికెందర్‌కు చెందిన సోషల్ ఫుడ్ కోర్ట్ హెూటల్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కస్టమర్‌లకు నాణ్యమైన, రుచికరమైన, శ్రేష్ఠమైన ఆహార పదార్థాలను అందించాలని కల్తీ లేని పదార్థాలను వాడకుండా మంచి పదార్థాలను వాడాలని సోషల్ ఫుడ్ కోర్ట్ యాజమాన్యానికి సూచనలు చేశారు. ఆర్థికంగా ఎదుగుతూ ఇంకా ఇలాంటి ఫుడ్‌కోర్ట్‌లు ఇంకా ఎన్నో పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా హెూటల్ యాజమాన్యం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పూలబొకే, శాలువాతో సన్మానం చేశారు. ఈ ప్రారంభోత్సవంలో యాజమాన్యం సికెందర్, సోహైల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ముబారక్ అలీఖాన్, ఖదీర్, మహబూబ్, హైదర్ గోరి, జహంగీర్, మన్సూర్, జుబైర్, అబ్దుల్ హాఫిజ్, హమీద్, వసీమ్, అబేద్ బిన్ అలీ, అసిఫ్ బిన్ అలీ, నాదీం, సిరాజుద్దీన్, సమీయొద్దీన్, సోహైల్ హుస్సేన్, మొహమ్మద్ అసిఫ్ గోరి తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మల్కాజ్గిరి నియోజకవర్గ ఇంచార్జి మైనంపల్లి హనుమంత్‌రావుపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు, కార్పొరేషన్, మున్సిపాలిటీ అధ్యక్షులు కలిసి విలేకరుల సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల వల్ల ఓర్వలేక ఆరోపణలు చేస్తున్న బిఆర్ఎస్ నాయకులకు త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు తొందర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే వివేకానంద, ఎం.ఎల్.సి శంబీపూర్ రాజు మైనంపల్లి హనుమంత్‌రావుని అయన మోచేతి నీళ్లు తగిన మీరు ఆయనని అనేంత స్థాయి మీకు లేదు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, వ్యక్తిగతంగా చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేసి కోట్ల రూపాయలు దండుకుని నేడు ధనబలంతో ఊగిపోతూ కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సమాధానం కూడా అదే రీతిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సమాధానం చెప్తారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రావణ్ కుమార్ ముదిరాజ్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డా.అవిజె జేమ్స్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, అధ్యక్షులు, బేకు శ్రీనివాస్, సోమన్న శ్రీధర్ రెడ్డి, ఎండి జాకీర్, శివ, సంతోష్ కుమార్ ముదిరాజ్, ఎండి లాయక్ పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం పుట్టినదే ఎర్రజెండా

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : అసమానతలు లేని సమాజం కోసం పుట్టినదే ఎర్రజెండా అని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ రెండో మహాసభ సాగర్ రోడ్డు లోని అరుణ కన్వెన్షనల్‌లో కాటంరాజు గౌడ్ అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అసమానతలు రోజు రోజుకు తీవ్రమవుతు న్నాయని, ఆర్థిక అసమానతలతో సామాజిక అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. 1925లో ఏర్పడ్డ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణలో నిజాం నవాబుకి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా పది లక్షల ఎకరాలను భూమిలేని పేదలకు పంచిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి (కాంగ్రెస్ పార్టీ) ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదని అన్నారు. దేశంలో బిజెపి పార్టీ మత విద్వేషాలతో ప్రజల మధ్యన చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ప్రజల ఐక్యతను దెబ్బతీసి మోడీ ప్రభుత్వం అధికారాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నం చేస్తుందని అన్నారు. సిపిఐ స్టేట్ కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ అమెరికా లో ట్రంప్ గెలిచిన తర్వాత ప్రపంచ దేశాల మధ్యన చిచ్చు పెడుతున్నారని అన్నారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్నారని, అధిక పన్నుల పేరుతో ప్రపంచ దేశాలను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు అని అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పైన ఎర్ర జెండా నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఓరు గంటి యాదయ్య, పానుగంటి పర్వతాలు, కావలి నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు నీలమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పాలకూర శివ కుమార్ గౌడ్, అనురాధ, విజయ, శివప్రసాద్, బాలయ్య, మూలుగు నరసింహ, రాజు నాయక్, బొబ్బూరి కృష్ణయ్య, శివ ప్రసాద్ నాగేశ్వర్, దేవా నాయక్, శ్రీనివాస్ గౌడ్, శివ, భాస్కర్, సుందరమ్మ నీల తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక : తూరకాయంజాల్ మున్సిపాలిటీ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా అనంతుల కాటంరాజు గౌడ్, కార్యవర్గ సభ్యులుగా పి శివకుమార్ గౌడ్, ఈదులకంటి అనురాధ, వట్టి విజయ, శ్రీకాంత్, నాగేశ్వర్, కృష్ణయ్య, శివ, శివ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ అధ్యక్షుడు

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాతబస్తీ లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్న వేళ, ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలోనూ ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన మహేష్ గౌడ్‌కు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ దర్శనం కోసం విశేష ఏర్పాట్లు చేశారు. బోనాల ఉత్సవాల్లో ఆకట్టుకున్న పోతారాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, బ్యాండ్ మేళాలు, యువకుల కేరింతలు, పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

రెడ్డి కార్పొరేషన్ కార్యవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రాజా బహదూర్ రెడ్డి కన్వెన్షన్ సెంటర్ నందు నిర్వహించిన కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఈ కార్యక్రమానికి హాజరైనారు. ఈ సందర్భంగా తూము ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో ప్రకటించిన విధంగా పేద రెడ్ల అభ్యున్నతి కొరకు రెడ్డి కార్పొరేషన్ కు చట్టబద్ధత కల్పించి, కార్యవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని అలాగే రెండు వేల కోట్ల రూపాయలలతో నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అన్ని విద్య ఉద్యోగ నియామకాల్లో ఈడబ్ల్యూఎస్ పథకాన్ని సంపూర్ణంగా అమలుపరచాలని కోరారు. తమ సంస్థ ద్వారా చదువులో ముందంజలో ఉన్న పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని అలాగే వివిధ ప్రమాదాల్లో గాయపడిన పేద రెడ్లకు వైద్య సహాయం కొరకు ఆర్థిక సహాయాన్ని కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహారెడ్డి, సహాధ్యక్షులు పసుల ధనంజయరెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎస్.సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దొడ్ల నారాయణరెడ్డి, నారాయణపేట అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రాంరెడ్డి, వెంకటరెడ్డి, కొడంగల్ నియోజకవర్గం అధ్యక్షులు దశరథ రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వనపర్తి మేగారెడ్డి, జయపాల్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, పట్టణ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు మల్లు సరస్వతి స్వరూప పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి.. పేదలకు పెన్నిధి

విశాలాంధ్ర - మొయినాబాద్: సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన మంగళి యాదయ్య అనారోగ్యం కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైనా రూ.2 లక్షల 50 వేలను చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ మర్రి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

బోనాల జాతరలో రవికుమార్ యాదవ్

విశాలాంధ్ర -శేరిలింగంపల్లి: ఆషాడ బోనాల పండుగ జాతర మహెూత్సవంలో భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ మక్త మహబూబ్పేట్ దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మాచర్ల

O.S. NO : 169/2023

బిట్వీన్

వీర్ల చిన ముత్తయ్య, తండ్రి చిన జానయ్య, R/O. ఓల్డ్ టౌన్, 21వ వార్డు, మాచర్ల టౌన్, మాచర్ల మండలం. - వాది

మరియు

జటావత్ లీమా నాయక్, తండ్రి కస్నా నాయక్, వ్యవసాయం మరియు కమిషన్ వ్యాపారం, R/o, నాగార్జునపేట గ్రామము, H/O. చింతలపాలెం, తిరుమలగిరి మండలము, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. - ప్రతివాది

పై నెంబరు దావాలోని ప్రతివాదికి శ్రీ కోర్టు వారు ఎన్నిమార్లు సమన్లు పంపిననూ మీరు ఉద్దేశ పూర్వకంగా సమన్లు తీసుకోకుండా, కాలయాపనే చేయుచున్నారు. కావున ఈ పేపరు ప్రకటనను సమన్లుగా భావించి శ్రీ కోర్టు వారి ఎదుట ది.25-08-2025న హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ కోర్టు వారికి తెలియజేయగలరు. మీరు హాజరుకానిచో మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు. వాయిదా ది.25-08-2025.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

పేర్ల వెంకటేశ్వర్లు, న్యాయవాది.
మాచర్ల - 522426. సెల్ నెం. 9440612707

ఘనంగా సబ్జిమండి వార్షిక బోనాల మహోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్: కార్వాన్ నియోజకవర్గంలోని అతి ప్రాచీన మందిరాలైన నల్ల పోచమ్మ, మహంకాళి దేవి అమ్మ వార్లకు భక్తి భావంతో బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడి 14 బస్తీల వాసులు ఒక కమిటీగా ఏర్పడి ప్రతి సంవత్సరం ఆషాడ మాసం చివరి ఆదివారం అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించడం ఒక ఆనవాయితీగా పాటిస్తున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని సబ్జిమండిలోని నల్ల పోచమ్మ మహంకాళి దేవి మందిరం ఉమ్మడి ఆలయాల ఆధ్వర్యంలో 103 వ వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు దొర్పుల శ్రీనివాస్ తెలిపారు. సభ్యులు మహంకాళి ఆలయం నుండి మహిళలు సామూహికంగా బయలుదేరి నటరాజ్ నగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో బోనాలను సమర్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాన్ని అతి సుందరంగా అలంకరణ చేసి జానపద కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాల సందడి నడుమ వేషధారణ నడుమ మహిళలు, చిన్నారులు, యువకులు ఎంతో ఉత్సాహంగా వెంట రాగా ఊరేగింపును ఎంతో కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్, కోశాదికారి దేశబోయిన గోపాల్, కమిటీ సలహాదారులు కట్ట రాజయ్య, గూడబోయిన శివరత్నం, జలగరి వేణు, కట్ట శివరాజ్, బుర్ర వేణు కుమార్, కట్ట నర్సింగరావు, ఆవుశెట్టి శ్యాంసుందర్, గుడుమని అశోక్ కుమార్, గాండ్ల నిరంజన్ బాబు, ప్యాట నందకిషోర్ పూజ కమిటీ సభ్యులు, భక్త మహాజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగం పల్లి: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా ప్రజలందరికి బోనాల పర్వదిన శుభాకాంక్షలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ చిత్తారమ్మ దేవాలయంలో జరిగిన బోనాల ఉత్సవాలలో గాంధీ ఆయన సతీమణి శ్యామలదేవి, కుమారుడు పృథ్వి గాంధీ, కోడలు భార్గవి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా ప్రజలందరికి బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలియచేస్తు న్నాను అని, అమ్మ వారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకుంటున్నాను అని, పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని వాడవాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గంలోని ప్రతి గుడికి బోనాల నిధులు మంజూరయేలా కృషి చేశానని తెలిపారు. బోనాల సందర్భంగా ప్రతి గుడి వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ అన్ని రకాల వసతులు కలిపిస్తూ ప్రశాంత వాతావరణం కలిపించామని, బోనాలు ఎంతో అంగరంగ వైభవంగా జరిగేల అన్ని ఏర్పాట్లను చేశామని, బోనాల పండుగ మంచి ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అప్రైజర్ల యూనియన్ ఏర్పాటుతో సమస్యల పరిష్కారానికి తొలిఅడుగు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బ్యాంకులలో పనిచేస్తున్న అప్రైజర్స్‌కు ఉద్యోగ భద్రత, మెరుగైన అప్రెయిజర్ చార్జీల చెల్లింపు, తగిన గౌరవం, పని గంటల విధానం కోసం ఎ ఐ బి ఇ ఎ తన వంతు కృషి చేస్తుందని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎ ఐ బి ఇ ఎ) కార్యదర్శి, తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రెయిజర్ ఫెడరేషన్ (టి ఎ బి జి ఎ ఎఫ్) అధ్యక్షులు బి.ఎస్.రాంబాబు చెప్పారు. ట్రేడ్ యూనియన్ నిర్మాణం సందర్భంగా ఉద్యోగులు, కార్మికులకు యాజమాన్యాలు, పాలకుల నుంచి కష్టనష్టాలు, విమర్శలు తప్పవని, వాటన్నింటినీ తట్టుకుని అప్రైజర్లు మనోధైర్యంతో యూనియన్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా వారి సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటంలో తొలి అడుగు పడిందన్నారు. తెలంగాణ యూనియన్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ మొదటి విస్తృతస్థాయి సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని పర్వానా హాల్‌లో జరిగింది. సమావేశానికి తెలంగాణ ఆల్ బ్యాంక్స్ గోల్డ్ అప్రైజర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.రాఘవాచారి అధ్యక్షత వహించగా, సమావేశాన్ని ఉద్దేశించి బిఎస్ రాంబాబు, ఎ పి టి బి ఇ ఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, యు బి ఏ ఈ యు టి ఎస్ ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వి.రాఘవాచారి, విశ్వకర్మ ఆత్మగౌరవ భావన ట్రస్ట్ చైర్మన్ ఎల్.వెంకటాచారి, హైకోర్టు న్యాయవాదులు రఘునాథ్, పి.శ్రీనివాస్, కె అనంత చారి ప్రసంగించారు. తొలుత బి.ఎస్.రాంబాబు ప్రసంగిస్తూ దేశంలో, రాష్ట్రంలో పాలకులు అనుసరించే ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాల ఆధారంగానే బ్యాంకులో ఆర్థిక సంస్థలు పనిచేస్తాయని అందులో భాగంగానే ఉద్యోగులకు అనేక సవాళ్లు, సమస్యలు ఎదురవుతాయ న్నారు. అప్రైజర్స్ యూనియన్ సభ్యులంతా తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం బ్యాంకింగ్ రంగం చట్టాలు, పని విధానాలపై పూర్తి అవగాహన పెంచుకుని ఐక్యంగా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను సమర్థవంతంగా ముందుకు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో రూ.400 లక్షల కోట్ల సంపదను సృష్టిస్తున్న కార్మికులకు ఆ సంపదలో భాగం ఉండడంలేదని, దాని వల్ల వారికి ప్రయోజనాలు కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, కార్మికులు మరింత ఐక్యంగా ఉధృతమైన పోరాటాలతో యాజమాన్యాలు, పాలకుల మెడలు వంచి తమ హక్కుల, ప్రయోజనాలను పరిరక్షించుకోవాలన్నారు. టి రవీంద్రనాథ్ మాట్లాడుతూ గోల్డ్ అప్రైజర్స్ తమ సమస్యల పరిష్కారం కోసం తొలుత వారి పని పరిస్థితులు, అందుకు ఉన్న చట్టాలు, పని విధానం తదితర అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. టిఏబిజిఏఎఫ్ ముఖ్య సలహాదారులు టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.విజయ్ కుమార్, కోశాధికారి ఆర్.సతీష్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.అనంత రాములు, కార్యవర్గ సభ్యులు, పి.శ్రీకాంత్, జి.నాగరాజు, యుబిఏఈయుటిఎస్ కార్యదర్శులు కె.రాజేష్ కుమార్, పి.సుధాకర్ రెడ్డి, పి.శ్రీకాంత్, వి.రాజేష్ మనోజ్ సింగ్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ ఉత్సవాలు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఆషాడమాసం బోనాల పండుగను పురస్కరించుకొని ఆదివారం నియోజకవర్గంలోని ఐడిఏ బొల్లారం, ఇస్నాపూర్, బిహెచ్ఇఎల్, తెల్లాపూర్, అశోక్ నగర్, తదితర ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలలో గల అమ్మ వారి దేవాలయాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మ వారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున అన్ని దేవాలయాల వద్ద బోనాల పండగ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలంధ్ర - మేడిపల్లి: గ్రామ దేవతల విశిష్టత, స్త్రీ శక్తికి ప్రతిరూపంగా నిలిచే బోనాల ద్వారా అమ్మవార్లను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని, తెలంగాణ ఆషాడ బోనాల పండుగ సందర్భంగా ఆదివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి బోనాల పూజల్లో ముఖ్య అతిథిగా తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మియాపూర్ డివిజన్ గౌరవ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కోరుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాడ మాస బోనాల పర్వదినంను పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్త మహబూబ్ పేట్ విలేజ్, ముజాఫర్ హైహ్మద్ నగర్, నడిగడ్డ తాండ, టిఎన్ నగర్ కాలనీలలో గల అమ్మవార్ల దేవాలయలలో స్థానిక నాయకులు కాలనీలుతో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాడ మాస బోనాల పర్వదినం సందర్భంగా ప్రజలందరికి బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, అమ్మ వారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకుంటున్నాను అని, కార్పొరేటర్ శ్రీకాంత్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కాలనీల వాసులు భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మొయినాబాద్: పోచమ్మ తల్లీ.. చల్లంగ చూడమ్మా అంటూ ఆదివారం మహిళలు చలి బోనాలు వేశారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పోచమ్మ ఆలయాల్లో మహిళలు చలి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఉదయమే ఒక బుట్టలో బోనాలను ఉంచి పోచమ్మ ఆలయాలకు చేరుకొని సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్ ముషీరాబాద్ నియోజకవర్గం, నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని అమ్మవారిని కోరారు. అలాగే అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ఒకేవిధంగా ఆధార అభిమానం కనపరిచిన ఆలయ కమిటీ నిర్వాకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

విశాలాంధ్ర - కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధి స్టేషన్ తిమ్మాపూర్‌లో ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్ ఆధ్వర్యంలో మైసమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా ఈ బోనాల జాతరను నిర్వహించకున్నారు. మహిళలు బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. డప్పుల దరువుల్లో యువకులు చిందులు వేస్తూ సంబరాలు జరుపుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు మున్సిపాలిటీ ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు పలువురి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, నాయకులు బి దేవేందర్ యాదవ్, గాలిగూడెం మహేందర్, రాజేందర్ గౌడ్, అమడాపురం నర్సింలు గౌడ్, పాశం కృష్ణ, గోపాల్ గౌడ్, సురేష్, శ్రీను, శేఖర్, జగన్, భేరి శ్రీనివాస్, గణేష్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: మున్సిపాలిటీ 6వ వార్డు సాయి బాబా కాలనీలో బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... బోనాల పండుగ మాకు ఒక ఆధ్యాత్మిక ఉత్సవమే కాదు. ఇది మన ఐక్యత, మన గొప్ప సంస్కృతి, మన విలువలకు నిదర్శనం. తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని, అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ విజయ్ కుమార్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, మురళీమోహన్ కాలనీ వాసులు అమర్నాథ్ రెడ్డి, వెంకన్న బాబు, మంగ శంకర్, శ్రీను, శ్రీశైలం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - షాద్ నగర్ రూరల్: అమ్మ వారి అనుగ్రహం అందరిపై ఉండాలని ప్రజలందరు అమ్మవారి ఆశీస్సులతో సుఖశాంతులతో ఉండేలా దీవించమ్మ అని వేడుకున్నారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని 6వ వార్డ్‌లో జరుగుతున్న పోచమ్మ బోనాలలో బాగంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలలో ఎమ్మెల్సి నాగర కుంట నవీన్ రెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ లత శ్రీశైలం గౌడ్, విజయ్ కుమార్ రెడ్డి, మంగ శంకర్, భాను శర్మ, శ్రీను, శ్రీశైలం, కాలనీ పెద్దలు అమర్నాథ్ రెడ్డి బ్యాంకు వెంకటయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, శివ, వెంకన్న బాబు, కిరణ్, బబ్లు రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, అనిల్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మాచర్ల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 279 / 2019
బిట్వీన్ :
వడితె కనకా నాయక్ ...వాది
మరియు
రమావత్ భాష ...ప్రతివాది
To
రమావత్ భాష, S/o.కాలు, R/o.తునికినూతల తండా, పెదవూర(మం), నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు దావా నందు ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపినను ముట్టనందున మీకు సమన్లు నిమిత్తం ఈ పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.24-07-2025కి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా రోజు ఉ॥గం.10.30ని॥లకు పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ తరపు ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేనిచో సదరు దావాను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం)
వాయిదా తేది: 24-07-2025.
పఠాన్ చినమస్తాన్, B.A. LL.B.,
వాది తరపు న్యాయవాది, మాచర్ల, సెల్: 9866082828

మహారాజశ్రీ మాచర్ల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 274 / 2019
బిట్వీన్ :
వడితె కనకా నాయక్ ...వాది
మరియు
ముడావత్ మంగ్యా నాయక్ ...ప్రతివాది
To
ముడావత్ మంగ్యా నాయక్, S/o.పాండు నాయక్, R/o.బుడోని తండా, దేవరకొండ(మం), నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు దావా నందు ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపినను ముట్టనందున మీకు సమన్లు నిమిత్తం ఈ పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.22-08-2025కి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా రోజు ఉ॥గం.10.30ని॥లకు పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ తరపు ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేనిచో సదరు దావాను మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం)
వాయిదా తేది: 22-08-2025.
పఠాన్ చినమస్తాన్, B.A. LL.B.,
వాది తరపు న్యాయవాది, మాచర్ల, సెల్: 9866082828

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P. No. 107 / 2024
బిట్వీన్ :
గంజాయి అంజయ్య ...పిటీషనర్
మరియు
గంజాయి మార్తమ్మ ...రెస్పాండెంట్
To
గంజాయి మార్తమ్మ, W/o.అంజయ్య, D/o.తిరుపతి కృష్ణయ్య, R/o.మున్ననూరు గ్రామం, అమరాబాద్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు H.M.O.P. నందు మీరు రెస్పాండెంట్ అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపినను ముట్టనందున మీకు నోటీసు నిమిత్తం ఈ పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.13-08-2025కి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా రోజు ఉ॥గం. 10.30ని॥లకు పైకోర్టువారి ఎదుట మీరుస్వయంగా గాని లేదా మీ తరపు ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో సదరు H.M.O.P. మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం)
వాయిదా తేది: 13-087-2025.
పఠాన్ చినమస్తాన్, B.A. LL.B.,
పిటీషనరు తరపు న్యాయవాది, మాచర్ల, సెల్: 9866082828

అగర్వాల్ సమాజ్ సభ్యత్వాన్ని పెంచుతాం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : అగర్వాల్ సమాజ్ సభ్యత్వాన్ని పెంచుతామని తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అన్నారు. ఆదివారం జరిగిన అగర్వాల్ సమాజ్ తెలంగాణ కేంద్ర కమిటీ సభ్యుల కార్యనిర్వాహక కమిటీ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ ప్రచారాన్ని పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. అగర్వాల్ సమాజ్ భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. టీంను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి వికాస్ కుమార్ కేశన్, ఉపాధ్యక్షుడు రూపేష్ కుమార్ అగర్వాల్, ఇంకా ఒకేసారి సహాయ కార్యదర్శి గుప్తా మనోజ్ మిట్టల్, పూజ గుప్తా నవీన్ కుమార్ అగర్వాల్, నిధి అగర్వాల్, అర్చన అగర్వాల్ పాల్గొన్నారు.

దేవేందర్‌నగర్ ఫేజ్ 2 అధ్యక్షుడిగా చిన్నం గణేష్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ కార్పొరేషన్ 13వ డివిజన్ దేవేందర్ నగర్ ఫేజ్ 2 కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చిన్నం గణేష్ ఘన విజయం సాధించాడు. అదివారం ఉదయం కాలనీ అసోసియేషన్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఎన్నికల అధికారులు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులు పోటీ పడగా చిన్నం గణేష్‌కు 220 ఓట్లు రాగ సమీప ప్రత్యర్థి భగవంతంకు 36 ఓట్లు పోలాయ్యాయి, కొన్ని చెల్లని ఓట్లు పోలైనట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు బైరుగొండ మల్లేష్, సీసాల సత్తయ్య, చల్లా నరసింహలు, రవి, సుధాకర్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం చిన్నం గణేష్ విజేతగా ప్రకటించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కాలనీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి దోహద పడిన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పోగుల నరసింహ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ 13వ డివిజన్ ఇంచార్జ్ జెన్న రాజులకు ధన్యవాదాలు తెలిపారు. కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.

పటాన్‌చెరువులో బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సోమవారం బోనాల జాతరను పురస్కరించుకొని పట్టణంలోని అన్ని కాలనీలలో, బస్తీలలో పారిశుద్ధ్య ఏర్పాట్లను, మౌలిక వసతులు కల్పనలో జిహెచ్ఎంసి సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ బండ్లగూడ నందన్ రతన్ ఫ్రైడ్ సాయి గణేష్ కాలనీ, జేపీ కాలనీ, గోనమ్మ బస్తి, ఖుషి డిఫెన్స్ కాలనీ, పోచమ్మ తల్లి ఆలయం, ముదిరాజ్ బస్తి శాంతినగర్ కాలనీలలో ఈ రోజు ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ శానిటేషన్ సూపర్వైజర్ పవన్‌తో కలిసి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్న ఆలయాలను సందర్శించడం జరిగింది. బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్న ఆలయాల వద్ద పారిశుధ్య పనులు, బ్లీచింగ్, లైనింగ్ పనులతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే సోమవారం పటాన్ చెరువు పట్టణ పరిధిలో జరగనున్న బోనాల ఉత్సవాల నిర్వహణ కొరకు ఆలయాలను సందర్శించిన కార్పొరేటర్ బోనాల ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు, మరీ ముఖ్యంగా బోనాలు సమర్పించే ఆడ బిడ్డలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్పొరేటర్ జిహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్వైజర్ పవన్‌ని ఆదేశించడం జరిగింది.

నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న మాస్టర్ శివకృష్ణ గౌడ్

విశాలాంధ్ర - కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా షోటో ఖాన్ మాస్టర్ శివకృష్ణ గౌడ్ నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విజయవాడ పట్టణంలోని గుజ్జుల సరళ దేవి ఫంక్షన్ హాల్లో వైఎంకె అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో వైఎంకె అకాడమీ ప్రతినిధి మాస్టర్ రూపస్ పాల్, సినీ హీరో భానుచందర్‌ల చేతుల మీదుగా ఆయనను ఘనంగా సత్కరించడంతో పాటు సర్టిఫికెట్, మెడల్‌ను అందజేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. తనను గుర్తించి అవార్డును అందజేసిన వైఎంకె సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్తీ బాటతో కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - కాప్రా : "బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆదివారం పర్యటించారు. కాలనీలో ఉన్న ప్రధాన సమస్యల గురించి తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. గ్రీన్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవిరెడ్డి రంగారెడ్డి, అడ్వైసర్ శ్రీపాద సర్వేశ్వరరావు, గ్రీన్ హిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు నెమలి సత్తయ్య, గోవర్ధన్ రెడ్డి, మోసిన్, అల్తాఫ్, అశోక్, వరుణ్‌రెడ్డి, మోటె సురేష్, విజయ్‌గౌడ్, హనుమంత్, పాపి రెడ్డి, జహంగీర్, మధు రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి ఎస్సీ సెల్ అడ్వైసర్ పి జి.సుదర్శన్ మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టీ.శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్, మల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, కోయలకొండ రాజేష్, శ్రీనివాస్, సాయి, రఘు, హరి, రవి పాల్గొన్నారు.

న్యాయవాది శ్రీనివాస్ కావేటికి నెల్సన్ మండేలా అవార్డు

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ప్రముఖ అంతర్జాతీయ న్యాయవాది డా.శ్రీనివాస్ కావేటికి, నెల్సన్ మండేలా ఇంటర్నేషనల్ డే సందర్భంగా ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం వారు, యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో నెల్సన్ మండేలా అవార్డు, ఆక్స్ ఫర్డ్ మేయర్, లుబ్నా అర్షద్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇది అంతర్జాతీయ మానవహక్కుల పరిరక్షణ, అంతర్జాతీయ న్యాయ సంస్కరణలు, సామాజిక న్యాయ ఉద్యమాల్లో డా. కావేటి చేసిన విశేషకృషికి గుర్తింపుగా లభించింది. ఈ వేడుకకు ప్రత్యేకంగా 72వ అంతర్జాతీయ మిస్ వరల్డ్ పోటీలకు ఫ్రాన్స్ తరపున పారిస్ నుండి విచ్చేసిన మిస్ ఫ్రాన్స్ అగాథే కౌయే, మిస్ గ్రీస్ స్టెల్లా మిచైలిడూ హాజరయ్యారు. మిస్ అగాథే కౌయే, స్టెల్లా మిచైలిడూ, నెల్సన్ మండేలా సిద్ధాంతాల పట్ల సంఘీభావం వ్యక్తం చేయడమే కాక, ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ గొంతుకలను జత చేశారు. ఈ సందర్భంగా డా. కావేటి మాట్లాడుతూ "నెల్సన్ మండేలా పేరుతో ఈ అవార్డు పొందడం తనకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. నా బాధ్యతల్ని ద్విగుణీకృతం చేసిందన్నారు. భారతీయ వారసత్వం గల యుకె లో ఈ అవార్డు పొందడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మండేలా వారసత్వం మనకు ఒక విషయాన్ని గుర్తు చేస్తుందనీ, న్యాయానికి రాజీ లేదనీ, చట్టరంగంలోని మన కృషి అణగారిన వర్గాలకు బలమైన స్వరమివ్వాలనీ అన్నారు.

పరిశ్రమలకు పునరుత్తేజం

వేగవంతమైన వాణిజ్యం దిశగా అడుగులు

విశాలాంధ్ర-సచివాలయం: ప్రభుత్వం ఇంటికొక వ్యాపారవేత్తను తయారు చేసేందుకు 'వన్ ఫ్యామిలీ... వన్ ఎంట్రప్రెన్యూర్ అనే లక్ష్యాన్ని 2030 నాటికి చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తోంది. రాబోయే ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 22 లక్షల ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసేలా సహకారం అందిస్తోంది. వీటి ద్వారా సుమారు 5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి వాటిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వేగంగా నెరవేరుస్తోంది. రాష్ట్రానికి భారీ పరిశ్రమలను ఆకర్షిస్తూ వేల కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తోంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు యువత వ్యాపారవేత్తలుగా మారాలని అందుకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది.

2028 నాటికి 175 నియోజకవర్గాల్లో...

ఎంఎస్ఎంఈ పార్కులు రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఇంటికో ఎంట్రప్రెన్యూర్‌ను తయారు చేసేలా... నియోజకవర్గానికి ఒకటి చొప్పన మొత్తం 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మే నెలలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నారంపేటలో సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఒకే రోజు 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించారు. అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేలు, గన్నవరం, పాణ్యం, డోన్, ఆత్మకూరు, దర్శి, పుట్టపర్తిలో ఎంఎస్ఎంఈ పార్కులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. మొత్తం 909 ఎకరాల్లో వచ్చే ఈ 11 ప్రాజెక్టులకు రూ.199 కోట్లు ఖర్చు కానుంది. ఆత్మకూరు మండలం నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు 55 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటయింది. 40 నియోజకవర్గాల్లో మొదటి దశలో ఎంఎస్ఎంఈ పార్కులు అభివృద్ధి చేయాలని, 2028 నాటికి అన్ని నియోజకవర్గాల్లో ఈ పార్కులను ఏర్పాటు చేసి ఉపాధి మార్గాలను విస్తృతం చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ఎంఎస్ఎంఈలు రాష్ట్ర అభివృద్ధికి కీలక స్తంభాలు. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఎంఎస్ఎంఈలకే ఉంది. అందుకే వీటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇంతటి ప్రాధాన్యత ఇస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలోని మరో 40 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం 17 జిల్లాల్లో 29 ఎంఎస్ఎంఈ పార్కులు (2,329 ఎకరాల్లో) ఉన్నాయి. అందుబాటులో ఉన్న భూముల లభ్యత మేరకు నానో పార్కులను ఏర్పాటు చేయాలా లేక ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేయాలా అనే దానిపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండే చోట అదనంగా పార్కులను అభివృద్ధి చేసే యోచనలో ఏపీఐఐసీ ఉంది. ఆయా పార్కులలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి సరసమైన ధరలకే భూ కేటాయింపులు చేయడంతో పాటు అన్నివిధాలుగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది.

రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ పరిశ్రమల ప్రోత్సాహక కార్యాలయాలను ఏర్పాటు చేసి యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ ఇస్తున్నారు. నియోజకవర్గ మండల స్థాయిలో కూడా కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, నేటి నుంచి స్పీడ్ ఆఫ్ బిజినెస్ చేస్తున్నారు. ఎంఎస్ఎంఈ వెబ్ సైట్‌లో అన్ని వివరాలను అందజేస్తున్నారు. దీనికోసం ప్రత్యేక యాప్‌ను కూడా అందుబాటులో తీసుకువచ్చారు ఇప్పటికే చాలామంది ఎన్ఆర్ఐలు ఇక్కడ ఏ పరిశ్రమ నెలకొల్పితే బాగుంటుందోనని ఆలోచనలో చేస్తున్నారు. ప్రతి జిల్లాను మూడు సెక్టార్లుగా విభజించి అక్కడ ఏయే పరిశ్రమలు నెలకొల్పోవచ్చో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసి పీపీపీ, పీ ఫోర్ పద్ధతిలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ర్యాంప్ సర్వే నిర్వహించి సుమారుగా 30 లక్షల పరిశ్రమలు ఉన్నట్లుగా నిర్ధారించారు. యవత పరిశ్రమలు నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలు చాలా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రతి జిల్లాలోనూ ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలో ప్రణాళికలను రూపొందించి, ఆయా నియోజకవర్గాల్లో వనరులను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమలు నెలకొల్పేందుకు యువతను ప్రోత్సహిస్తున్నారు. ఏపీఐఐసీ ద్వారా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కనిష్ఠంగా 15 ఎకరాల నుంచి 100 ఎకరాల వరకు భూములను సేకరించి పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఆయా పార్కులలో ఏటా 2 వేలకు పైగా కొత్త యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ యూనిట్లకు రూ.10,586 కోట్లు ప్రోత్సాహకాలుగా అందించేందుకు అంచనాలు సిద్ధం చేసింది. ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం కొత్త పారిశ్రామికవేత్తలు వేగంగా యూనిట్లను గ్రౌండ్ చేసేందుకు బ్యాంకుల ద్వారా ఉదారంగా రుణాలు మంజూరు చేయడానికి చర్యలు చేపట్టింది. 2025-26లో ఎంఎస్ఎంఈలకు రూ.1.28 లక్షల కోట్ల రుణపరపతి కల్పించేలా బ్యాంకర్లను ఒప్పించారు. గతంలో రూ.87 వేల కోట్లు మాత్రమే రుణపరపతి కల్పించగా 48 శాతం ఎక్కువ రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ముందుకు వచ్చారు.

రతన్ టాటా హబ్‌ను కూడా పీపీ మోడ్‌లో తీసుకురానున్నారు. ప్రతి జిల్లాలో నాలుగు సెంటర్లు ఏర్పాటు చేసి యువతకు నైపుణ్యాభివృద్ధిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు కేంద్రం ఎంఎస్ఎంఈ ద్వారా రూ.200 కోట్లు సబ్సిడీ అందించింది. నూతన పరిశ్రమ నెలకొల్పాలంటే వ్యాపారవేత్తలకు ప్రోత్సాహకాలు కూడా అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. రాయలసీమ జిల్లాలను మినహాయిస్తే కోస్తా తీర ప్రాంతాల్లో ఏపీఐఐసీ వద్ద భూములు లేవు. కొన్ని జిల్లాల్లో కనీసం 2 ఎకరాలు అందుబాటులో ఉన్నా... ఎంఎస్ఎంఈ పార్కు కోసం తీసుకోవాలని ఏపీఐఐసీ భావిస్తోంది. జిల్లాల అవసరాలకు అనుగుణంగా పార్కులను అభివృద్ధి చేయనుంది. పార్కుల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద కేంద్రం అందిస్తుంది. కనీసం 10 ఎకరాల లోపు భూములు అందుబాటులో ఉంటే నానో పార్కులను, 2 ఎకరాలు మాత్రమే ఉంటే ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలని ఏపీఐఐసీ యోచిస్తోంది. 10 నుంచి 100 ఎకరాలు అందుబాటులో ఉన్న చోట ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేసి వాటిలో మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. మైక్రో, స్మాల్, మీడియం పరిశ్రమలు ఎన్ని నిర్వహిస్తున్నారో లెక్క తేల్చేందుకు ఉపక్రమించారు. దీని ఆధారంగా సమగ్ర డేటాను సిద్ధం చేయనున్నారు. ఉత్పత్తుల మార్కెటింగ్, కూలీలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు అవసరత, నూతన టెక్నాలజీ అందించడానికి జిల్లా స్థాయిలో సర్వే అనంతరం కసరత్తు చేసి పరిశ్రమలు మరింత ఉత్తేజంగా పని చేయడానికి 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఓ ప్రణాళిక రూపొందించనున్నారు. రాష్ట్రంలో నియోజకవర్గానికొక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడం, ఇంటికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం : జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖండించారు. మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ట్వీట్ చేశారు. ఇది పూర్తిగా అక్రమ కేసు, ప్రజల తరపున పోరాడే వారి గొంతు మూయించే కార్యక్రమం తప్ప మరొకటి కాదని, టీడీపీ ప్రభుత్వపు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ అరెస్టు అని పేర్కొన్నారు. లేని మద్యం స్కామ్‌ను ఉన్నట్లుగా చూపించి... ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కేసు అంతా ప్రలోభాలు, బెదిరింపులు, థర్డ్ డిగ్రీ ద్వారా తప్పుడు వాంగ్మూలాలు తీసుకుని నడిపిస్తున్నదేనని తెలిపారు. చంద్రబాబు తన 2014-19లో మద్యం పాలసీలో అక్రమాలకు పాల్పడ్డారని, దానికి సంబంధించి ఆధారాలతో సహా కేసు నమోదయిందని, ఆ కుంభకోణంలో బెయిల్ మీద ఉన్నారని తెలిపారు. ఈ కేసును కొట్టేయించేందుకు, ఇప్పటి పాలసీని సమర్థించుకునేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వం రూపొందించిన పాలసీని తప్పుబడుతున్నారని వివరించారు. చంద్రబాబు ప్రస్తుతం తన గత హయాంలోని అవినీతి పద్ధతులను పున: ప్రారంభించారని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా బెల్టు షాపులు, పర్మిట్ రూమ్‌లు వెలిశాయని తెలిపారు. మా హయాంలో వేలాది బెల్టు షాపులు, పర్మిట్ రూమ్‌లను మూసివేయించామని, మద్యం దుకాణాలను గణనీయంగా తగ్గించామని, వైసీపీ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఆ చర్యలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. మద్యం దుకాణాల మంజూరు విషయంలో మాఫియా రంగంలోకి దిగిందని, మా హయాంలో పారదర్శకంగా జరిగిన ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేశారని తెలిపారు. చంద్రబాబు మద్యం స్కామ్‌తో సహా అనేక తీవ్రమైన అవినీతి కేసుల్లో ఉన్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు తన మీద ఉన్న కేసుల దర్యాప్తును నిలిపివేశారన్నారు. ఆ విషయాల నుంచి దృష్టి మళ్లించడానికే తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని జగన్ ధ్వజమెత్తారు.

మోదీ విధానాలతో దేశానికి నష్టం

డేగా ప్రభాకర్, తాటిపాక మధు

విశాలాంధ్ర-అమలాపురం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలతో దేశ ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు అన్నారు. సీపీఐ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 2వ మహాసభల సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభలో నాయకులు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ధరల షాక్ తగులుతుందని అన్నారు. మీటర్లు బిగించకుండా జాగ్రత్త పడాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్త గౌతం అదానీకి దోచి పెట్టడం కోసమే ప్రధాని మోదీ తపిస్తున్నారని డేగా ప్రభాకర్, తాటిపాక మధు విమర్శించారు. తొలుత సీపీఐ జెండాను డా॥ చెలికాని స్టాలిన్ ఆవిష్కరించారు. ప్రతినిధుల సభకు బండారు సావిత్రి, జేసుదాసు, శీలం వెంకటేశ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, దేవ రాజేంద్రప్రసాద్, పెద్దిరెడ్డి రాము, కె.రామకృష్ణ, నిమ్మకాయల శ్రీనివాస్, గెడ్డం ప్రభాకరరావు, డి.చిట్టిరాజు తదితరులు ప్రసంగించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు వి.సామ్యూల్, ప్రేమానందం, శారదా, వరలక్ష్మి విప్లవగేయాలు ఆలపించారు.

ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ: మంత్రి డోలా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోటీ పరీక్షల కోసం ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచితంగా శిక్షణను డా.బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ కేంద్రాల ద్వారా కల్పిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఇందుకోసం తగు చర్యలకుగాను శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. శిక్షణ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు మంత్రి ఆదివారం ఒక ప్రకటన చేశారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా బ్యాంక్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే నియామకాల కోసం పరీక్షలకుగాను ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థుల దరఖాస్తులు త్వరలోనే స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పద్వినియోగించుకోవాలని నిరుద్యోగులకు మంత్రి డోలా సూచించారు.

రాజధాని పనుల్లో జాప్యం వద్దు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వానలు ఉన్నాగానీ అమరావతిలో రాజధాని నిర్మాణ పనుల్లో జాప్యం ఉండకూడదని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులు, కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. పనుల పురోగతిపై సీఆర్‌డీఏ, ఏడీసీ ఇంజనీర్‌లతో చర్చించారు. భవనాలు, రోడ్లు, ఇతర నిర్మాణాల గురించి తెలుసుకున్నారు. కార్మికులు ఉపయోగిస్తున్న యంత్రాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. వానాకాలంలోనూ పనులు జాప్యం కాకుండా తగు ప్రణాళిక రూపొందించాలని సమీక్షా సమావేశంలో మంత్రి సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ చదివే షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. 3.93 లక్షల మందికి ఆర్థిక సహాయంలో 40 శాతంగా రూ.382.66 కోట్లు జమ చేసింది. 9, 10 తరగతుల ఎస్సీ డే-స్కాలర్ విద్యార్థులకు రూ.10,900 అందజేసింది. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు 8,800 రూపాయలను ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో వేసింది. ఇంటర్మీడియట్ ఎస్సీ విద్యార్థులకు ర్యాంకింగ్ ఆధారంగా రూ.5,200 నుంచి రూ.10,972 వరకు జమ చేసింది.

సీఐడీ హోంగార్డు ఎంపికకు

27-29 తేదీల్లో కంప్యూటర్ నైపుణ్య పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఐడీ హోంగార్డుల ఎంపికకు మూడవ దశ కంప్యూటర్ నైపుణ్య పరీక్షను ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు విట్ ఏపీ యూనివర్సిటీ (అమరావతి)లో నిర్వహించనున్నట్లు సీఐడీ డీజీ ప్రకటించారు. హోంగార్డుల ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేయగా, మొత్తం 12,569 దరఖాస్తులు అందాయని తెలిపారు. తొలి దశలో దరఖాస్తుల పరిశీలన, రెండో దశలో శారీరకమాపక పరీక్ష, సర్టిఫికెట్ ధృవీకరణ జరుగుతాయన్నారు. ఆ తర్వాత 5,567 మంది అభ్యర్థులు తదుపరి దశకు అర్హత పొందారని తెలిపారు. వీరికి మూడో దశలో కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డుతో పాటు దాని ప్రతిని తేవాలని సూచించారు. ఒరిజినల్ హాల్‌టికెట్, ఆధార్ కార్డు, జిరోక్స్ లేకుండా వచ్చినా... సమయానికి రాకపోయినా అనర్హులవుతారని సీఐడీ డీజీ వెల్లడించారు.

ప్రియురాలిని చంపిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్

అహ్మదాబాద్: ఇద్దరి మధ్య గొడవ తారాస్థాయికి చేరుకోవడంతో సహనం లోల్పోయిన సీఆర్పీఎఫ్ జవాను... తన ప్రియురాలైన మహిళా ఏఎస్ఐని హత్య చేసిన ఘటన గుజరాత్‌లోని కచ్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... అంజార్ పోలీస్ స్టేషన్‌లో అరుణాబెన్ సతుభాయ్ జాదవ్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తోంది. 2021లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ దిలీప్ డాంగ్చియాతో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. అదికాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. త్వరలో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దిలీప్ డాంగ్చియా ప్రస్తుతం మణిపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల వీరిమధ్య గొడవలు జరుగుతున్నాయని ఇరుగుపొరుగు వారు చెప్పారు. వివాహం చేసుకునే విషయంపైనే ఇద్దరిమధ్య గొడవ జరిగింది.

13న మోదీ, ట్రంప్ దిష్టిబొమ్మల దహనం

ఎస్‌కేఎం జాతీయ సదస్సు నిర్ణయం: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమెరికా, భారత్ మధ్య జరిగే స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం వల్ల దేశంలో రైతాంగానికి, పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీనికి వ్యతిరేకంగా ఆగస్టు 13న నిరసన ప్రదర్శనలు చేసి... మోదీ, ట్రంప్ దిష్టి బొమ్మలు దహనం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తెలిపారు. న్యూఢిల్లీలోని హరికిషన్‌సింగ్ సూర్జిత్ భవన్‌లో ఆదివారం జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) జాతీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కేవీవీ ప్రసాద్ ప్రసంగిస్తూ అమెరికా, ఇంగ్లాండ్ తదితర దేశాల నుంచి మన దేశానికి దిగుమతి అవుతున్న వస్తువులపై సుంకాలు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన మన వ్యవసాయ, అను బంధ రంగాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని విమర్శిం చారు. పాల ఉత్పత్తులు, పప్పు దినుసులు, పౌల్ట్రీ, ఆయిల్ పామ్ తదితర ఉత్పత్తులు కారుచౌకగా దిగుమతి చేసుకోవడం వలన దేశీయ వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మన ఎగుమతులపై ట్రంప్ సర్కారు అధిక సుంకాలు వేయడంతో మన వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతున్నప్పటికీ... కేంద్ర ప్రభుత్వం మౌన వహించడం అత్యంత దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగిస్తూ వినియోగదారులపై మోయలేని భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. ఆ ప్రయత్నాలను వ్యతిరేకించాలని సంయుక్త కిసాన్ మోర్చా ప్రజలను కోరిందన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ కార్పొరే ట్లకు భూములు కట్టబెట్టే ప్రయత్నాలను నిరసించాలని, అందుకు తగిన ఆందోళన అవసరముందని పేర్కొన్నారు. నాడు రైతాంగ ఉద్యమం విరమణ సందర్భంగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు సి2+50 శాతం నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీలో కొనసాగుతున్న రైతాంగ ఉద్యమాలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. నెల్లూరు జిల్లా కరేడు ప్రాంతంలో ప్రజల ఆమోదం లేకుండా ఇండోసోల్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం భూములు కట్టబెట్టడానికి నోటిఫికేషన్ జారీ చేయడం వలన రైతులు అందోళన చెందుతున్న అంశాలను కేవీవీ ప్రసాద్ సమావేశంలో ప్రస్తావించారు. రాష్ట్రంలో 14 జిల్లాల్లో 400 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, పదేళ్లపాటు వినియోగించిన ట్రాక్టర్లను నిషేధించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వం రైతు ఉద్యమానికి తలవంచి భూ సేకరణను ఉపసహరించుకున్న నేపథ్యంలో ఏపీలో కూటమి ప్రభుత్వం ఆ కంపెనీని ఆహ్వానించి రైతుల భూములు కట్టబెట్టడానికి ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. నవంబర్ 26న దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యలపై పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని సమావేశ నిర్ణయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సమావేశానికి ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ సమితి పి.జమలయ్య, కె.వీరారెడ్డి, బుడిపి అప్పలనాయుడు, పి.గంగాభవాని తదితరులు హాజరయ్యారు.

ప్రజా సమస్యలపై కేంద్రాన్ని నిలదీస్తాం

- అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని ప్రశ్నిస్తాం
- పహల్గాం, ఎస్ఐఆర్, ట్రంప్ వ్యాఖ్యలపై సమాధానాన్ని కోరతాం
- సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాల్లో ప్రజా సమస్యలపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, పహల్గాం, ఎస్ఐఆర్, ట్రంప్ వ్యాఖ్యలపై సమాధానాన్ని డిమాండ్ చేస్తామని సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ ఆదివారం వెల్లడించారు. అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యంపై మోదీ మౌనాన్ని ఆక్షేపించారు. పహల్గాం దాడి వెనుక భద్రతా వైఫల్యాన్ని ప్రశ్నించారు. భారత్-పాక్ యుద్ధంలో కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు, భరతమాత చిత్రంపై వివాదం తదితర అంశాలను పార్లమెంటులో లేవనెత్తనున్నట్లు సంతోశ్ కుమార్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి దారితీసిన భద్రతాపరమైన వైఫల్యాలకు ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు. కీలక అంశాలను పార్లమెంటులో తమ పార్టీ ప్రస్తావించబోతోందన్నారు. పహల్గాం దాడి వెనుక ఇంటెలిజెన్స్ వైఫల్యం, ట్రంప్ వ్యాఖ్యలు, బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ, భరతమాత వివాదం వంటి అనేక అంశాలపై పార్లమెంటును దద్దరిల్లించేందుకు ప్రతిపక్షాలతో కలిసి సీపీఐ గళం వినిపించనున్నట్లు సంతోశ్ కుమార్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని నుంచి సమాధానాన్ని దేశ ప్రజలు కోరుతున్నారన్నారు. అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యానికి, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాలకు ఈ పరిణామాలు అద్దం పట్టాయని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో ప్రధాని మౌనాన్ని ఆయన ఖండించారు. ప్రభుత్వ విదేశాంగ విధానం విఫలమైందని విమర్శించారు. భారత సార్వభౌమత్వానికి సంబంధించిన అంశాల్లో విదేశీ జోక్యాన్ని సహించేదిలేదని నొక్కి చెప్పారు. బీహార్‌లో ఎస్ఐఆర్ విధానాన్ని వ్యతిరేకించారు. ఇది పేదలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, వలస కూలీల ఓటు హక్కును హరించే ప్రయత్నంగా దుయ్యబట్టారు. మతపరమైన వ్యాఖ్యలు చేసిన జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసనకు పెండింగ్ ఉన్న నోటీసుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లౌకికవాదానికి, రాజ్యాంగ విలువలకు ఏ మేరకు పార్లమెంటు కట్టుబడి ఉన్నదో ఈ చర్యలతో రుజువు అవుతుందని అన్నారు. అదే సమయంలో ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీల హత్యలను సంతోశ్ కుమార్ ఆక్షేపించారు. కర్నాటకలోని ధర్మశాలకు సంబంధించిన నివేదికలపై ఎన్ఐఏ విచారణకు డిమాండ్ చేశారు. ఇదే అంశమై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసినట్లు సంతోశ్ కుమార్ తెలిపారు. ధర్మశాలలో హత్యలు, మానభంగాలు, సామూహిక ఖననాలు తదితరాలపై విచారణ బాధ్యతను ఎన్ఐఏకు అప్పగించాలన్నారు. కార్మికులు, రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ జులై 9న దేశవ్యాప్త సమ్మె విజయవంతమైందని చెప్పారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల రద్దు, ఎంఎస్‌పీకి చట్టబద్ధత కోసం సీపీఐ ఎంపీ డిమాండ్ చేశారు. కేరళలోని ఆశా వర్కర్లకు పెండింగ్ ఉన్న వేతనాల్లో కేంద్ర వాటాను వెంటనే విడుదల చేయాలని కూడా డిమాండ్ చేశారు. జాతీయ మైనారిటీ కమిషన్‌లో క్రైస్తవ సమాజానికి ప్రాతినిధ్యం నిరాకరించడాన్ని ప్రశ్నించారు. దేశ తప్పుడు మ్యాప్‌లను గవర్నర్లు ప్రదర్శిస్తుండటం, అధికారిక కార్యక్రమంలో భరతమాత పేరిట చిత్రాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ అన్ని అంశాలను పార్లమెంటులో లేవనెత్తుతామని, దేశ ప్రజల పట్ల కేంద్ర ప్రభుత్వ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తామని, సర్కారును దీస్తామని సీపీఐ ఎంపీ వెల్లడించారు.

ఉద్యోగాలు కావాలి... ఉపన్యాసాలు కాదు: రాహుల్

న్యూఢిల్లీ: బీజేపీ-నితీశ్ పాలనలో బీహార్ యువతకు ఉపాధి, ఉద్యోగాకాశాలే కరువయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ రాష్ట్ర యువతకు కావాల్సినది ఉద్యోగాలే తప్ప ఉపన్యాసాలు కాదని ఆయన ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. బీజేపీ, నితీశ్ పాలనలో బీహార్ నిరుద్యోగ రేటు తారస్థాయికి చేరిందని విమర్శించారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక లక్షల మంది జీవనోపాధి కోసం వలస బాట పట్టక తప్పడంలేదన్నారు. బీహార్ యువత కష్టజీవులని వారిలో సామర్థ్యత, నైపుణ్యత ఉన్నాయని, స్థానికంగా గౌరవమైన ఉద్యోగాలే లేవని రాహుల్ అన్నారు. బీహార్ యువత తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసే ఉపాధిని కోరుకుంటున్నారని తెలిపారు. ఇదే సందేశాన్ని కిక్కిరిసిన 'మహా రోజ్‌గార్ మేళ' ఇస్తోందని రాహుల్ అన్నారు. నిరుద్యోగమనే అగ్నిలో బీహార్ దహించిపోయే దుస్థితిని బీజేపీ, నితీశ్ సర్కారు తీసుకు వచ్చిందని విమర్శించారు. లక్షల మంది యువత తమ కుటుంబాలు, స్వగ్రామాలను వీడి వలసలు వెళు తున్నారన్నారు. ప్రస్తుతం మార్పు మొదలైందని, కాంగ్రెస్ -ఇండియా ఐక్య సంఘటన హామీలు ఇవ్వడమే కాదు పరిష్కారాలతో ముందుకొస్తోందని రాహుల్ వక్కాణించారు. నైపుణ్యాభివృద్ధి హక్కు, ప్రతి యువజనుడికి ఉపాధి, వలసలు ఆపడం, కుటుంబ సభ్యులంతా కలిసి ఉండేలా చేయడం ద్వారా బీహార్‌ను సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. సమ్మిళిత వృద్ధి, స్వావలంభనకు కట్టుబడి ఉన్నట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు.

రైతులకు ఏడీజీ క్షమాపణ

పట్నా: బీజేపీ పాలిత రాష్ట్రమైన బీహార్‌లో శాంతిభద్రతలు అదుపు తప్పి కొద్ది రోజులుగా హత్యలు పెరిగిపోతున్నాయి. హంతకులను పట్టుకునే విషయంలో విఫమైన ఆ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీ) కుందం కృష్ణన్ సహనం కోల్పోయారు. మార్చి నుంచి మే మధ్యనే అత్యధిక హత్యలు జరుగుతున్నాయని, దీనికి వ్యవసాయదారులే కారణమని నోరుపారేసుకున్నారు. పనిలేనికాలంలో కాంట్రాక్ట్ కిల్లర్లుగా అవతారమెత్తున్నారని, డబ్బుల కోసం, ఉపాధి కోసం మనుషులను చంపుతున్నారని ఏడీజీ కుందం కృష్ణన్ ఆరోపించారు. అతడి వ్యాఖ్యలపై అన్నదాతలు, రైతు సంఘాలు, ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ఏడీజీ వ్యాఖ్యలపై రోజురోజుకు విమర్శలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో తాజాగా తన వ్యాఖ్యలపై క్షమాపణ కోరుతున్నట్లు ఏడీజీ కృష్ణన్ ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ వీడియో సందేశం విడుదల చేశారు. రైతులను అవమానించడం తన ఉద్దేశం కాదని, అన్నదాతలంటే తనకు ఎనలేని గౌరవమని, తన మాటలను తప్పుగా ప్రచారం చేశారని రాసుకొచ్చారు.

దొంగ బాబా దారుణాలు

ముంబై: శాస్త్రసాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లోనూ ప్రజల్లో మూఢ నమ్మకాలు మాత్రం తగ్గలేదు. కొత్త బాబాలు పుట్టుకొస్తూనే ఉన్నారు. పూజల పేరిట అమాయక జనాలను హింసిస్తూనేన్నారు. తాజాగా మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్ జిల్లాలో బయటపడ్డ దొంగ బాబా దారుణాలు దీనికి అద్దం పడుతున్నాయి. ఆ బాబా పూజల పేరుతో ప్రజల్ని హింసిస్తున్నాడు. తన దగ్గరకు సమస్యలతో వచ్చే వారిని కొట్టడమే కాకుండా వారితో బలవంతంగా తన మూత్రాన్ని తాగిస్తున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే... సంజయ్ పగారే అనే వ్యక్తి బాబాగా అవతారం ఎత్తాడు. శియూర్ గ్రామంలోని గుడిలో తన ఆశ్రమాన్ని ప్రారంభించాడు. దెయ్యాల్ని వదిలిస్తానని, పెళ్లిళ్లు కాని వారికి పెళ్లిళ్లు అయ్యేలా చేస్తానని, పిల్లలు పుట్టని వారికి సంతానం కలిగేలా చేస్తానని, రోగాలు నయం చేస్తానని ప్రచారం చేసుకున్నాడు. అతడిని నమ్మి వచ్చిన వారిని బాగా కొట్టేవాడు. ఆడ,మగ అన్న తేడా లేకుండా అందరితో దారుణంగా ప్రవర్తించేవాడు. వాళ్ల చెప్పులు, షూలను నోట్లో పెట్టుకోమని చెప్పేవాడు. కొన్ని సార్లు చెట్ల ఆకుల్ని ఇచ్చి తినమనే వాడు. అలా చేస్తే రోగాలు నయం అవుతాయని చెప్పేవాడు. అంతేకాదు... తన దగ్గరి వచ్చే వాళ్లతో యూరిన్‌ను తాగించేవాడు. యాంటీ సూపర్‌స్టిషన్ ఆర్గనైజేషన్ జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో ఈ దారుణాలు వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో బాబా మహిళ గొంతును కాలితో తొక్కుతూ ఉన్నాడు. మరో వీడియోలో మహిళను కర్రతో కొడుతున్నాడు. ఈ వీడియోలు పోలీసు అధికారుల దృష్టికి వెళ్లాయి. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.